thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 58 | కరీంనగర్ శుక్రవారం, 9 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## గుండెపోటుకు చైనా వ్యాక్సిన్!

న్యూఢిల్లీ: గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించడానికి చైనా వ్యాక్సిన్‌ను రూపొందించింది. రక్తనాళాలు గట్టిపడడం, రక్తవాహికల్లో రక్త ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడడానికి కారణమయ్యే 'ప్లేక్స్' ఏర్పడడాన్ని ఈ నానో వ్యాక్సిన్ నిరోధిస్తుంది. నాన్జింగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, చైనా యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా 'కాక్‌టైల్' రూపంలో ఈ నానో వ్యాక్సిన్‌ను రూపొందించాయి. రక్తనాళాలు పెళుసుబారకుండా, వాహికల్లో కొవ్వు పొరలు (ప్లేక్స్) ఏర్పడకుండా అనేక ప్రొటీన్లు పనిచేస్తున్నాయన్న పూర్వ పరిశోధనా ఫలితాలు తాజా రూపకల్పనకు స్ఫూర్తి. అలా పనిచేసే వాటిలో పీ210 కారకం ఒకటి. దీనిని ఐరన్ ఆక్సైడ్ నానోపార్టికల్స్‌కు జత చేశారు. ఇలా తయారుచేసిన వ్యాక్సిన్ రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి ఒక ఉత్ప్రేరకాన్ని వాడారు. దీనిని తొలిదశలో ఎలుకలపై ప్రయోగించినప్పుడు చక్కటి ఫలితాలు వచ్చాయి.

# పాక్ చర్యలపై అస్సలు తగ్గని మోదీ సర్కార్

# మన సైన్యానికి పూర్తి స్వేచ్ఛ!




ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్,పాకిస్తాన్ బార్డర్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సరిహద్దులోని భారత పౌరులను లక్ష్యంగా చేసుకుని పాక్ కాల్పులు జరుపుతోంది. మే 7న అర్ధరాత్రి పాక్ జరిపిన కాల్పుల్లో 13 మంది పౌరులు చనిపోయారు. మే 8న అమృత్ సర్ ను టార్గెట్ చేసిన పాక్ .. మిసైల్ తో దాడి చేసేందుకు ప్రయత్నించింది. అమృత్ సర్ పరిసర ప్రాంతాల్లో మిసైల్ శకలాలు లభ్యమయ్యాయి. దీంతో కేంద్రం అలర్ట్ అయ్యింది. సరిహద్దు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. అటు పాకిస్థాన్ బార్డర్ లోని రాజస్తాన్, పంజాబ్ బార్డర్ లను మూసివేశారు. రాజస్థాన్,పంజాబ్ లలో బహిరంగ సభలపై ఆంక్షలు విధించారు.సరిహద్దులో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే కాల్చివేయమని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది కేంద్రం. పాకిస్తాన్‌తో 1,037 కి.మీ సరిహద్దును పంచుకునే రాజస్థాన్‌లో హై అలర్ట్ ప్రకటించారు.

సరిహద్దును పూర్తిగా మూసివేస్తున్నామని, ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సరిహద్దు భద్రతా దళ సిబ్బందికి కాల్పులు జరపాలని ఆదేశాలు జారీ చేశామని అధికారులు తెలిపారు. జోధ్‌పూర్, కిషన్‌గఢ్ , బికనీర్ విమానాశ్రయాల నుంచి విమానాల రాకపోకలను మే 9 వరకు నిలిపివేశారు. సుఖోయ్-30 ఎంకేఐ జెట్‌లు గంగానగర్ నుంచి రాన్ ఆఫ్ కచ్ వరకు వైమానిక గస్తీ నిర్వహిస్తున్నాయి. బికనీర్, శ్రీ గంగానగర్, జైసల్మేర్ , బార్మర్ జిల్లాల్లోని పాఠశాలలు మూసివేయబడ్డాయి, పరీక్షలు వాయిదా వేయబడ్డాయి. పోలీసులు ,రైల్వే సిబ్బంది సెలవులు రద్దు చేశారు. పంజాబ్‌లో, అన్ని పోలీసు సిబ్బంది సెలవులను రద్దు చేశారు. బహిరంగ సభలపై ఆంక్షలు విధించారు. సరిహద్దుల్లో ఉద్రిక్తత కారణంగా ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను రద్దు చేశారు.




## హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రానివ్వొద్దనే 'హైడ్రా' తెచ్చాం

హైదరాబాద్: దేశంలోని పలు మెట్రో పాలిటన్ నగరాల్లో జీవించలేని పరిస్థితులు నెలకొంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రానియొద్దని భావించి హైడ్రాను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. సికింద్రాబాద్ బుద్ధభవన్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

"బెంగళూరులో గత ఏడాది వేసవిలో నీటి కరవు వచ్చింది. ముంబయి, చెన్నై వంటి నగరాల్లో వరదలు వస్తే.. 2, 3 అంతస్తుల భవనాలు సైతం మునిగిపోయిన పరిస్థితుల్ని మనం చూశాం. దేశ రాజధాని దిల్లీలో కాలుష్యం పెరిగిపోయి జీవించలేని పరిస్థితి నెలకొంటున్నాయి. ఈ ఉపద్రవం నుంచి గుణపాఠం నేర్చుకోకపోతే నష్టం జరుగుతుంది. అందుకే అలాంటి నగరాల సరసన హైదరాబాద్ చేరకూడదనే ఉద్దేశంతోనే.. ఎవరెన్ని విమర్శలు చేసినా ఆక్రమణలను నియంత్రించదలచుకున్నాం" అన్నారు.

**చెరువులు కనుమరుగైతే.. మనుగడ ఉండదు...** "మన పూర్వీకులు మనకు ఇచ్చిన చెరువులను కాపాడుకోవాలి. చెరువులు కనుమరుగైతే మనకు మనుగడ ఉండదు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న నగరాన్ని కాపాడుకొనేందుకు హైడ్రా ఉపయోగపడుతుంది. మంచి పరిపాలన అందించేందుకు రాజ్యాంగాన్ని 76 ఏళ్లలో రాజ్యాంగాన్ని 100 సార్లకు పైగా సవరించుకున్నాం. నగరాభివృద్ధి కోసం కోసం గత సీఎంలు ఎన్నో చట్టాలు చేశారు. 1908లో హైదరాబాద్‌లో వచ్చిన వరదలు అప్పటి నిజాం సర్కార్‌ను కదిలించింది. కకావికలంగా మారిన హైదరాబాద్‌ను చూసి నాటి నిజాం కన్నీరు పెట్టుకున్నారు. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు మళ్లీ రావొద్దని భావించారు. గొప్ప ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను పిలిపించి హైదరాబాద్‌లో మూసీపై డ్రైనేజీ వ్యవస్థ నిర్మించారు. పాతబస్తీ అంటే.. వెనుకబడిన ప్రాంతంగా పేరు స్థిరపడిపోయింది. ఓల్డ్ సిటీ అంటే.. ఒరిజినల్ సిటీ అని భావించి అభివృద్ధి చేయాలని నిర్ణయించాం" అన్నారు.

**హైడ్రా.. ప్రజల ఆస్తులను రక్షించేది...** "హైడ్రా అంటే.. ఇళ్లు కూల్చేది అన్నట్లుగా కొందరు దుష్ప్రచారం చేశారు. హైడ్రా అంటే ప్రభుత్వ, ప్రజల ఆస్తులను రక్షించేది. చిన్న వర్షం వస్తే.. నగరంలో కాలనీలు మునిగిపోతున్నాయి. పేదల కాలనీలకు వెళ్లే దారులను పెద్దలు ఆక్రమిస్తున్నారు. కబ్జాకు గురైన చెరువులు, నాలాలు, కాలనీల రోడ్లను హైడ్రా రక్షిస్తోంది. వర్షం వస్తే.. రో డ్లపై కూలిన చెట్లను హైడ్రా నిమిషాల్లోనే తొలగిస్తోంది. లేక్‌వ్యూ ఫేస్‌తో చెరువుల పక్కన కొందరు ఫామ్‌హౌస్‌లు, గెస్ట్ హౌస్‌లు నిర్మించుకున్నారు. వాటి నుంచి వ్యర్థాలు, మురుగునీటిని చెరువు ల్లోకి వదులుతున్నారు. చెరువులు, నాలాలు ఆక్రమించిన వారికే హైడ్రా అంటే భయం. వరదనీరు ప్రవహించాల్సిన నాలాలపై ఇళ్లు, అపార్టుమెంట్‌లు వెలిశాయి. మూసీ పక్కన పడుకుంటే అక్కడ కష్టాలు ఎలా ఉంటాయో ఆ నేతలకు తెలుస్తాయి" అన్నారు.

## హైదరాబాద్ పాతబస్తీలో హైడ్రా..

## బుల్‌డోజర్లు ఎక్కి ఎంఐఎం నిరసన..

పాతబస్తీలో హైడ్రా కూల్చివేతలు ఉద్రిక్తంగా మారాయి. భారీ పోలీస్ బందోబస్తు మధ్య చాంద్రాయణ గుట్టలోని అక్బర్ నగర్‌లో షాపులను హైడ్రా కూల్చేసింది. దాంతో పోలీసులకు పాతబస్తీ వాసులకు మధ్య తోపులాట జరిగింది. హైడ్రా జేసీబీ ఎక్కి, జేసీబీ ముందు పడుకొని కూల్చివేతలను స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. హైడ్రాకు, రంగనాథ్‌కు వ్యతిరేకంగా ఎంఐఎం కార్పొరేటర్లు నిరసనలు చేశారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్న అక్కడి నుంచి పీఎస్‌కు తరలించారు. ఎంఐఎం పార్టీ విషయానికొస్తే.. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి తాబేదార్లుగా వ్యవహరిస్తూ ఉంటారు. మొన్నటి వరకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో ఆ పార్టీ చెంతన చేరారు. వాళ్లు ఓల్డ్ సిటీ ఏం చేసినా.. బీఆర్ఎస్ ధృతరాష్ట్రుడిలా చూసి చూడనట్టు వ్యవహరించేది. అప్పట్లో ఎంఐఎం పార్టీ వాల్లు.. రాష్ట్రంలో కారు పార్టీ అధికారంలో ఉన్నా..స్టీరింగ్ తమ చేతిలో ఉన్నట్టుగా ప్రజలు చెప్పుకునేవారు. వాళ్లకు భయపడే అప్పటి బీఆర్ఎస్ సర్కార్.. పాతబస్తీలో మెట్రో రైలును కనెక్టివిటీని ఆపేసింది. కేసీఆర్ సర్కార్ కంటే ముందే రాజశేఖర్ రెడ్డి హయాములో ఎంఐఎం వాళ్లు పాడిందే పాట.. ఆడిందే ఆట అన్నట్టుగా సాగింది. టీటీపీ అధికారంలో ఉన్నపుడు కొంత కాలం ఎంఐఎంకు కొంత సత్సంబంధాలు కొనసాగాయి. కానీ ఓ సందర్భంలో వినాయక నిమజ్జనం నేపథ్యంలో అప్పట్లో చార్మినార్ ఎమ్మెల్యేగా ఉన్న అసదుద్దీన్ ఓవర్ యాక్టింగ్ చేస్తే చార్మినార్ ముందే కేంద్ర బలగాలతో అసద్ తాట తీయించాడు చంద్రబాబు. ఆ తర్వాత కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో మహావీర్ హాస్పిటల్ ఇష్యూలో ఓవైసీ బ్రదర్స్ కు చుక్కలు చూపించాడు. దీంతో అప్పటి నుంచి వీరు కిరణ్ కుమార్ రెడ్డి పై గుర్రుగా ఉండేవారు.

తాజాగా రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి జెల్ల కొట్టి మళ్లీ కాంగ్రెస్ చక్కనెక్కారు. ఇక రేవంత్ రెడ్డి కూడా వీళ్ల ఆగడాలను కళ్లు మూసుకున్నట్టుగానే కనిపించింది. తాజాగా హైడ్రా రంగంలోకి దిగడంతో చట్టం ముందు అందరు సమానమే అని ఓవైసీ బ్రదర్స్ కు గట్టి సంకేతం పంపించాడు రేవంత్. మరి పాతబస్తీలో ఉన్న ఈ అక్రమ కట్టడాల విషయంలో చివరి వరకు రేవంత్ సర్కార్ ఇదే దూకుడును కంటిన్యూ చేస్తాడా లేకపోతే ఓవైసీ బ్రదర్స్ కు సరెండ్ అవుతాడా అనేది చూడాలి.



## ఎన్ని అప్పులున్నా.. సంక్షేమ పథకాల అమలు : డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం : పదేళ్ల పాలన గాలికి వదిలేసి, ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రేలాపనలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఖమ్మంలో మెడికల్ కళాశాల భవన శంకుస్థాపన కార్యక్రమంలో భట్టి తో పాటు, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైద్య ఆరోగ్య దామోదర రాజనర్సింహం, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా భట్టి మాట్లాడుతూ%ౌ% ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం సంతోషంగా ఉందని చెప్పారు.

**ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోవాలని సీఎం వివరించారు..** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులు అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారని భట్టి చెప్పారు. అంతేగానీ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ఉద్యోగుల అవసరాలు తీర్చడంలో ప్రభుత్వం ముందు ఉంటుందని సీఎం చెప్పారని గుర్తు చేశారు. దానిని బీఆర్ఎస్, బీజేపీ నేతలు సిలువలు పలువులు చేసి మాట్లాడుతున్నారన్నారు. రూ. ఏడు లక్షల కోట్ల అప్పుచేసిన గత పాలకులు ఏనాడూ ఉద్యోగులకు మొదటి తారీకున జీతాలు ఇవ్వలేదన్నారు. ఎన్ని అప్పులున్నా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసినట్లే ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాపాడుకుంటామన్నారు.

**ఇది పేదల ప్రభుత్వం..** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని భట్టి అన్నారు. ఈ ప్రభుత్వం దొరల కోసమో, పాలకుల కోసమో పనిచేసే ప్రభుత్వం కాదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్యరంగానికి రూ.5950 కోట్లు ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో 11482 కోట్లు ఖర్చు చేసిందన్నారు. 90లక్షల కుటుంబాలకు రూ.10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చిన వైద్యం అందించామన్నారు.

**వైద్య రంగాన్ని గాడిలో పెడుతున్నాం...** గత ప్రభుత్వం గాలికొదిలేసిన వైద్య రంగాన్ని గాడిలో పెడుతున్నామని భట్టి అన్నారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులను తమ ప్రభుత్వం క్లియర్ చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి అండగా నిలిచి రుణమాఫీ చేశామని గుర్తు చేశారు.

నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తున్నామని చెప్పారు.

# వ్యూహాత్మక అడుగులు!

## ప్రధాని మోదీతో మరో సారి అజిత్ ధోవల్ భేటీ




ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ సమావేశమయ్యారు. గురువారం ఉదయం మోదీ నివాసానికి వెళ్లిన ధోవల్ ప్రధానితో కాసేపు భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌పై దాడుల తర్వాత మోదీతో ధోవల్ భేటీ కావడం ఇదే తొలిసారి. అంతేకాదు మరికాసేపట్లో అఖిలపక్ష సమావేశం జరుగుతున్న నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిస్థితులు, సరిహద్దుల్లో ఉద్రిక్తతల గురించి మోదీకి ఆయన వివరించినట్లు తెలుస్తోంది. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై భారత్ ప్రతీకారం తీర్చుకున్నది. ఆ ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రతిదాడికి దిగి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)తోపాటు పాకిస్థాన్‌లోని మూడు ప్రధాన ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్, లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. భారత్ జరిపిన ఈ దాడిలో 80 మంది వరకూ ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వచ్చాయి. ఆపరేషన్ సిందూర్ చేపట్టి భారత సైన్యం కేవలం 25 నిమిషాల్లోనే తొమ్మిది ఉగ్రస్థావరాలపై మిస్సైల్స్‌తో కురిపించింది. లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయాలు సహా తొమ్మిది ఉగ్రవాద శిక్షణా కేంద్రాలను నేలమట్టం చేసింది.

**పలు దేశాల సెక్యూరిటీ అడ్వైజర్లకు అజిత్ దోవల్ ఫోన్....** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ప్రదేశాలలో ఉగ్రవాదులు, వారి మౌలిక సదుపాయాలపై కేంద్రీకృత దాడులు జరిగిన తర్వాత మన నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోవల్ పలు దేశాల NSAలతో మాట్లాడారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, UK NSA జోనాథన్ పావెల్, సౌదీ NSA ముసైద్ అల్ ఐబాన్, UAE NSA షేక్ తహ్నూన్, UAE NSC సెక్రటరీ జనరల్ అలీ అల్ షంసి, ఇంకా జపాన్ NSA మసటకా ఒకానోతో సహా అనేక దేశాల NSAలతో అజిత్ దోవల్ ఫోన్లో సంభాషించారు. వీరితో పాటు, CPC సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరో సభ్యుడు, PRC విదేశాంగ మంత్రి వాంగ్ యి, ఇంకా ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ బోన్ కు దౌత్య సలహాదారు అయిన రష్యన్ NSA సెర్గీ షోయిగుతో కూడా అజిత్ సంప్రదింపులు జరిపారు. ఈ టెలిఫోన్ సంభాషణలో NSA తన సహచరులకు.. యుద్ధంకు సంబంధించి తీసుకున్న చర్యలు, అమలు విధానం గురించి వివరించారు. అయితే, ఈ యుద్ధం తీవ్రతరం కానిది, సంయమనంతో కూడినది అని ఆయన సహచరులకు తెలిపారు. అయితే, పాక్ తో యుద్ధాన్ని తీవ్రతరం చేసే ఉద్దేశ్యం భారత్ కు లేదని, కానీ పాకిస్తాన్ తీవ్రతరం చేయాలని నిర్ణయించుకుంటే దృఢంగా ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉందని దోవల్ నొక్కి చెప్పారు.

రాబోయే రోజుల్లో దీనికి సంబంధించి తన సహచరులతో తాను సంప్రదిస్తానని కూడా NSA అజిత్ దోవల్.. విదేశీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్లకు తెలిపారు. ఇదే సందర్భంలో "ఈ దాడికి బాధ్యులను జవాబుదారీగా ఉంచాలనే నిబద్ధతకు తాము కట్టుబడి ఉన్నాం" అని కూడా ఆయన విదేశీ ప్రతినిధులకు వెల్లడించారు.




సామాజిక మాధ్యమాల్లో దేశ వ్యతిరేక ప్రచారంపై నిఘా ఉంచాలని కేంద్ర హోంశాఖ పలు రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్ అనంతరం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పలు రాష్ట్రాల సీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో హోం మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకు పలు సూచనలు చేసినట్లు అధికార వర్గాలు గురువారం తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ వీటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తోంది. ఈక్రమంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు హోంశాఖ పలు సూచనలు చేసింది. ఆపరేషన్ సిందూర్ గురించి, భారత్ భద్రత గురించి తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే ఖాతాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దేశం నుంచి లేదా విదేశాల నుంచి భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఆయా సోషల్ మీడియా ఖాతాలను వెంటనే బ్లాక్ చేయాలని పేర్కొంది. ఈసందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లోని ప్రభుత్వాలకు, భద్రతా దళాలకు మధ్య కమ్యూనికేషన్ సంబంధాలు పెంచాలని పిలుపునిచ్చింది. మంగళవారం అర్ధరాత్రి వేళ.. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ విరుచుకుపడింది. అక్కడి 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. 80 మంది ఉగ్రవాదులను హతమార్చి పహల్గాం దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది.




## దలాల్ స్ట్రీట్‌కు ఉద్రిక్తతల సెగ.. అరగంటపాటు నిలిచిన పాక్ స్టాక్ ఎక్ఛేంజ్

ముంబయి: భారత్– పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు దలాల్ స్ట్రీట్‌ను తాకాయి. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో నిర్వహించిన భారత సైనిక చర్యను జీర్ణించుకోలేని పాక్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు యత్నించింది. దీంతో ఆ దేశంలో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడుల్లో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ వార్తల నేపథ్యంలో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఉద్రిక్తతల నేపథ్యంలో చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 400 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,300 దిగువకు చేరింది. అంతర్జాతీయంగా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఉదయం 80,912.34 పాయింట్ల (క్రితం ముగింపు 80,746.78) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. తర్వాత స్వల్ప శ్రేణిలో లాభనష్టాల మధ్య చలించింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని సెన్సెక్స్ 411.97 పాయింట్ల నష్టంతో 80,334.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్ల నష్టంతో 24,273.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.72గా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.95 శాతం పతనం అవ్వగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.43 శాతం మేర క్షీణించింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, టాటా మోటార్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 61.95 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,348 డాలర్ల వద్ద కొనసాగుతోంది. భారత్ దెబ్బకు పాక్ స్టాక్ మార్కెట్ కుదేలవుతోంది. 'ఆపరేషన్ సిందూర్'తో నిన్న భారీగా పతనమైన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్.. నేడు అరగంట పాటు నిలిచిపోయింది. కరాచీ సమీపంలో భారత సైనిక బలగాలు విరుచుకుపడ్డాయన్న సమాచారంతో వ్యాపించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ట్రేడింగ్ నిలిపివేతకు ముందు కేఎస్ఈ 100 సూచీ దాదాపు 6,948 పాయింట్ల (6.32 శాతం) నష్టంతో 103,060 వద్ద నిలిచింది. కాసేపటికే ట్రేడింగ్ ప్రారంభమైనప్పటికీ నష్టాలు కొనసాగాయి.




## ములుగు జిల్లాలో పేలిన మందుపాతర.. ముగ్గురు పోలీసుల మృతి!

వాజేడు: ములుగు జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు పోలీసులు మృతిచెందినట్లు సమాచారం. వెంకటాపురం మండల సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కోసం కూంబింగ్ చేస్తుండగా మందుపాతర పేలినట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు ధ్రువీకరించలేదు. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో 22 మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వెంకటాపురం పరిసర అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా మందుపాతర పేలినట్లు సమాచారం




పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో భారత్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టేందుకు పాక్ యత్నించగా.. వీటిని భారత దళాలు దీటుగా తిప్పికొట్టాయి. ఈ క్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సహనాన్ని అలుసుగా తీసుకుంటే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. 'నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్'లో మాట్లాడుతూ దేశభద్రతకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టంచేశారు. "మేం ఎల్లప్పుడూ సంయమనంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాం. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడాన్ని విశ్వసిస్తాం. దీనర్థం ఎవరైనా మా ఓపికను దుర్వినియోగం చేయవచ్చని కాదు. మా సహనాన్ని అవకాశంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే.. ఆపరేషన్ సిందూర్ మాదిరిగా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి" అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

**సైన్యంపై ప్రశంసలు..** భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను ఊహించని కచ్చితత్వంతో అమలు చేశాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాయని, ఇందులో అనేకమంది ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సాయుధ బలగాలు ధైర్యసాహసాలు ప్రదర్శించాయని ప్రశంసించారు. సామాన్యులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఈ ఆపరేషన్ చేపట్టామని, అత్యాధునిక పరికరాలు, సుశిక్షితులైన సాయుధ దళాల పనితీరువల్లే ఇది సాధ్యమైందన్నారు.

## సమస్యల విషయంలో మేం గిరిగీసుకోలేదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్




హైదరాబాద్: ముంపు బాధితుల సమస్యలను హైడ్రా వెంటనే పరిష్కరిస్తోందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ప్రజలు ఏ విభాగాన్ని సంప్రదించాలో తెలియని సమస్యల్ని హైడ్రా పరిష్కరిస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హైడ్రా కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ బుద్ధ భవన్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హైడ్రా పోలీస్ స్టేషన్‌తో పాటు హైడ్రాకు సమకూర్చిన వాహనాలు, యంత్రాలను సైతం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగనాథ్ మాట్లాడుతూ.. "ఫలానా సమస్య మా పరిధిలోకి రాదు అని మేం గిరిగీసుకోలేదు. ఏ శాఖకు చెందిన విధి అయినా.. ముందుగా ఆ పనిని మేం పూర్తి చేస్తున్నాం. హైడ్రా వల్ల చెరువులు, నాలాల కబ్జాలు తగ్గిపోతున్నాయి" అని పేర్కొంటూ హైడ్రా చేస్తున్న పలు కార్యక్రమాలను రంగనాథ్ వివరించారు.

## బీజాపూర్‌లో ఎదురు కాల్పులు.. 8మంది మావోయిస్టులు మృతి

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ సరిహదుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భారీ ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న, మావోయిస్టు ఎస్‌జెడ్‌సీఎం బండి ప్రకాశ్ ఉన్నట్లు సమాచారం. చంద్రన్న తలపై రూ.కోటి రివార్డు ఉంది.

బీజాపూర్ జిల్లా ఉసూర్ ప్రాంతంలోని లంకపల్లె అడవుల్లో ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి.





## 'మీ విజయానికి బాంబులు పేలుస్తాం'.. జైపూర్ క్రికెట్ స్టేడియానికి బెదిరింపు మెయిల్!

పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడిన సంగతి తెలిసిందే. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఉగ్రస్థావరాలను కుప్పకూల్చింది. దాదాపు 100 మందిని మట్టుబెట్టినట్లు కేంద్రం వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. ఇదే సమయంలో జైపూర్ క్రికెట్ స్టేడియానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో భద్రతా దళాలు సెక్యూరిటీని కట్టుదిట్టం చేశాయి. దీనిపై స్టేడియం అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రస్తుతం ఐపీఎల్ 2025 సీజన్ కొనసాగుతోంది. జైపూర్ వేదికగానే రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అయితే, మే 16న పంజాబ్ కింగ్స్‌తో రాజస్థాన్ తన చివరి లీగ్‌మ్యాచ్‌ను ఇక్కడే ఆడనుంది. జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియం అధికారులకు ఉదయం 9.13 గంటలకు ఓ మెయిల్ వచ్చిందని పోలీసులు వెల్లడించారు. ఇందులో ఆపరేషన్ సిందూర్ గురించి పేర్కొంటూ.. " ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా మేం మీ స్టేడియంలో బాంబు పేలుడు నిర్వహిస్తాం. వీలైతే ప్రతిఒక్కరినీ కాపాడుకోండి" అంటూ మెయిల్ వచ్చిందని తెలిపారు. ఈ మెయిల్‌పై అధికారిక వర్గాలు విచారణ మొదలుపెట్టాయి.

## ఉచిత బస్సుపై తెలంగాణ ఆర్టీసీ కీలక ప్రకటన. ఇకపై ఆ కార్డులు!

ఉచిత బస్సు పై తెలంగాణ ఆర్టీసీ కీలక ప్రకటన చేసింది. ఆధార్ కార్డు తో పాటు మిగతా కార్డులు కూడా పనిచేస్తాయని తాజాగా ఉచిత బస్సుపై సజ్జనర్ కీలక ప్రకటన చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల కోసం ఉచిత బస్సు అమలు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. కేంద్ర అలాగే రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ఒరిజినల్ ఆధార్ కార్డ్ అలాగే ఓటర్ ఐడి, లేదా డ్రైవింగ్ లైసెన్స్ ఇతర గుర్తింపు కార్డులు కండక్టర్లకు చూపిస్తే జీరో టికెట్లు తీసుకోవచ్చని ఈ సందర్భంగా వెల్లడించారు సజ్జనర్. ఆధార్ కార్డు ఒక్కటే ప్రామాణికం కాదని%% ఓ నెటిజన్ సజ్జనర్ కు ట్యాగ్ చేస్తూ పోస్ట్ పెట్టాడు. ఈ నేపథ్యంలోనే స్పందించిన... ఆర్టీసీ ఎండీ సజ్జనర్ ప్రకటన చేశారు. కేంద్ర అలాగే రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ఒరిజినల్ ఆధార్ కార్డ్ అలాగే ఓటర్ ఐడి, లేదా డ్రైవింగ్ లైసెన్స్ ఇతర గుర్తింపు కార్డులు కండక్టర్లకు చూపిస్తే జీరో టికెట్లు తీసుకోవచ్చని ఈ సందర్భంగా వెల్లడించారు సజ్జనర్.




## పాక్‌కు ఇచ్చిపడేసిన సానియా మీర్జా.. ఇది కదా కావాల్సింది..

పహల్గాం అటాక్‌కు రివేంజ్ తీర్చుకుంది భారత్. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 టెర్రరిస్ట్ క్యాంపులపై సక్సెస్‌ఫుల్‌గా అటాక్స్ చేసింది. ఉగ్ర స్థావరాలపై క్షిపణి దాడులు చేసి జైషే మహ్మద్, లష్కరే తొయిబా లాంటి టెర్రర్ సంస్థలను చావుదెబ్బ తీసింది. భారత్ పేరు చెబితే గజగజ వణికేలా చేసింది. మెరుపు దాడులతో వందలాది మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాయి భారత భద్రతా బలగాలు. దీంతో మోదీ ప్రభుత్వంతో పాటు సెక్యూరిటీ ఫోర్సెస్‌పై నలువైపులా ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి. తాజాగా టెన్నిస్ లెజెండ్ సానియా మీర్జా కూడా ఆపరేషన్ సిందూర్‌పై స్పందించింది. ఇంతకీ ఆమె ఏం చెప్పిందో ఇప్పుడు తెలుసుకుందాం..

**ఇదీ భారత్ అంటే..** ఒక్క ఫొటోతో భారత్ తన మెసేజ్ ఏంటో గట్టిగా చాటిచెప్పిందని సానియా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో రాసుకొచ్చింది. ఒక దేశంగా మనమేంటో అందరికీ సుస్పష్టం చేశామంటూ ఆపరేషన్ సిందూర్ వివరాలను వెల్లడించిన కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఫొటోను సానియా షేర్ చేసింది. ఇదీ భారత్ అంటే అని రాసుకొచ్చింది. కాగా, ఆపరేషన్ సిందూర్ గురించి భద్రతా బలగాలకు చెందిన ఇద్దరు మహిళలు వివరించడం హైలైట్‌గా మారింది. గురిపెట్టి ఉగ్ర స్థావరాలపై జరిపిన క్లిష్టమైన ఆపరేషన్ గురించి సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్ దేశ ప్రజలకు చక్కగా వివరించారు. ఇందులో సోఫియా ముస్లిం వర్గానికి చెందిన వ్యక్తి. వ్యోమిక సిక్కు వర్గానికి చెందిన వారు. వీళ్లతో పాటు అదే వేదిక మీద పాల్గొన్న విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఒక కశ్మీరీ పండిట్ కావడం విశేషం. అందుకే పహల్గాంలో టెర్రరిస్టులు మతం అడిగి మరీ కాల్చిచంపడాన్ని ఎత్తిచూపుతూ.. ఇండియాలో ఐక్యతను చాటిచెప్పేలా సానియా మీర్జా ఈ పోస్ట్ చేసిందని అర్థమవుతోంది.

**ఒక్క పోస్ట్‌తో..** సానియా పోస్ట్ చూసిన నెటిజన్స్.. ఇది కదా కావాల్సింది అని అంటున్నారు. ఉగ్రవాదం పీచ అణచడంతో పాటు పాకిస్థాన్ ఆట కట్టించేందుకు భారత భద్రతా దళాలు చేస్తున్న పోరాటానికి సానియా అండగా నిలవడం అభినందనీయమని అంటున్నారు. సామాన్య ప్రజలతో పాటు సానియా లాంటి సెలెబ్రిటీల మద్దతు ప్రభుత్వానికి, సైనికులకు అవసరమని చెబుతున్నారు. అందరూ అండగా ఉంటే సర్కార్–సోల్జర్స్ తమ పని తాము చేసుకుపోతారని కామెంట్స్ చేస్తున్నారు. సానియా ఒక్క పోస్ట్‌తో పాక్‌కు ఇచ్చిపడేసిందని ప్రశంసిస్తున్నారు.



# పోరాడండి.. వనరులిస్తాం..!

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తాజా పరిణామాల వేళ అమెరికా కీలక ప్రకటన చేసింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా న్యూఢిల్లీ చేసే పోరాటానికి తాము అండగా ఉంటామని పునరుద్ఘాటించింది. ఈ మేరకు అగ్రరాజ్య ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ వెల్లడించారు. "ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ బలంగా నిలబడాలి. అందుకోసం న్యూఢిల్లీ చేసే అన్ని ప్రయత్నాలకు మేం మద్దతు అందిస్తాం. ఉగ్రవాదంపై పోరాటం కోసం భారత్‌కు శక్తివనరులతో సహకారం అందిస్తాం. ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఇది కూడా భాగమే. భారత్‌తో బంధం ఎంత ముఖ్యమో ట్రంప్ యంత్రాంగం అర్థం చేసుకుంది. ఉగ్రవాదం నుంచి ఎదురయ్యే ముప్పు ఎలాంటిదో కూడా మాకు తెలుసు" అని మైక్ జాన్సన్ వివరించారు. ఈ విషయంలో గతంలోనూ అగ్రరాజ్యం భారత్‌కు మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ట్రంప్.. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారికి శిక్ష పడేలా తీసుకునే చర్యలకు సహకారం అందిస్తామన్నారు. ఉగ్రవాద పోరులో ఇరుదేశాలు కలిసి పోరాడుతాయని అగ్రరాజ్యాధినేత తెలిపారు. పహల్గాం దాడికి పాల్పడినవారిని కలలో కూడా ఊహించనివిధంగా శిక్షిస్తామని ఇప్పటికే ప్రధాని మోదీ హెచ్చరించిన సంగతి తెలిసిందే.

ఆ దిశగా కేంద్రం కీలక నిర్ణయాలకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు కన్పిస్తున్నాయి. అన్ని రాష్ట్రాల్లో యుద్ధ అప్రమత్తతకు కేంద్రం పిలుపునివ్వడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. గగనతల దాడుల గురించి హెచ్చరించే సైరన్ల వ్యవస్థ పనిచేసేలా చూడాలని, ఇతరత్రా స్వీయరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర హోంశాఖ సోమవారం అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. దీనిపై నేడు సమీక్ష కూడా చేపట్టారు.



# సరిసర్లే.. ఎన్నెన్నో అనుకుంటాం..!

ఏదోరకంగా భారత్‌కు వ్యతిరేకంగా భద్రతా మండలిలో తీర్మానం చేయించాలన్న పాక్ యత్నాలు బెడిసికొట్టాయి. ఫలితంగా దాయాదికే సభ్య దేశాల నుంచి చాలా కఠిన ప్రశ్నలు ఎదురయ్యాయి. దీంతో సరిసర్లే.. ఎన్నెన్నో అనుకుంటాం.. అన్నీ అవుతాయా ఏంటీ అని పాక్ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులపై నేడు ఐరాస భద్రతా మండలిలో ఒక క్లోజ్డ్‌డోర్ సమావేశం జరిగింది. ఇప్పటికే ఇస్లామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌లోని 15 సభ్య దేశాల్లో ఒకటి. ఆ దేశం అభ్యర్థన పైనే ఈ సమావేశం జరిగింది. తన సభ్యత్వాన్ని అడ్డంపెట్టుకొని భారత్ వ్యతిరేక తీర్మానం చేయాలని తొలుత భావించింది. కానీ, ఈ ప్రయత్నాలు బెడిసికొట్టి.. దానికే ఎదురు క్లాస్ తీసుకొన్నాయి. దాదాపు 90 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో దానికి చాలా ఎదురుదెబ్బలు తగిలాయి. పాక్ తరఫున ఐరాస శాశ్వత ప్రతినిధి అసీమ్ ఇఫ్తికార్ అహ్మద్ హాజరయ్యారు. ఇస్లామాబాద్ బహిరంగ అణు బెదిరింపులపై చాలా సభ్యదేశాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటీవల పాక్ క్షిపణి పరీక్షలు నిర్వహించడాన్ని ప్రశ్నించాయి. అది ఉద్రిక్తతలు పెంచి ప్రాంతీయ అస్థిరతకు దారి తీస్తుందన్నాయి. అదే సమయంలో భారత్ కుట్రపన్ని పహల్గాం దాడి చేసుకొని(ఫాల్స్‌ఫ్లాగ్ ఆపరేషన్).. పాక్‌పై నిందలు మోపుతోందన్న వాదనలను కూడా సభ్యదేశాలు తిరస్కరించాయి. ఉగ్రదాడికి పాల్పడిన వారు జవాబుదారీగా ఉండాలని తేల్చిచెప్పాయి. పహల్గాం దాడిలో లష్కరే తోయిబా పాత్రను ప్రశ్నించాయి. అంతేకాదు.. ఉగ్రవాదులు మతం ఆధారంగా అమాయకులను చంపడంపై ఆందోళన వ్యక్తంచేశాయి. పాక్ ఈ అంశాన్ని అంతర్జాతీయం చేద్దామనుకొన్నా.. ఏ దేశమూ దానితో చేయి కలపలేదు. దీంతో ఏ తీర్మానం లేకుండానే సమావేశం ముగిసింది. చివరికి చైనా కూడా సమావేశం తర్వాత ప్రెస్ స్టేట్‌మెంట్‌లో పాలుపంచుకోలేదు. భారత్‌తో ద్వైపాక్షిక చర్చల ద్వారానే ఈ అంశాలను పరిష్కరించుకోవాలని పాకిస్థాన్‌కు చాలా దేశాలు సలహా ఇచ్చాయి. పహల్గాం దాడి తర్వాత పాక్‌ను అన్నివైపుల నుంచి ఒత్తిడికి గురిచేసే చర్యలను భారత్ మొదలుపెట్టింది. ఈక్రమంలో దౌత్యమార్గంలో దాయాది ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ప్రధాని ఇప్పటికే భద్రతా మండలిలోని నాలుగు శాశ్వత సభ్యదేశాల నాయకులతో మాట్లాడారు. ఇక విదేశాంగ మంత్రి జైశంకర్ ఇతర సభ్యదేశాలతో టచ్‌లో ఉండి పరిస్థితిని వివరించారు. ఉగ్రదాడికి బాధ్యులు, పాల్పడిన వారు, కుట్రదారులను శిక్షించాల్సిందేని తెలిపారు.

# పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. భారత నేవీ 'త్రిశూల శక్తి'

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. ఈ నేపథ్యంలో భారత నౌకాదళం సముద్రంలో గస్తీ కాస్తున్న చిత్రాన్ని షేర్ చేసింది. అందులో ఒక నౌక, జలాంతర్గామి, హెలికాప్టర్ దర్శనమిచ్చాయి. అవి.. ఐఎన్ఎస్ కోల్‌కతా, ధ్రువ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్, స్కార్పీన్ తరగతికి చెందిన జలాంతర్గామి. "భారత నేవీ త్రిశూల శక్తి.. సముద్రం పైన.. కింద.. అలల మీదుగా" అని అర్థం వచ్చేలా ఆ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. '%ూఅవ్‌ఱఎవ ూఅఎష్టవతీవ ూఅఎష్ట్రశీష%' అనే హ్యాష్‌ట్యాగ్‌ను జోడించింది. ధ్రువ్ హెలికాప్టర్ కార్యకలాపాలను కొన్నినెలల క్రితం నిలిపిశారు. దీన్నిబట్టి చూస్తే.. ఇది పాతచిత్రం కావొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఇది నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. ఉగ్ర ఘటన తర్వాత నుంచి భారత సైన్యం శక్తి సామర్థ్యాలను చాటిచెప్పే వీడియోలను సామాజిక మాధ్యమాల్లో అధికారులు షేర్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి వెనక "ది రెసిస్టెన్స్ ఫ్రంట్' హస్తం ఉన్నట్లు భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇది పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ. దీన్ని భారత ప్రభుత్వం గతంలోనే ఉగ్ర సంస్థగా ప్రకటించింది. ఇక ఈ ఘటన తర్వాత పాక్ నడ్డివిరిచేలా భారత ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వాటిలో సింధూజలాల ఒప్పందం అమలు నిలిపివేత కూడా ఒకటి. ఇక, కొన్ని నెలల క్రితం నిలిపివేసిన అధునాతన తేలికపాటి హెలికాప్టర్ ధ్రువ్ కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ఇటీవల ప్రభుత్వం అనుమతిచ్చింది. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో వాటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ.. నౌకాదళంలో ఉన్న ఈ హెలికాప్టర్లకు మాత్రం అనుమతివ్వలేదని తెలిసింది. అత్యంత అధునాతనమైన స్కార్పీన్ తరగతి జలాంతర్గాములు భారత నౌకాదళంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. ఇవి శత్రు యుద్ధనౌకలు, జలాంతర్గాముల వేట, నిఘా సమాచార సేకరణ, సాగరజలాల్లో మందుపాతరలు అమర్చడం, నిర్దిష్ట ప్రాంతంలో ప్రత్యర్థుల కదలికలపై కన్నేసి ఉంచడం వంటి కార్యకలాపాలు సాగించగలవు. ఫ్రాన్స్ తోడ్పాటుతో నిర్మించిన ఈ జలాంతర్గాములకు శత్రువుల నిఘా సాధనాలకు దొరకని రీతిలో అద్భుతమైన స్టెల్త్ లక్షణాలు ఉన్నాయి. టోర్పిడోలు, నౌకా విధ్వంసక క్షిపణులను ప్రయోగించగలవు. భారత నౌకాదళంలో ఐఎన్ఎస్ కోల్‌కతా ప్రధాన డెస్ట్రాయర్. ఇది భారత నౌకాదళానికి చెందిన శక్తివంతమైన యుద్ధ నౌకల్లో ఇది ఒకటి.

# 'రండి.. చైనా రహస్యాలు చెప్పండి': జిన్‌పింగ్ అసంతృప్తులకు అమెరికా ఆఫర్

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పాలనలో అణచివేతను ఎదుర్కొంటున్న అక్కడి ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశిస్తూ అమెరికా నిఘా సంస్థ సీఐఏ సంచలన ప్రకటన చేసింది. 'రండి.. మాతో కలిసి పనిచేయండి' అంటూ మాండరిన్ భాషలో రిక్రూట్‌మెంట్ వీడియోలను విడుదల చేసింది. సైనిక పరంగా, వ్యూహాత్మకంగా చైనా తమకు అతిపెద్ద విరోధిగా భావిస్తున్న అగ్రరాజ్యం.. బీజింగ్ చేపడుతున్న గూఢచర్య ఆపరేషన్లకు ప్రతిచర్యగా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. చైనా అధికారుల నుంచి రహస్యాలు సేకరించేందుకే ఈ వీడియోలని సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ చెప్పడం గమనార్హం. "నిఘా వ్యవస్థలో మానవ వనరులను పెంచుకోవడంతో పాటు చైనాపై మరింత దృష్టి పెట్టేందుకు ఈ చర్యలు చేపట్టాం. ఆర్థికంగా, సైనికపరంగా, సాంకేతికంగా ప్రపంచంపై ఏకఛత్రాధిపత్యం చెలాయించాలని చైనా భావిస్తోంది. ఆ దేశం నుంచి మాకు గూఢచర్యం ముప్పు పొంచి ఉంది. దాన్ని పరిష్కరించుకునేందుకే ఈ వీడియోలు విడుదల చేశాం. చైనా అధికారుల నుంచి రహస్యాలు సేకరించడమే వాటి లక్ష్యం" అని రాట్‌క్లిఫ్ వెల్లడించారు. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ) యూట్యూబ్, 'ఎక్స్' ఖాతాల్లో ఈ రెండు వీడియోలను విడుదల చేయగా.. గంటల వ్యవధిలోనే 50 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. రెండు నిమిషాలకు పైగా నిడివి ఉన్న ఈ వీడియోల్లో.. అధ్యక్షుడు జిన్‌పింగ్ కమ్యూనిస్టు పార్టీలో అవినీతి వ్యతిరేక ఉద్యమం పేరుతో రాజేసిన నిప్పును ఉదహరిస్తూ సినిమాటిక్ సన్నివేశాలను జోడించారు. నిజాయతీగా పనిచేస్తున్న ఓ పార్టీ నాయకుడు.. అధికార ఒత్తిళ్లకు తలొగ్గాల్సిన పరిస్థితిలో ఉంటాడు. దాన్ని అంగీకరించలేక, భయంతో బతకలేక.. సీఐఏను ఆశ్రయిస్తున్నట్లుగా ఆ వీడియోలో ఉంది.

'నా జీవితాన్ని, నా భవిష్యత్తును నా కంట్రోల్‌లో ఉంచుకోవాలంటే సీఐఏలో చేరాలి' అనే క్యాప్షన్‌తో అమెరికా సంస్థ ఈ వీడియోలను విడుదల చేసింది. చైనా అధికారులకు మరింత చేరువవ్వాలనే ఉద్దేశంతో మాండరిన్ భాషలో రూపొందించింది. ప్రస్తుతం ఈ వీడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. వీటిపై చైనా ఇంకా స్పందించలేదు.

# పాక్ బరితెగిస్తే ప్రపంచ పటంలో ఉండదంతే!



పాక్ ప్రగల్భాలు అన్నీ ఒక్క దెబ్బతో మటాష్ అయ్యాయి. అన్ని విధాలుగా చితికిపోయి కుదేలు అయిన పాక్ భారత్ మీద దాడులు చేస్తామని చెప్పడం కంటే విడ్డూరం ఉండదు. పాక్ సైన్యం నైతిక స్థైర్యం లేదు. ఉగ్ర మూకలనే నమ్ముకుని ప్రచ్ఛన్న యుద్ధం చేస్తూ దొంగ దెబ్బ తీస్తూ ఆనందించే పాక్ భారత్ మీద ప్రతి దాడులు అని మాటలు కోటలు దాటిస్తోంది. పైగా నివాస ప్రాంతాలను కొన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని ఆ దేశ రక్షణ మంత్రి అన్నట్లుగా వార్తలు వచ్చాయి. అయితే ఆ తర్వాత ఆయన నాలుక మడతేసి మా దేశం మీద భారత్ ఆపరేషన్ ఆపితే మేము కూడా ఏ యుద్ధానికి సిద్ధం కామని తగ్గి మాట్లాడారు ఇలా ఎందుకు అంటే పాక్ ఇపుడు ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉండడమే. పైగా భారత్ చేసిన దాడులు ఆ దేశం మీద కాదు, ఆ దేశంలోని ఉగ్ర మూకల మీద వారి శిబిరాల మీద. మరి వారికి మద్దతుగా పాక్ ఉంటూ యుద్ధానికి సిద్ధం అయితే భారత్ ఈసారి చేసే యుద్ధం కానీ ప్రతి చర్య కానీ పాక్ సహా ఎవరూ కలలో సైతం ఊహించని తీరుగా ఉంటాయన్నది వాస్తవం. పాక్ బరితెగింది అణు ఆయుధాలను వాడాలని చూసిన రోజునే ఆ దేశం ఈ ప్రపంచం పటం మీద అదృశ్యం కావడం ఖాయమని అంటున్నారు భారత్ పూర్వం మాదిరి కాదు ఆ వైపు నుంచి ఒకటి ఇస్తే ఈ వైపు నుంచి పది ఇస్తూ గట్టి జవాబు చెప్పడానికి సిద్ధంగా ఉంది. అందుకే పాక్ ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి. ఇక ఉగ్ర మూకలకు మద్దతుగా ఉండాలని అనుకున్నా పచ్చన్న యుద్ధం చేస్తూ భారత్ ని కెలకాలని చూసినా కూడా పాక్ పప్పులేవీ ఉడకవు అన్నది గుర్తు పెట్టుకోవాలి.

మళ్ళీ గతం మాదిరిగా పాక్ ఉగ్రవాదులను ముందు పెట్టి నాటకాలు ఆడితే ఈసారి ఆ దేశం చెల్లించబోయే భారీ మూల్యం ఏకంగా దేశంగా తనను తాను బలి పెట్టుకోవడమే. ఆ సరదా పాక్ కి తీరాలని ఉంటేనే బరి తెగించాల్సి ఉంటుంది. తనకు డ్రాగన్ మద్దతు ఉందనో లేక టర్కీ దన్ను ఉందనో భ్రమించి బరిలోకి దిగాలనుకుంటే పాక్ కి పట్టాల్సిన గతి పట్టించేందుకు భారత్ సిద్ధంగా ఉంటుంది అన్నది వాస్తవం. అందువల్ల పాక్ తీరు మార్చుకుంటేనే ఒక దేశంగా నిలుస్తుంది మనగలుగుతుంది. అయితే పాక్ లో అధికారం ఎవరిది అన్నదే ఇక్కడ ప్రధాన ప్రశ్న. పాక్ ని సైన్యం శాసిస్తోంది. అలాగే అక్కడ ఉగ్రమూకలకు దర్జాగా సైన్యం మద్దతు ఉంది. అంటే పాక్ పాలకులు కేవలం బొమ్మలుగా ఉన్నారన్న మాట. ఇక సామాన్య ప్రజల తీరు చూస్తే ఆకలితో అలమటిస్తున్నారు. పేదరికంతో అవస్థలు పడుతున్నారు. వారి మేలు కోసం పాక్ ప్రభుత్వ అధినేతలు ఏమి చేశారంటే నిరాశే మిగులుతుంది. ఆ దేశం చేసే అప్పులతో సుఖవిలాసాలు పొందేది పాలకులు సైనికులు ఉగ్రమూకలే అని అంటున్నారు. మరి ఇంతలా దేశాన్ని దివాళా పట్టించి ప్రజల విషయంలో ఏ మాత్రం బాధ్యత లేకుండా నిర్లక్ష్యమే తమ విధానంగా చేసుకున్న పాక్ ప్రభువుల మీద ఆ దేశంలోని ప్రజలకు కూడా ఆగ్రహం ఉంది. పాక్ ప్రస్తుతం ఆ విధమైన అంతర సమస్యలతో సతమతమవుతోంది అయినా కానీ భారత్ మీదనే తన చూపు పెట్టి పగ సాధించాలని అనుకుంటే మాత్రం పాక్ తన వినాశనాన్ని కోరి తెచ్చుకున్నట్లే. మరో వైపు చూస్తే భారత్ చేసిన ఆపరేషన్ సిధూర్ అన్నది కేవలం ట్రయల్ మాత్రమే అన్నది మరచిపోరాదు సుదీర్ఘమైన ప్రణాళికలతో వ్యూహాలతో భారత్ ముందుకు సాగుతోంది. భారత్ ని ఏ విధంగా కవ్వించినా తనకే తీవ్ర నష్టమమని పాక్ ఇప్పటికైనా గుర్తిస్తే మంచిది అని అంటున్నారు. అలా కాదూ కూడదని తెగిస్తే మాత్రం భారత్ ప్రతి చర్యలకు పాక్ ఏ విధంగానూ తట్టుకోలేదనే అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఈ దాడులు పాక్ లోని ఉగ్ర మూకలకు వారిని చేయి పట్టి నడిపిస్తున్న ఆ దేశ పెద్దలకు ఆర్మీకి ఒక గుణపాఠంగా మారాలి. లేకపోతే మాత్రం వారే దేనికైనా బాధ్యులు అవుతారు అని అంటున్నారు.

# ఉగ్రవాదులతో పాక్ (అక్రమ) బంధం... క్లారిటీ ఇచ్చిన చిత్రం!


ఉగ్రవాదానికి అతిపెద్ద అడ్డాగా.. ఉగ్రవాదులకు అతి సేఫ్ జోన్ గా.. ఉన్న దేశాల్లో పాకిస్థాన్ ఫస్ట్ లిస్ట్ లో ఉంటుందనే సంగతి తెలిసిందే. ఉగ్రవాదులకు పాకిస్థాన్ అత్యంత అనువైన స్థలంగా చెబుతారు. అయితే పాక్ నేతలు మాత్రం... తాము కూడా ఉగ్రవాద బాధితులమే అని నిస్సిగ్గు వ్యాఖ్యలు చేస్తుంటారు. ఈ సమయంలో ఓ ఫోటో పాక్ వైఖరిపై ప్రపంచానికి మరోసారి క్లారిటీ ఇచ్చింది. అవును... పాకిస్థాన్ కు ఉగ్రవాదులకు ఉన్న అవినాభావ (అక్రమ) సంబంధం గురించి ప్రత్యేకంగా చెప్పే పని లేదు! ప్రపంచంలో ఉగ్రవాదం ఇంకా మనగ గలుగుతుందంటే అందుకు పాక్ కూడా ఓ ప్రధాన కారణం అని చెబుతారు. ఇక ప్రధానంగా పాక్ లో ఉన్న ఉగ్రమూకలకు భారత్ ఓ టార్గెట్! ఇటీవల పహల్గాంలో జరిగిన పాశవిక దాడి అందుకు ఓ తాజా ఉదాహరణ. ఈ సమయంలో ఉగ్రవాదులతో అవిభక్త కవలగా ఉన్న పాక్ ఆర్మీతో.. ఈ విషయంలో మాటలు కంటే చేతలతో చెప్పే సమాధానమే సరైంది అని భావించిన భారత్...



ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 9 ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసింది. సుమారు 80 మంది ఉగ్రవాదులను మట్టుపెట్టింది. నేరుగా పాక్ లోని పంజాబ్ లో ఉన్న స్థావరాలను నేలమట్టం చేసింది. ఈ సమయంలో మరణించిన ఉగ్రవాదులకు బుధవారం అంత్యక్రియలు జరిగాయి. ఇందులో భాగంగా... లాహోర్ సమీపంలోని మురిద్కేలోని ఉగ్రవాద సంబంధిత ప్రదేశంలో భారత సైనిక దాడుల్లో మరణించిన ముగ్గురు వ్యక్తుల అంత్యక్రియల్లో ప్రార్థనలకు లష్కరే తోయిబా (ఎల్.ఈ.టీ) ఉగ్రవాది హఫీజ్ అబ్దుల్ రవూఫ్ నాయకత్వం వహించాడు. ఇలా అతడు నాయకత్వం వహించిన ఉగ్రవాదుల అంత్యక్రియల కార్యక్రమంలో పాకిస్థాన్ ఆర్మీ సిబ్బంది, పోలీసులు పాల్గొనడం గమనార్హం. దీనికి సంబంధించిన ఫోటో పాక్ కి ఉగ్రవాదులకు ఉన్న బంధాన్ని చెప్పకనే చెబుతుందనీ అంటున్నారు. ఇదే సమయంలో మురిద్కేలో మరో ఉగ్రవాది శవపేటికలను పాక్ జెండా చుట్టి మరీ ఆ దేశ ఆర్మీ సిబ్బంది మోస్తూ కనిపించారు. దీంతో... దీనికి సంబంధించిన ఫోటోలపై నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. పాకిస్థాన్ లో ఉగ్రవాదులు ఓ అంతర్భాగమని ఒకరంటే.. పాక్ సైన్యంతో ఉగ్రవాదులది అక్రమ సంబంధం అని మరొకరు స్పందిస్తున్నారు. ఇదే సమయంలో... ఈ ఫోటోలు ప్రపంచం ముందు పెట్టాలని, ఐరాసలో ప్రదర్శించాలని మరికొంతమంది సూచిస్తున్నారు.

# మామిడి చెట్లు కొట్టే ముందు జాగ్రత్త.. అనుమతి లేకుండా నరికితే రూ.2.66కోట్ల ఫైన్

ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్‌లో ఐదుగురు వ్యక్తులు అనుమతి లేకుండా ఏకంగా 17 మామిడి చెట్లను నరికేశారు. ఈ ఘటన జరిగి 6 ఏళ్లు గడిచింది. ఇప్పుడు దీనిపై చర్యలు తీసుకున్నారు. ఆ ఐదుగురు నిందితులపై రూ.2.66 కోట్ల పర్యావరణ నష్టం కలిగించారంటూ ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో అనుమతి లేకుండా మామిడి చెట్లు నరికినందుకు ఇంత పెద్ద మొత్తంలో జరిమానా విధించడం ఇదే మొదటిసారి. ఈ కేసు మొదటి విచారణ మే 20, 2025న జరగనుంది. అసలు విషయం ఏంటంటే.. 2019 నవంబర్ 17న యూసుఫ్‌పూర్ హమీద్ గ్రామంలోని బ్రిజ్‌పాల్ సింగ్ పొలంలో 17 మామిడి చెట్లను చట్టవిరుద్ధంగా నరికివేశారని అటవీ శాఖ



అధికారులకు సమాచారం అందింది. చెకింగ్ సమయంలో చెట్లను ఎటువంటి అనుమతి లేకుండా నరికి, వాటి మొద్దులను ఒక ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వెంటనే అధికారులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఐదుగురు వ్యక్తులపై ఉత్తరప్రదేశ్ వృక్ష సంరక్షణ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో బ్రిజ్‌పాల్ సింగ్, మజహర్, యామిన్, తహజీబ్, షాహిద్‌లను నిందితులుగా పేర్కొన్నారు. 2025 మార్చి 17న నిందితులకు తమ వాదన వినిపించడానికి పోస్ట్ ద్వారా నోటీసులు పంపారు. కానీ వారు కోర్టుకు హాజరు కాలేదు. దీని ఆధారంగా నిందితులు తమ నేరాన్ని అంగీకరించినట్లు అటవీ శాఖ భావించింది. విచారణలో నరికిన చెట్ల వయస్సు దాదాపు 15 సంవత్సరాలు అని తేలింది. సుప్రీంకోర్టు కేంద్ర పర్యావరణ కమిటీ ప్రమాణాల ప్రకారం.. ఒక చెట్టును నరికితే ఏడాదికి రూ.74,500 పర్యావరణ నష్టం జరుగుతుంది. ఈ లెక్కన 17 చెట్లను నరికితే మొత్తం నష్టం రూ.2,65,96,500గా అంచనా వేశారు. దీనితో పాటు అటవీ శాఖ రూ.85,000 అదనపు జరిమానా కూడా విధించింది. అటవీ శాఖ ఐదుగురు నిందితులపై మొత్తం రూ.2,66,81,500 జరిమానా విధించాలని సిఫార్సు చేస్తూ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసు మొదటి విచారణ మే 20, 2025న జరగనుంది.

# చురకలు

## సంపాదకీయం

### పాక్ పై దాడికి 'ఆపరేషన్ సింధూర్' అని ఎందుకు పెట్టారు?

భారత సాయుధ బలగాలు బుధవారం తెల్లవారుజామున పాకిస్తాన్ , పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని సమన్వయంతో కూడిన దాడులు నిర్వహించాయి. 'ఆపరేషన్ సింధూర్' అని పేరు పెట్టిన ఈ సాహసోపేత సైనిక చర్య, జైష్-ఎ-మహ్మద్, లష్కర్-ఎ-తైబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థలకు చెందిన కీలక ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. బహవల్పూర్, మురిద్కే, సియాల్‌కోట్ వంటి ప్రాంతాలలో వైమానిక మరియు భూతల దాడులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో 90 మందికి పైగా ఉగ్రవాదులు హతమైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి.

**–ఆపరేషన్ సింధూర్ పేరు వెనుక గల అర్థం:** 'ఆపరేషన్ సింధూర్' అనే పేరుకు లోతైన ప్రతీకాత్మక అర్థం ఉంది. భారతీయ సంప్రదాయంలో, సింధూరం హిందూ మహిళలకు వివాహం.. గౌరవానికి ప్రతీక. అయితే, ఈ సందర్భంలో, ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన క్రూరమైన ఉగ్రవాద దాడిని దేశానికి గుర్తు చేయడానికి ఈ పేరు ఎంచుకోబడింది. ఆ ఘటనలో ఉగ్రవాదులు వారి మతం ఆధారంగా పౌరులను లక్ష్యంగా చేసుకున్నారు, ఇది దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం రేకెత్తించింది. ఈ దాడికి ఆపరేషన్ సింధూర్ అని పేరు పెట్టడం ద్వారా, భారత ప్రభుత్వం ఒక బలమైన సందేశాన్ని పంపాలని ఉద్దేశించింది. ఇది కేవలం సైనిక ప్రతిస్పందన మాత్రమే కాదు, పహల్గామ్‌లో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు న్యాయం చేయడంలో ప్రతీకాత్మక చర్య కూడా. ఈ పేరు రక్షణ, గౌరవం , బాధితులకు నివాళిని సూచిస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఇది తన పౌరులను, విలువలను కాపాడాలనే భారతదేశ నిబద్ధతను కూడా ప్రతిబింబిస్తుంది.

**ప్రధాని పర్యవేక్షణ, స్పష్టత:** భద్రతా వర్గాల సమాచారం ప్రకారం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఈ ఆపరేషన్ ప్రణాళికను పర్యవేక్షించారు. కేవలం ఉగ్రవాద మౌలిక సదుపాయాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారని, పాకిస్తాన్ సైనిక స్థావరాలు ఏవీ దెబ్బతినలేదని అధికారులు స్పష్టం చేశారు. ఇది భారతదేశం యొక్క వ్యూహాత్మక మరియు సంయమనం కూడిన విధానాన్ని ప్రదర్శిస్తుంది.

**–మహిళా అధికారులతోనే ప్రెస్ మీట్...** ఇక ఈ దాడులపై కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శితోపాటు ఇద్దరు మిలటరీ , వైమానిక మహిళా అధికారులను ప్రెస్ మీట్ లో ప్రసంగింపచేయడం ద్వారా పాకిస్తాన్‌కు భారత నారీశక్తిని రుచి చూపించారు. మహిళలకు మద్దతుగా భర్తలను కోల్పోయిన వారికి సంఘీభావంగా భారత్ ఈ బలమైన సందేశాన్ని 'ఆపరేషన్ సింధూర్'తో ఇచ్చినట్టైంది. ఈ దాడుల నేపథ్యంలో, సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలు పెరిగాయి, ఇది అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ, తన చర్యలు జాగ్రత్తగా ప్రణాళిక చేయబడ్డాయని మరియు ఉగ్రవాద బెదిరింపులను నిర్మూలించడం మాత్రమే లక్ష్యమని భారతదేశం పేర్కొంది.

## పద కవితా పితామహుడు అన్నమాచార్యుడు - మే 9... అన్నమాచార్య జయంతి



దక్షిణ పథాన భజన సాంప్రదాయానికి, పద కవితా శైలికి ఆద్యుడు, ఆరాధ్యుడు. అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు (మే 9, 1408 – ఫిబ్రవరి 23, 1503) తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనా చార్యులకు మార్గ దర్శకుడైన, భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం భావ లాలిత్యంతో నిండిఉన్న అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. తెలుగు సంస్కృతితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచు కున్నాయి. ఆధ్యాత్మిక పదాలు, శృంగార గీతాలు, తుమ్మెదల, గొబ్బిళ్ళ పాటలు, శతకాలు, అన్నమయ్య విరచిత, 32 వేల సంకీర్తనలు శాసన రూపాలలో చాలా వరకు లభ్యాలై, ప్రజల నోళ్లలో నానుతునే ఉన్నాయి. కన్నడ వాగ్గేయకారుడు "పురందరదాసు" అన్నమయ్యను, ఏడుకొండల స్వామి అవతారంగా ప్రశంసిస్తే, మహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ఆచారణల నమ్మకం. అన్నమయ్య మనుమడు తాళ్ళపాక చిన్నన్న రాసిన "అన్నమయ్య చరితం" ద్విపద కావ్యం ద్వారా ఆయన సమాచారం లభిస్తున్నది. క్రీస్తుశకం పదవ శతాబ్దిలో, నేటి కర్నూలు జిల్లాలోని ప్రాంతాలను నందవరికే రాజు పాలించగా, ఆ రాజు కాశీయాత్ర సమయాన, కాశీలో కొందరు వైదిక బ్రాహ్మణులు పరిచయం కాగా, కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు ఆంధ్ర దేశానికి తరలి వచ్చి స్థిరపడగా, తీసుకొని రాబడిన వారు వైదికులు అయినందున, నంద వైదీకులుగా ప్రచారం పొందినట్లు, అన్నమయ్య అదే కోవకు చెందిన వారై, "తాళ్ళపాక గ్రామం" ఇంటి పేరుగా కలిగి ఉన్నారని ప్రచారం ఉంది. వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో శుభ లగ్నాన, మూడు గ్రహాలు ఉచ్చ స్థితిలో ఉండగా, నారాయణ సూరి – లక్కమాంబలకు "నందకం" అంశమున సర్వధారి సంవత్సర వైశాఖ శుక్ల పౌర్ణమి నాడు 1408 మే 9న అన్నమయ్య ఉదయించారు. నారాయణ మూర్తి పరబ్రహ్మ వాచకంగా "అన్నమయ్య" అని నామకరణం గావించారు. "అన్నమయ్య", "అన్నమాచార్యులు", "అన్నయ గురు", "అన్నయ్య", "కోనేటి అన్నమయ్యం గారు" అనే నామాంతరం తాళ్ళపాక సాహిత్యం శాసనాలలో చోటు చేసుకున్నాయి. శిశు ప్రాయం నుండి అన్నమయ్య వెంకట నాథుని మీద ధ్యాస ఉంచేవారు. ఉగ్గు పాలు తాగడం లో, నిద్రకు ఉపక్రమించడంలో, లక్కమాంబ గీతాలు, జోల పాటలు, నారాయణ మూర్తి కావ్య పఠనాలు, అన్నమయ్యపై చెరగని ముద్రవేసి, బలంగా ప్రభావం చూపాయి. ఏకసంతగ్రాహిగా, ఉపనయన సంస్కారం అనంతరం చిరు ప్రాయం నుండే, కలియుగ దైవంపై వింత వింత సంకీర్తనలు నోటి నుండి జాలు వారగా, పదహారేళ్ల ప్రాయం నుండి రోజు కొక్క సంకీర్తనం తప్పక రాయడం మానలేదు. చెరువుగట్టు మీద, చెట్టుపై పిట్టలు, చిరుగాలి సవ్వడులలో, అలల కదలికలలో, మమేకమై సాగిన ఆయన జానపద నేపథ్యంలో, అన్నమయ్య పాటన్నా, మాటన్నా, గ్రామీణులకు సంబరాన్ని కలిగించేవి. ఉమ్మడి కుటుంబంలో, పసులు చేయడం నచ్చక, లౌకిక బంధాలతో, తమకు ఇక పనిలేదని తెలుసుకొని, వేదనలో విరక్తి కలిగి, భక్తి రగిలి, భక్తి రసావేశ భరితులై, తంబుర చేతబూని, తిరుమల దారి పట్టారు. సనక సనందాదులే భక్తులై తోడురాగా తిరుపతి చేరారు. సకలాభరణ శోభితుడు, భూషితుడు అయిన శ్రీ మూర్తిని దర్శించుకున్నారు. తిరుమలలో "ఘన విష్ణువు" అనే మునితో శంఖ చక్రాంకితములతో, పంచ సంస్కారాలను నిర్వహింప చేసుకున్నారు. వైష్ణవ తత్వాలను, ఆళ్వారుల దివ్య ప్రబంధాలను, అధ్యయనం చేస్తూ, వెంకన్నను కీర్తిస్తూ, తిరుమలలోనే జీవితం గడిపారు. గురువు ఆనతిపై, తాళ్ళపాక వెళ్లి తిమ్మక్క, అక్కమ్మలను వివాహం చేసుకున్నా, వారితో తిరిగి తిరుమల దర్శనం చేసుకున్నారు. 95 ఏళ్ళ పూర్ణ వయస్సుడై, అన్నమయ్య దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి 1503 ఫిబ్రవరి 23న పరమపదించారు. అన్నమయ్య సంకీర్తనా సేవ, సంగీత సాహిత్య భక్తి పరిపుష్టం. తెలుగు లోనే రాసినా పాడినా ఆయన సాహిత్యం సంస్కృత పద భూయిష్టం. అన్నమయ్య యోగ వైరాగ్య శృంగారం సరణి మొత్తం 32 వేల సంకీర్తనలు రచించారని అనుకొంటున్నా, ఆయన వారసులు రాగి రేకులపై వ్రాయించి, తిరుమలలో సంకీర్తనా భాండాగారం నందు పొందు పరిచినవి, ప్రస్తుతం 12 వేలు మాత్రమే. మంజరి ద్విపదలో "శృంగార మంజరి" అనే కావ్యాన్ని రచించారు. ఆయన రచనలని చెప్పబడే 12 శతకాలలో "వెంకటేశ్వర శతకము" మాత్రమే లభిస్తున్నది. "అదివో అల్లదివో, క్షీరాబ్ది కన్యకకు, జో అచ్యుతానంద, ఉదయాద్రి తెలిపావే, కొండలలో నెలకొన్న, మూసిన ముత్యాల, నిగమ నిగమాంత, లాంటి అన్నమయ్య కీర్తనలు, తెలుగు సంగీతాభిమానులకు, నిత్యం వీనులకు విందు చేస్తూనే ఉన్నాయి. "సంకీర్తనాచార్యుడు", "పదకవితా పితామహుడు", "పంచమాగమ సార్వభౌముడు", "ద్రావిడ ఆగమ సార్వభౌముడు" అని బిరుదాంకితుడు అయిన, అన్నమయ్య వాసిలో, రాశిలో, రచనలు ఆంధ్ర వాఙ్మయంలో సరిరానివి అనడంలో అతిశయోక్తి లేదు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**


## ఉదార జాతీయ వాది... మితవాది గోఖలే - మే 9... గోపాల కృష్ణ గోఖలే జయంతి



స్వాతంత్ర్య సమరంలో తెరముందు కనిపించి, పోరాట యోధులుగా, త్యాగ ధనులుగా, ప్రజా నాయకులుగా చరిత్ర పుటలకు ఎక్కిన వారు కొందరైతే, సమర నేపథ్యంలో తెర వెనుక నిశ్శబ్దంగా కార్యకలాపాలు సాగించిన వారెందరో. లక్ష్యం ఒకటే స్వాతంత్ర్య సాధన. మార్గాలు, కార్యాచరణ మార్గాలు వేరు. స్వాతంత్ర్య సమరంలో నిరంతరం కదలాడుతూ, గాంధీజీ, నేతాజీ, తిలక్, లాలాలజపతి రాయ్, టంగుటూరి ప్రకాశం లాంటి యోధులు ముందు వరుసలో ఉంటే, నిశ్శబ్దంగా, నిర్మాణాత్మకంగా, ఆచరణాత్మకంగా ఉద్యమాలకు ఊపిరిపోసి, లక్ష్య సాధనలో తమ జీవితాల్ని జాతికి ధారపోసి, తెర వెనుక నిలిచిన వారెందరో... అలాంటి తెర వెనుక కార్యసాధకులలో అగ్రగణ్యులు గోపాలకృష్ణ గోఖలే. ఆయన ఆంగ్లంలో నిష్ణాతుడవడమే మాకుండా పాశ్చాత్య రాజకీయాలను అవగాహన చేసుకున్నారు. పాశ్చాత్య తత్వ శాస్త్రాన్నీ ఆకళింపు చేసుకున్నారు. భారతీయ, పాశ్చాత్య సంస్కృతుల మధ్య సమన్వయకర్తగా నిలిచిన గోపాలకృష్ణ గోఖలేను అటు శ్వేత జాతి పాలకులు, ఇటు దేశీయ అధిక సంఖ్యాక నేతలు విశ్వసించారు. అలాంటి భిన్న వ్యక్తిత్వ కారణంగానే గాంధీ, ముహమ్మద్ అలీజిన్నా లాంటి వారిని ఆకట్టుకొని, వారిని తమ రాజకీయ 'గురువు' గా భావించేలా చేసింది. గోపాలకృష్ణ గోఖలే (మే 9, 1866 – ఫిబ్రవరి 19, 1915) మహారాష్ట్ర లోని రత్నగిరి జిల్లాలోని కోట్లుక్‌లో 1886 మే 9న ఒక సాంప్రదాయిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. విశ్వవిద్యాలయ స్థాయి విద్యను అభ్యసించిన తొలితరం భారతీయులలో ఆయన ఒకరు. జస్టిస్ రణడే శిష్యరికంలో భారతీయ అర్థశాస్త్రాన్ని అభ్యసించి, పూనాలోని ఫెర్గూసన్ కళాశాలలో చరిత్ర, రాజకీయార్థ శాస్త్ర ఆచార్యునిగా చేరారు. తరువాత ఆ కళాశాల ప్రిన్సిపాల్ అయ్యారు. ఆ సమయంలోనే ఆయన పదవికి రాజీనామా చేసి భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. 1900 సంవత్సరంలో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన గోఖలేకి అక్కడ ఫిరోజ్‌షా మెహతా సహచర్యం లభించింది. 1902 లో వైస్రాయ్ కౌన్సిల్ సభ్యులయ్యారు. ఆ సమయంలో అస్తవ్యస్తతమై ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ గురించి గోఖలే ఉపన్యసించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. ఆయనలోని ఆర్థిక వేత్తను ప్రపంచానికి పరిచయం చేసింది. 1905 లో బెనారస్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో అధ్యక్షుడిగా ఎన్నికైనపుడు గోఖలే చేసిన ప్రసంగం నేటికీ అత్యుత్తమ ప్రసంగాలలో ఒకటిగా కీర్తించ బడుతోంది. 1902 నుంచి 1915లో మరణించే వరకు భారత శాసన మండలి సభ్యుడిగా ఉన్నారు. గొప్ప విద్యావేత్తగాను, పార్లమెంటేరియన్ గాను ఘనమైన చరిత్ర ఉంది. 1905లో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీని ఏర్పాటుచేశాడు. బ్రిటీష్ వారి విధానాలను తీవ్రంగా వ్యతిరేకించ కున్ననూ భారతీయులలో జాతీయతా భావాన్ని పెంపొందించ డానికి విశేష కృషిచేశారు. విదేశాలలో వున్న భారతీయుల హక్కుల సాధన పట్ల శ్రద్ధ క్రమంలో, దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించిన గాంధీ పరిచయం అయ్యారు. అలా వారి పరిచయం గురుశిష్యుల బంధంగా అభివృద్ధి చెందింది. భారతదేశంలో రాజ్యాంగ సంస్కరణల ప్రక్రియకు ఊతం అందించిన మాంటెగ్ చెమ్స్‌ఫర్డ్ చట్ట రూపకల్పనలో, బెంగాల్ విభజన జరిగిన సందర్భంలో, భారత జాతీయ కాంగ్రెస్ చరిత్రలో, బ్రిటిష్ ఇండియా చరిత్రలో గోఖలే పాత్ర ఎన్నదగినది. (1905) కాశీలో జరిగిన కాంగ్రెస్ వార్షిక సభలలో విదేశీ వస్తు బహిష్కరణ వంటి కీలక నిర్ణయం తీసుకున్న సభలకు అధ్యక్షునిగా గోఖలే ఉండడం గమనార్హం. బ్రిటిష్ పాలనకు విధేయత చూపిస్తూ దేశ వ్యవహారాలను నడిపించడంలో ఆయన మితవాదిగా ముద్ర వేసుకున్న నేపథ్యం. సైద్ధాంతిక భేదాలు ఉన్నా, గోఖలే తన ప్రత్యర్థులతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించారు. బొంబాయిలో, గోఖలే... బ్రిటిష్ ప్రభుత్వ కఠినమైన భూ ఆదాయ విధానాలను వ్యతిరేకించారు. ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను సమర్థించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడటానికి వెనకాడలేదు. గోఖలే సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ ని స్థాపించారు. గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ (గోఖలే ఇన్‌స్టిట్యూట్ అనే పేరుతో ప్రసిద్ధి). భారత్ లో ప్రాచీన ఆర్థికశాస్త్ర విద్యాలయం. ఇది మహారాష్ట్ర పుణె లోని జింఖానా ప్రాంతంలో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వారి ఆర్థిక సహాయముతో స్థాపించబడిన విద్యాలయం. నేటికినీ సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వారే ఈ విద్యాలయానికి ట్రస్టీలు. గోఖలే పిలుపు మేరకే గాంధీజీ 1915లో దక్షిణాఫ్రికాను వీడి శాశ్వతంగా భారత దేశానికి వచ్చారు. పలువురిని ప్రభావితం చేసిన గోపాల కృష్ణ గోఖలే గాంధీజీ వచ్చిన దాదాపు నెల రోజులకే ఫిబ్రవరి 19, 1915న గోఖలే తుదిశ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

## నిషేధానికి గురైన తొలి తెలుగు చిత్రం 'రైతుబిడ్డ' - మే 9...తొలితరం తెలుగు నటి కొమ్మూరి పద్మావతీదేవి వర్ధంతి సందర్భంగా




తెలుగు సినిమా చరిత్రలో ప్రభుత్వం ఆంక్షలకు, నిషేధానికి గురైన మొట్ట మొదటి చిత్రం 'రైతుబిడ్డ'. ఆ రోజుల్లో జమీందారీ వ్యవస్థకూ, విధానాలకూ వ్యతి రేకంగా ఈ చిత్రం చేయడం ఒక రకంగా పెద్ద సాహసమే. ఈ చిత్రంలో జమీందార్ల దౌర్జన్యాలను కళ్ళకు కట్టినట్టుగా చూపించారు గూడవల్లి రామబ్రహ్మం. ఆనాటి జమీందారీ గ్రామాలలో సన్న కారు రైతులు అనుభవిస్తున్న కడ గండ్లను, జమీందారుల అకృత్యాలను, ఈ సినిమాలో కళ్లకు కట్టినట్టుగా చిత్రీకరించాలని, ఈ విషయంలో ఎలాంటి అవాంతరాలు ఎదురైనా తట్టుకుని నిలబడాలని రామబ్రహ్మం ధృఢ నిశ్చయం చేసు కున్నారు. ఈ వాస్తవాన్ని జీర్ణించు కోలేని జమీందారులు ఆగ్రహించి, ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి చివరికి ఆయా జమీందార్ల ప్రోద్బలంతో నిషేధింపచేశారు. బొబ్బిలి రాజా, వెంకటగిరి రాజా సినిమా నిర్మాత మీద పరువు నష్టం దావా వేస్తామని బెదిరించారు. తెలుగు చలన చిత్రాల్లోని కథా గమనానికి కొత్త స్ఫూర్తినిచ్చిన ఈ చిత్రంను లక్ష రూపాయలకు పైగా వ్యయంతో మద్రాసులోని ఎం.పి.పి.సి. స్టూడియో ప్రాంతంలో నిర్మించి 27-8-1939న విడుదల చేశారు. 'గూడవల్లి రామబ్రహ్మం... 'దున్నే వాడిదే భూమి', 'జమీందారీ విధానాలు పోవాలి' లాంటి అంశాలను ప్రాతిపదికగా చేసుకుని 'రైతుబిడ్డ' కథ సిద్ధం చేశారు. తాపీ ధర్మారావు నాయుడు, త్రిపురనేని గోపీచంద్ తో కలిసి 'రైతుబిడ్డ'కు మాటలు రాశారు. కొన్ని పాటలను తాపీ ధర్మారావు, సముద్రాల రాఘవాచార్య రాశారు. మల్లాది విశ్వనాథ కవిరాజు హాస్య సంభాషణలు సమ కుర్చారు. అప్పటికే రైతు ఉద్యమం మీద పాటలు రాసిన కొసరాజు రాఘవయ్య చౌదరిని రైతు ప్రతినిధి రామిరెడ్డి పాత్రకు ఎంపిక చేశారు. ప్రముఖ రైతు ఉద్యమ నాయకులు, నెల్లూరు. "జమీన్ రైతు' వార పత్రిక స్థాపకులు నెల్లూరు వెంకట్రామా నాయుడు గేయాలను, తుమ్మల సీతా రామమూర్తి పద్యాలను కూడా ఈ చిత్రంలో రామబ్రహ్మం వినియోగించు కున్నారు. కథానాయకుడైన రైతు పెద్ద నర్సిరెడ్డి పాత్రకు బళ్ళారి రాఘవను ఎంపిక చేసుకున్నారు. ఆయన భార్య పాత్రకు ప్రముఖ రంగస్థల నటి కొమ్మూరి పద్మావతి దేవి ఎంపికయ్యారు. ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు సోదరుని కుమార్తె 14 ఏళ్ల టంగుటూరి సూర్య కుమారిని రైతు కుమార్తె పాత్రకు తీసుకున్నారు. 1939 ఆగస్టు 27న 'రైతుబిడ్డ' ఆంధ్ర దేశంలో 11 కేంద్రాల్లో విడుదలైంది. అంతకు ముందే ఆ చిత్ర ప్రదర్శనను ఆపు చేయిం చాలని కొంత మంది జమీందార్లు న్యాయస్థానం ద్వారా 'స్టే ఆర్డర్' జారీ చేయించారు. కానీ, అప్పటికే సెన్సార్ బోర్డు వారు ఆ సినిమా ప్రదర్శనకు అనుమతి ఇవ్వడంతో సినిమా విడుదలకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదు. వెంకటగిరి జమీందార్లు. 'రైతుబిడ్డ' చిత్రం ప్రింట్లు కొన్నింటిని తగలబెట్టించి ప్రదర్శనలను ఆపు చేయించడానికి ప్రయత్నించ డంతో అల్లర్లు చోటు చేసు కున్నాయి. జమీందారీ వ్యవస్థలను రద్దు చేయాలని ప్రభుత్వం బిల్లు పెట్టిన కొన్నేళ్లకు ముందే రామబ్రహ్మం 'రైతు బిడ్డ'ను తీసి దర్శకుడిగా తానెంత ముందు చూపు గల వాడినో నిరూపించు కున్నారు. అందుకే మదరాసు అసెంబ్లీలో టంగుటూరి ప్రకాశంగా బిల్లు ప్రవేశ పెట్టడానికి 'రైతు బిడ్డ' సినిమా ఎంత గానో తోడ్పడిందని అప్పట్లో చెప్పుకునేవారు. 'మాలపిల్ల' సినిమాతో తెలుగు సినిమా సంగీతాన్ని ఒక మలుపు తిప్పిన భీమవరపు నరసింహారావు 'రైతుబిడ్డ'తో మరోసారి తన సత్తా చాటుకున్నారు. అలాగే జమీందారు అనుచరుడిగా రైతులను పీడించే ఖాసా సుబ్బన్న పాత్రలో ఆయన నటించారు. కొసరాజు పాటలు రాసి, నటుడుగా కూడా ఆయనకు తన పాత్రకు సంబంధించిన పాటలను తానే పాడుకున్నారు. బళ్లారి రాఘవ కీర్తిని మరింత పెంచింది ఈ సినిమా. ప్రసిద్ధ నృత్య దర్శకుడు వేదాంతం రాఘవయ్య ఈ చిత్రానికి నృత్య సారథ్యం వహించడమే కాక, దశావతార నృత్య సన్నివేశంలో నటించారు కూడా. గూడవల్లి రామబ్రహ్మం కూడా ఈ చిత్రంలో పత్రికా సంపాదకునిగా నటించారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ మాగోఖలే ఈ సినిమా ద్వారానే ప్రవేశించారు. మద్రాసు ప్రావిన్స్ ప్రధాన మంత్రిగా వున్న (1930-32) బొల్లిని ముని స్వామి నాయుడికి ఈ చిత్రాన్ని అంకిత మిచ్చారు. ఆయన రైతు పరిరక్షణకు తనవంతు సహాయ సహకారాలు అంద జేశారు. కొమ్మూరి పద్మావతీదేవి చెన్నై లో 1970 మే 9 తేదీన పరమపదించారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

## వియత్నాం విజయానికి స్ఫూర్తినిచ్చిన రాణా ప్రతాప్ సింగ్ - మే 9...మహారాణా జయంతి

ప్రపంచంలో అగ్రరాజ్యమైన అమెరికాతో 20 ఏళ్లు పోరాటం చేసి, ఎదురే లేదనుకుని విర్రవీగిన అమెరికా మెడలు వంచి విజయం సాధించిన దేశం వియత్నాం. అమెరికాపై సాధించిన విజయం తర్వాత వియత్నాం అధ్యక్షుడిని ఒక విలేకరి ఇలా ప్రశ్నించాడు. "మీరు అమెరికాను ఎలా ఓడించారో ఎవరికీ అంతుబట్టడం లేదు" అని. ఆ విలేకరి అడిగిన ప్రశ్నకు వియత్నాం అధ్యక్షుడు చెప్పిన సమాధానం... "శక్తివతంమైన అమెరికాను ఓడించడానికి నేను గొప్ప దేశభక్తిగల భారతీయ రాజు చరిత్రను చదివాను.... ఆయన జీవితం నుంచి ప్రేరణ పొంది యుద్ధనీతి, ప్రయోగాలతో విజయం సాధించాం" అని అన్నాడు . ఎవరా భారతీయ రాజు? అని విలేకరి అడిగితే వియత్నాం అధ్యక్షుడు లేచి నిలబడి ఆయనే రాజస్థాన్‌లోని "మేవాడ్ వీరుడు మహారాజు రాణా ప్రతాప్ సింగ్" అని గర్వంగా ప్రకటించాడు. మహారాణా ప్రతాప్ సింగ్ పేరు చెప్పేటప్పుడు అతడి కళ్లల్లో వీరత్వం తొణికిస లాడింది. "అలాంటి రాజు మా దేశంలో జన్మించి ఉంటే మేము ఈ ప్రపంచాన్నే జయించే వారమని" అన్నాడు. కాలక్రమంలో వియత్నాం అధ్యక్షుడు చనిపోయిన తర్వాత అతడి సమాధి మీద "ఇది మహారాణా ప్రతాప్ యొక్క శిష్యుడిదని" రాశారు. కొన్నేళ్లకు వియత్నాం విదేశాంగమంత్రి భారత పర్యటనకి రావడం జరిగింది. దేశంలోని గొప్పవారికి శ్రద్ధాంజలి ఘటించడానికి ఆయనకు మొదట గాంధీ సమాధి చూపించారు. ఆ తర్వాత ఎర్రకోట ఇలా చూపించే టప్పుడు... వియత్నాం మంత్రి మహారాణా ప్రతాప్ సమాధి ఎక్కడ? అని ప్రశ్నించాడు. ఆ మంత్రి ప్రశ్నకు ఆశ్చర్య పోయిన భారత అధికారి ఉదయపూర్‌లో ఉందని తెలిపాడు. ఆయన ఉదయ్‌పూర్ వెళ్లి సమాధిని దర్శించి, అక్కడ నుంచి "పిడికిడు మట్టిని" తీసుకొని తన బ్యాగ్‌లో వేసుకున్నాడు. దీన్ని గమనించిన భారత అధికారి మట్టిని బ్యాగ్‌లో ఎందుకు పెట్టు కున్నారని అడిగాడు.... ఇదే మట్టి దేశ భక్తులైన వీర పుత్రులకు జన్మనిచ్చింది... అందుకే దీన్ని తీసుకెళ్లి మాదేశం మట్టిలో కలుపుతాను. ఇలాంటి రాజు ప్రేరణతో అక్కడ కూడా దేశభక్తులు జన్మిస్తారని.... మహారాణా ఈ దేశమే కాదు ప్రపంచం గర్వించదగ్గ రాజని" అన్నాడు. రాజపుత్ర వీరుడు మహారాణా ప్రతాప్ 1540 మే 9 (జ్యేష్ఠ శుక్ల తదియ) రాజస్థాన్‌లోని కుంబల్‌లో జన్మించాడు. 1568లో మేవాడ్ పాలకుడిగా బాధ్యతలు చేపట్టిన మహారాణా 1597 వరకు పరిపాలించాడు. గొప్ప చక్రవర్తిగా చరిత్రకారులు పేర్కొన్న అక్బర్ ఆ సమయంలో ఢిల్లీ సింహాసనాన్ని పాలిస్తున్నాడు. స్వాతంత్రం, ఆత్మ గౌరవం కోసం నిరంతరం మొఘలులతో పోరాటం చేస్తూ రాణా ప్రతాప్ ఏనాడు తల వంచలేదు. మహారాణా ప్రతాప్ ఒకసారి తలదించి, తన కాళ్లమీద పడితే సగం హిందూస్థాన్‌కు రాజును చేస్తానని అక్బర్ ప్రతిపాదిస్తే, దాన్ని తుచ్ఛమైందిగా తిరస్కరించాడు. ఒకసారి భారత్ పర్యటన కోసం అబ్రహాం లింకన్ సిద్ధమవు తుండగా తన తల్లిని తిరిగి వచ్చేటప్పుడు ఏమి తీసుకు రావాలని అడిగాడు. దానికి ఆమె రాజస్థాన్‌లోని "మేవాడ్ నుంచి పిడికెడు మట్టి తీసుకురా", అక్కడి రాజు ఎంత విశ్వస పాత్రుడిగా ఉండే వాడంటే సగం దేశాన్ని ఇస్తామని ప్రలోభపెట్టినా తన మాతృ భూమినే కోరుకున్నాడు, కానీ స్వార్థం చూప లేదని చెప్పిందట. అయితే కొన్ని కారణాల రీత్యా అతని పర్యటన రద్దయ్యింది. ఈ విషయాలు "బుక్ ఆఫ్ ప్రెసిడెంట్ యుఎస్ఏ"లో పేర్కొన్నారు. మహారాణా ప్రతాప్ 7 అడుగుల ఎత్తు ఉండేవాడు. 235 కిలోల బరువున్న మహారాణా యుద్ధ సామగ్రి ఉదయపూర్ ప్యాలెస్‌లో భద్రపరచ బడింది. భాలా (ఈటె) మాత్రమే 35 కిలోల బరువు ఉంటుంది. అల్ బరౌని అనే రచయిత మహారాణా ప్రతాప్ దగ్గర ఉన్న "రాంప్రసాద్" అనే ఏనుగు గురించి తన పుస్తకంలో రాశాడు. మేవాడ్ మీద యుద్ధం చేసేటప్పుడు మహారాణా ప్రతాప్ తోపాటు అయన ఏనుగు రాంప్రసాద్‌ను కూడా బంధిగా పట్టుకుంటే సరిపోతుందని అక్బర్ తన సైన్యంతో అన్నాడు. రాంప్రసాద్ మొఘలకు చెందిన 13 ఏనుగులను హత మార్చింది. అలాగే దాన్ని బంధించడానికి 7 పెద్ద ఏనుగుల మీద 14 మంది నైపుణ్యం కలిగిన మావటిలు చక్రవ్యూహం పన్నారని అల్ బరౌని తన రచనలో పేర్కొన్నాడు. బంధించిన రాంప్రసాద్‌ను అక్బర్ ముందు నిలబెడితే దానికి "పీర్ ప్రసాద్" అని నామకరణం చేశాడు. అయితే ఆ ఏనుగు 18 రోజుల వరకు మంచి నీళు కూడా ముట్టు కోకుండా ప్రాణాలు కోల్పోయింది. తర్వాత ఈ దృశ్యాన్ని చూసిన అక్బర్ ఈ ఏనుగునే వంచలేక పోయాను... మహారాణాను ఎలా వంచగలుగుతా అని అన్నాడట.



మహా రాణా ప్రతాప్ సింహ్ చనిపోయాక అక్బర్ కూడా కన్నీళ్లు పెట్టుకున్నట్లు చరిత్ర కారులు పేర్కొన్నారు. రాణా గుర్రం అయిన "చేతక్" మహారాణాను మోస్తూ, 26 అడుగుల కందకం మీద నుంచి దూకి అది దాటిన తరువాత చనిపోయింది. అంతకంటే ముందే దానికి ముందు కాలు విరిగి ఉన్నప్పటికి ఆ కందకాన్ని దుమికింది. అది ఎక్కడైతే చనిపోయిందో, అదే ప్రదేశంలో దాని గౌరవార్థం చేతక్ మందిరం కట్టారు. చేతక్ ఎంత బలమైనదంటే తన ఎదుట ఏనుగుమీద ఉన్న సైనికుణ్ణి అందు కోవటానికి అంత ఎత్తులో గాలిలో ఎగిరేది. అంతటి శక్తి కలిగినది కనుకే చేతక్ పేరును ద్విచక్ర వాహనానికి పెట్టడం గమనార్హం. హల్దీ ఘాట్ యుద్ధం జరిగి 300 సంవత్సరాల తరువాత కూడా అక్కడి నేలలో కత్తులు లభించాయి. చివరి సారిగా 1985 లో ఒక ఆయుధం దొరికింది. "ఒంటరిగా, మరే రాజపుత్ర రాజ్యాల మద్దతూ లేకుండా మొగలు సామ్రాజ్యాన్ని ధిక్కరించిన రాణా ప్రతాప్ శౌర్యం, రాజపుత్ర శౌర్య ప్రతాపాలను, వారి ఆత్మ గౌరవాన్నీ, వారి విలువలనూ వివరించే గొప్ప గాథ. రాణా ప్రతాప్ అవలంబించిన యుద్ధ తంత్రాన్ని ఆ తరువాత మాలిక్ అంబర్, ఛత్రపతి శివాజీలు కూడా అనుసరించారని", చారిత్రికుడు సతీష్ చంద్ర పేర్కొన్నాడు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

చురకలు



# విలీనం.. అభివృద్ధికి దూరం

వేములవాడ: మున్సిపాలిటీలో తమ గ్రామాలు విలీనమైతే మెరుగైన అభివృద్ధి ఉంటుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. వీధుల్లో కనీసం మురుగు కాలువలు, సీసీ రోడ్ల వసతి నేటికీ సమకూరడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ మున్సిపాలిటీలో తిప్పాపూర్, నాంపల్లి, అయ్యోరుపల్లి, శాత్రాజుపల్లి, కోనాయిపల్లి గ్రామాలను ఐదేళ్ల క్రితం విలీనం చేశారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల పరిపాలన మున్సిపల్ పరిధిలోకి వెళ్లి పోయింది. అప్పటి నుంచి తమకు సమస్యలు మొదలయ్యాయని ప్రజలు అంటున్నారు. ఏచిన్న పని కావాలన్నా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సి రావడంతో సమస్యలు మరింత పెరిగాయి. చాలా దూరంలో ఉన్న గ్రామాలను సైతం మున్సిపల్‌లో విలీనం చేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. నాంపల్లి, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి గ్రామాలు పట్టణానికి దాదాపు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. ఏదేని అవసరాలకు వేములవాడలోని మున్సిపల్ కార్యాలయానికి రావడం తమకు ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**శివారు కాలనీల్లోనూ...**

ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణం రోజు రోజుకూ విస్తరిస్తుండటంతో శివారు ప్రాంతాల్లో కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. ఈ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పట్టణం చుట్టూ బైపాస్ రహదారులు, శివారు వీధులతో పాటు సాయినగర్, కోరుట్ల వైపు రోడ్డు, మల్లారం రోడ్డు, తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు నేటికీ లేవు. పట్టణం నుంచి మల్లారం వెళ్లే ప్రధాన రోడ్డు వెంబడి మురుగు కాలువ లేక పెద్ద ఎత్తున మురుగు రోడ్డుపై పారుతోంది. దుర్గంధం వెదజల్లడంతో తాము రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఆయా నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని అంటున్నారు. లేకుంటే వర్షాకాలంలో మురుగు సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

**మౌలిక వసతులేవీ...**

విలీన గ్రామాల్లో మౌలిక వసతులు అంతంతమాత్రమే ఉన్నాయి. చాలా గ్రామాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల సదుపాయం లేదు. వర్షాకాలంలో చాలా వీధులు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ మన్సిపల్‌లో రెండేళ్ల క్రితం టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20 కోట్లతో పాటు ఇతరత్రా నిధులను మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి వెచ్చించినప్పటికీ అవి సరిపోలేదు. చాలా గ్రామాల్లోని అంతర్గత వీధుల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. వర్షాకాలంలో మురుగు వీధుల్లో పారుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమస్యలు మొరపెట్టుకున్నా పరిష్కారం కావడం లేదని అంటున్నారు.

**నిధులు మంజూరు కావాల్సి ఉంది**

గతంలో మంజూరైన నిధులతో పట్టణంలోని వివిధ వార్డులతో పాటు విలీన గ్రామాల్లోనూ మురుగు కాలువలు, సీసీ రోడ్ల పనులు చేపట్టాము. పలుచోట్ల ఇంకా మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# ఆర్టీవో కార్యాలయానికి మోక్షమెప్పుడో..!

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గం మారుమూల గిరిజన ఏజెన్సీ ప్రాంతం. నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలో 60 శాతం వరకు గిరిజనులే నివసిస్తున్నారు. నిరక్షరాస్యత ఎక్కువగా ఉండి ఉపాధి కోసం వలసలు వెళ్లే ప్రాంతంలో 2013లో ఆర్టీఓ కార్యాలయం మంజూరైనప్పటికీ దశాబ్ద కాలంగా దాని ఏర్పాటు కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. వాహనదారులు లైసెన్సు పొందాలన్నా.. రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా.. తిప్పలు తప్పడం లేదు.డివిజన్‌లో చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి, గుడిపల్లి, గుర్రంపోడ్, చింతపల్లి, కొండమల్లేపల్లి, దేవరకొండ మండలాలున్నాయి. డిండి మండలం నాగర్‌కర్నూల్ జిల్లాను ఆవరించి ఉంటుంది. అంటే దేవరకొండకు 40 కి.మీ దూరంగా విసిరేసినట్లుగా ఉంటుంది. చందంపేట మండలం పొగిళ్ల గ్రామం దేవరకొండకు 60 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది. దాదాపు కృష్ణాపరివాహక ప్రాంతంలో గ్రామాలుంటాయి. వీరు వాహనాలు కొనుగోలు చేసినప్పుడు వాటి రిజిస్ట్రేషన్, లైసెన్సు రెన్యువల్, ఓనర్‌షిప్ మార్పిడి, ఫిట్‌నెస్ చేపట్టాలంటే మిర్యాలగూడకు తీసుకొని వెళ్లాల్సిందే. మిర్యాలగూడ దాదాపు 130 నుంచి 150 కిమీ వరకు ఉంటుంది.



డివిజన్‌లో దాదాపు 30వేల ద్విచక్రవాహనాలు, 5వేల వరకు ఆటోలు, 10వేల నాలుగు చక్రాల వాహనాలున్నాయి. ట్రాక్టర్లు దాదాపు 3వేల వరకు ఉంటాయి. వీటితోపాటు లారీలు 2500 ఉంటాయి.

వాహనదారులకు ఇక్కట్లు:

శ్రీనివాసాచారి, దేవరకొండ

డివిజన్‌లో ఆర్టీవో కార్యాలయం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ కోసం దేవరకొండ నుంచి 80 కిమీ దూరంలో ఉన్న మిర్యాలగూడకు వెళ్లాలంటే ఒకరోజు సమయం పడుతుంది.

**ఏర్పాటుకు కృషి:**

నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్యే

నియోజకవర్గంలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు కోసం తన వంతుగా కృషిచేస్తున్నా. సంబంధిత అధికారులతో ఇప్పటికే దీనిపై చర్చించాం.

# అయ్యో అన్నదాతకు ఎంత కష్టమొచ్చె!



హుజూరాబాద్ :జిల్లాలో ఆది, సోమవారం వీచిన ఈదురు గాలులకు, అకాల వర్షాలకు పలువురు రైతులు నష్టపోయారు. కొన్ని మామిడితోటల్లో చెట్లు విరిగిపోగా, చాలా చోట్ల కాయలు రాలిపోయాయి. పలువురి రైతుల ధాన్యం రాశులు తడిసిపోయాయి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం తలెత్తింది.గంగాధర మార్కెట్‌లో కాలువలో కొట్టుకుపోతున్న ధాన్యం ఎత్తుతున్న రైతు

గంగాధరలో కురిసిన భారీ వర్షానికి మార్కెట్ లోని ప్రభుత్వ కేంద్రంలో ధాన్యం వరదనీటి ప్రవాహంలో కొట్టుకపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మధురానగర్, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, నారాయణపూర్, కురిక్యాల, ఇతర గ్రామాల్లోనూ ధాన్యం తడిసిందని వాపోయారు. కేశవపట్నం గ్రామ శివారులో ఓ ఇంటిముందు నిలిపి ఉంచిన కారుపై చెట్టు విరిగిపడింది.

**కేశవపట్నంలో కారుపై విరిగిపడిన చెట్టు**

జిల్లాలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి శంకరపట్నం, చిగురుమామిడి అన్నదాతలు ఆర్థికంగా నష్టపోయారు. కల్లాలు, కొనుగోలు కేంద్రాలు, రహదారుల పక్కన నిల్వచేసిన ధాన్యం తడిసిపోవడంతో ఆరబెట్టడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాడికల్‌తోపాటు పలు గ్రామాల్లో వరి పంట పక్కకు వంగింది. అర్కండ్ల, కేశవపట్నం, కాచాపూర్‌తోపాటు పలు గ్రామాల్లో మామిడి తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి. చిగురుమామిడి మండలంలోని మామిడి తోటలను సోమవారం ఉద్యాన అధికారిని మంజువాణి పరిశీలించారు. 2 ఎకరాల్లో కాయలు నేలరాలాయని తెలిపారు. మరోవైపు మండలంలో 25 విద్యుత్తు స్తంభాలు విరిగిపడి, తీగలు తెగిపోయి సుమారు రూ.3.50 లక్షల నష్టం వాటిల్లినట్లు విద్యుత్తు అధికారి ప్రకాశ్ పేర్కొన్నారు.

**నగరంలో గాలి దుమారం.. వర్షం**నగరంలో గాలిదుమారంతోపాటు వర్షం పడింది. విపరీతమైన దుమ్ము రావడంతో రోడ్ల మీద రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడ్డారు. పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లకు కట్టిన ఫ్లెక్సీలు చినిగిపోయి వేలాడాయి. భగత్‌నగర్‌లోని ప్రైవేటు జూనియర్ కళాశాల భవనం నుంచి వెనుకాల ఉన్న ఇంటిపై గాలికి రేకులు ఎగిరిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది.

# ఆరంభ శూరత్వం.. ఆపై అలసత్వం



హుజూరాబాద్ : హుజూరాబాద్ మోడల్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు 2017లో నిర్మాణ పనులను ప్రారంభించారు. అప్పట్లో రూ.2.35 కోట్లతో మిషన్ కాకతీయ పనుల్లో భాగంగా మొదట పూడికతీత చేపట్టారు. కొంతమేరకు ఊపందుకున్నా.. అనంతరం సన్నగిల్లాయి. మొత్తంగా రూ.4.65 కోట్ల వ్యయంతో ప్రారంభించగా.. అర్ధాంతరంగా ఆగిపోవడంతో పట్టణ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**106 ఎకరాల విస్తీర్ణం**

హుజూరాబాద్‌లోని మామిండ్లవాడకు అత్యంత సమీపంలో 106 ఎకరాల విస్తీరంతో వ్యాపించి ఉన్న మోడల్ చెరువులో ఎస్సారెస్పీ ద్వారా నీటిని నిల్వ చేయడం, పర్యాటక కేంద్రంగా పరిగణించేందుకు మొదటగా కట్ట ప్రాంతాన్ని విశాలంగా చదునుచేసి వదిలేశారు. సుమారు 10 మీటర్ల వెడల్పుతో సీసీ రహదారికి మట్టి పనులను అప్పట్లో సగానికిపైగా పూర్తిచేశారు. చెరువు చుట్టూ 1.7 కి.మీలతో పాటు వాకర్స్ ట్రాక్‌ను నిర్మించేందుకు కృషి చేశారు. వీటితోపాటు బతుకమ్మ వేడుకలకు ఘాట్, రహదారి, ఎస్సారెస్పీ నుంచి నీటిని తరలించేందుకు భారీ పైపులతో కల్వర్టుల నిర్మాణాలు చేపట్టారు.

**రెండో దశ పనుల్లో నిర్లక్ష్యం**

నిత్యం వ్యాయామం చేసేవారికి వాకర్స్ ట్రాక్‌ను.. దానికి ఇరువైపులా సేద తీరేందుకు గ్యాలరీల మాదిరిగా సీటింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. అయితే చుట్టూ అందమైన గార్డెనింగ్‌తోపాటు వివిధ రకాల పండ్లు, ఔషధ, మొక్కలను పెంచనున్నట్లు చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. వీటితోపాటు సుమారు 17.67 టీఎంసీల ఎస్సారెస్పీ నీటి నిల్వ సామర్థ్యపు పనులకు మోక్షం కలగనుందని తెలిపినా.. ఆ దిశగా అడుగులు పడలేదు. దీంతో పట్టణ, సమీప గ్రామాల ప్రజల దాహార్తి తీరుతుందని ఆశించారు. 2018-19 జూన్ వరకు రూ.2.35 కోట్ల పనులు.. అప్పటి చిన్న నీటి పారుదలశాఖ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ పర్యవేక్షణలో పూర్తయ్యాయి. అనంతరం రెండో దశ పనులకు నిధులు మంజూరుకాగా.. గుత్తేదారు నిర్లక్ష్యం మూలంగా నిలిపివేశారు.

దీనిపై మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను సంప్రదించగా.. ఆయా పనులు ఎంతవరకు చేసి, నిలిపివేశారో పరిశీలిస్తానన్నారు. పునరుద్ధరణ దిశగా జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిస్తానని వివరణ ఇచ్చారు.

# మధిరలో మరో ప్రయోగం



బోనకల్లు : రాష్ట్రంలో ప్రయోగాత్మక ప్రాజెక్టులో భాగంగా మధిర నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు కానున్నాయి. పాఠశాలల ఏర్పాటుకు కావల్సిన స్థలాలు సేకరించాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆయా తహసీల్దార్లకు లేఖలు రాశారు. పబ్లిక్ స్కూల్స్‌లో మౌలిక వసతుల కల్పనకు ఈ ఏడాది ఒక్కో పాఠశాలకు రూ.50 లక్షలు నిధులు సమకూర్చనున్నారు. ఈ ప్రక్రియ కార్యరూపం దాలిస్తే మధిర నియోజకవర్గంలో పాఠశాల విద్యారంగంలో అనేక మార్పులు రానున్నాయి. గ్రామాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. కొన్నిచోట్ల అయిదో తరగతి వరకూ 20లోపు పిల్లలున్న స్కూల్స్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో హేతుబద్ధీకరణ స్థానంలో తెలంగాణ పబ్లిక్స్ స్కూల్స్ ఏర్పాటుకు నూతన ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు మధిర నియోజకవర్గం ప్రయోగాత్మక వేదికైంది. ఇందులో భాగంగా ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించారు. ఆ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలన్నింటినీ 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'లో భాగం చేస్తారు. పాత స్కూళ్లను వెంటనే మూసివేయరు. ఒకటి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్ని ఆయా గ్రామాల నుంచి బస్సుల ద్వారా క్లస్టర్ కేంద్రంలోని పబ్లిక్ స్కూల్స్‌కు తీసుకెళ్తారు. క్రమంగా గ్రామాల్లోని పాఠశాలలు, ఉపాధ్యాయుల్ని విలీనం చేస్తారు. పబ్లిక్ స్కూల్స్‌లో సెమీ రెసిడెన్షియల్ విధానం అనుసరిస్తారు. అక్కడే ఉండాలని అనుకునే విద్యార్థులకు ఆశ్రమం కల్పిస్తారు. నిత్యం వెళ్లివచ్చే వారికి బస్సు సదుపాయం అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులను తీసుకొచ్చే బస్సులను ఆపరేట్ చేసే బాధ్యత ఐకేపీ గ్రామ సమాఖ్యలకు అప్పగించే అవకాశం ఉంది.

**మండలాల వారీగా క్లస్టర్లు- పాఠశాలలు**

బోనకల్లు: చిరునోముల, రావినూతల, కలకోట ఉన్నత పాఠశాలలు.

చింతకాని: నాగులవంచ, పందిళ్లపల్లి, లచ్చగూడెం ఉన్నత పాఠశాలలు

ముదిగొండ: ముత్తారం, పెద్దమండవ, ముదిగొండ ఉన్నత పాఠశాలలు.

మధిర: ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిరిపురం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిర, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహదేవపురం.

ఎర్రుపాలెం: జమలాపురం, మీనవోలు ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బనిగండ్లపాడు.

# భద్రతకు ప్రాధాన్యం

ఖమ్మం : నూతన వాహనాలకు బిగిస్తున్న హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్(హెచ్ఎస్ఆర్పీ)ను ఇకపై పాత వాహనాలకూ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఏప్రిల్ 1 కన్నా ముందున్న అన్ని రకాల వాహనాలు తప్పనిసరిగా హెచ్ఎస్ఆర్పీని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించింది. సెప్టెంబరు 30 వరకు గడువు విధించింది. ఆ తరువాత హెచ్ఎస్ఆర్పీ లేకుండా రోడ్లపై తిరిగితే రవాణాశాఖ అధికారులు జరిమానా విధించే అవకాశం ఉంది. ఈమేరకు ఏప్రిల్ 9న కేంద్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయగా నేటికీ పూర్తిస్థాయిలో వాహనదారులకు స్పష్టత రాలేదు. రవాణాశాఖ అధికారులు, వాహనాల షోరూం నిర్వాహకులు సైతం వాహనదారులకు ఏమీ చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఖమ్మం జిల్లాలో సుమారు 3లక్షలు, భద్రాద్రి జిల్లాలో 1.50 లక్షల వరకు పాత వాహనాలు పాత ప్లేట్లతో తిరుగుతున్నాయని రవాణాశాఖ లెక్కలు చెబుతున్నాయి. వాహనాలకు హెచ్ఎస్ఆర్పీ బిగించేందుకు ఐదు నెలల గడువు ఇచ్చిన నేపథ్యంలో వాహనదారులు ఆన్‌లైన్ సెంటర్లతోపాటు రవాణాశాఖ కార్యాలయాలనూ సంప్రదిస్తున్నారు.

**ఎలా పొందాలి..**డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్ఐఏఎం.ఇన్(సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్) వెబ్‌సైట్‌లో వాహనదారుడు పేరు, రిజిస్ట్రేషన్ నంబర్, ఈ-మెయిల్, మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. తర్వాత కేటగిరీ, వాహనం కంపెనీ లోగోపై క్లిక్ చేశాక రిజిస్ట్రేషన్ నంబర్, ఛాసిస్ నంబర్, ఇంజిన్ నంబర్, ఇతర వివరాలను నమోదు చేయాలి. వాహన రకాన్ని బట్టి ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాలి. ఆర్డర్ కన్ఫర్మ్ అవుతుంది. తర్వాత ప్రభుత్వం కేటాయించిన డీలర్‌కు ఆర్డర్ వివరాలు వెళతాయి. సంబంధిత వాహనం హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ వివరాలు రవాణాశాఖ సర్వర్‌లో అప్‌డేట్ అవుతాయి. ప్రస్తుతం షోరూంలకు హెచ్ఎస్ఆర్ పీలు అందజేస్తారా? నేరుగా వాహనదారు చిరునామాకు పంపిస్తారా..? అనే అంశంపై స్పష్టత కొరవడింది. **సెప్టెంబర్ 30 వరకు గడువు**కేంద్ర ప్రభుత్వం 2019 ఏప్రిల్ 1కన్నా ముందున్న పాత వాహనాలకు తప్పనిసరిగా హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగించుకోవాల్సిందేనని ఇటీవల స్పష్టం చేసింది. సెప్టెంబరు 30 వరకు గడువు విధిం చింది. వాహన రకాన్ని బట్టి నంబర్ ప్లేట్ ధర రూ.320 నుంచి రూ.800 వరకు ఛార్జీలను ఖరారు చేసింది. నకిలీ నంబర్ ప్లేట్లకు అడ్డుకట్ట వేయ టం, దొంగతనాలను అరికట్టడం, వాహనాల రహదారి భద్రత లక్ష్యంతో అన్ని రకాల ఉత్తర్వుల్లో పేర్కొంది.

# గ్రామస్థుల గ్రంథాలయం..!

చిట్యాల : యువతను సన్మార్గం వైపు మళ్లించడంతో పాటు, నిరుద్యోగులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా గ్రామస్థులే స్వయంగా దాతల నుంచి సుమారు 10 వేల పైచిలుకు పుస్తకాలను సేకరించి 'నవయుగ చైతన్య గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చిట్యాల మండలం తాళ్లవెల్లంలకు చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు కొండవీటి రాధాకృష్ణ (ఇటీవల మృతిచెందారు), మాదగోని భిక్షపతి గౌడ్, అభ్యుదయ రైతు పజ్జూరు అజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు గ్రామస్థులతో కలిసి తమ ఆలోచనను ఆచరణ రూపంలోకి తీసుకొచ్చారు. 2023 డిసెంబరులో జలసాధన ఉద్యమకారుడు దుశ్చర్ల సత్యనారాయణ చేతులమీదుగా ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించుకున్నారు.

**10 వేల పుస్తకాలు, రెండు దినపత్రికలు**



బీసీ కాలనీలోని బీసీ సామాజిక భవనం నాలుగు గదుల్లో రెండింటిని గ్రంథాలయానికి వినియోగించుకుంటున్నారు. షెడ్డు నిర్మించి, వయోవృద్ధులు వస్తే కూర్చోడానికి ఏర్పాటు చేయించారు. ఉదయం 6 గంటల నుంచి 10గం. వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8గంటల వరకు గ్రంథాలయ పనివేళలుగా నిర్ణయించారు. పదో తరగతి విద్యార్థుల నుంచి ఐఏఎస్‌కు సన్నద్ధమయ్యేవారికి అవసరమైన పుస్తకాలు ఉన్నాయి. గ్రంథాలయ సభ్యత్వానికి సంబంధించి ప్రవేశరుసుం నెలకు రూ.11 వసూలుచేసి, గ్రంథాలయం పేరిట తెరిచిన బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నారు. ప్రస్తుతం 40 మంది వరకు సభ్యులున్నారు. చదువరులు కూడా రోజుకు 30 మంది వరకు వస్తున్నారు. గ్రంథాలయ కేంద్రంగా చేసుకుని గ్రామస్థుడు గట్టోజు శ్రీనివాస్ చిన్నారులకు గురుకుల విద్యాసంస్థల ప్రవేశాలకు ఉచితశిక్షణ ఇస్తున్నారు.గ్రంథాలయ నిర్వహణ గ్రామస్థులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు విన్నవించామని మాదగోని భిక్షపతిగౌడ్ తెలిపారు. కలెక్టర్ స్పందించి జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి బాలమ్మను మా గ్రంథాలయ సందర్శనకు పంపించారు. నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తంచేశారు.

# వేగంగా.. పోతున్నారు..!

చౌటుప్పల్ : వేగం కన్నా ప్రాణం మిన్నా.. రహదారి భద్రతలో ప్రధాన సూత్రమిది. ప్రచారానికి బాగానే ఉన్నా.. పట్టించేకునే వారేరి?.. రోజూ హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో అతివేగం, ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడమే ప్రధాన కారణం. హైవేపై 80 కిలోమీటర్ల వేగం లోపు ప్రయాణించాలి. కానీ.. నిగనిగలాడే నాలుగు వరుసల జాతీయ రహదారిపై 100 నుంచి 150 కిమీ వేగంతో పలు వాహనాలు ప్రయాణిస్తున్నాయి. రయ్‌మంటూ బైక్‌పై దూసుకెళ్లే యువకుడు కన్నుమూసి కన్ను తెరిచేలోగా కనుమరుగవుతున్నాడు.

**ఎక్కువగా పాదచారులు, ద్విచక్రవాహనచోదకులే..**

రహదారిపై ఎక్కువగా కూడళ్ల వద్దే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డును దాటే సమయంలో పాదచారులు, ద్విచక్రవాహనచోదకులే ఎక్కువగా ప్రాణాలను విడుస్తున్నారు. నేరుగా వెళ్లే లైట్‌మోటారు, భారీ వాహనానచోదకులు కూడళ్ల వద్ద కూడా అధిక వేగంతో వెళ్తుండటమే దీనికి కారణం. హైవేపై సరిగ్గా సీసీ కెమెరాలు కూడా లేవు. కూడలికి కొద్దిదూరం సూచికబోర్డులు, బోలార్డ్స్, స్టడ్స్, దంబుల్ స్టిప్స్ వంటివి పెట్టినా చోదకులు గమనించడం లేదు.కూడళ్ల వద్ద 40 కి.మీ వేగం కంటే అధికంగా వెళ్లొద్దు. కొన్నేళ్ల క్రితం చౌటుప్పల్ మండలం ఎల్లంబావి అండర్‌పాస్ వంతెనపై, పంతంగి టోల్‌ప్లాజా ముందు రాడో మీటరు ఏర్పాటు చేశారు. వేగంగా వెళ్తే వాహనం ఎంత వేగంతో వెళ్తుందో చూపించడంతోపాటు వాహనదారులను నెమ్మదిగా వెళ్లమని మీటరు సూచించేది. ఇప్పుడు రాడో మీటర్లు పనిచేయడం లేదు. దారి పొడవునా కూడళ్ల వద్ద అండర్‌పాస్‌లు లేకపోవడమే ప్రమాదాలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. అతివేగంగా వెళ్లడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించపోవడం వల్లే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని చౌటుప్పల్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని వాహనచోదకులకు తరచూ అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# 'చిన్న'బోవద్దని..!

మునగాల: చిన్నారుల భవిష్యత్తుకు బీజం పూర్వ ప్రాథమిక విద్య. నేడు ఆ విద్యకు నిలయాలైన అంగన్‌వాడీ కేంద్రాలు అసౌకర్యాలకు చిరునామాగా నిలిచాయి. జిల్లాలో ఇప్పటికీ చాలా కేంద్రాలకు సొంత భవనాలు లేవు. మరికొన్ని కేంద్రాల్లో మరుగుదొడ్లు, విద్యుత్తు, తాగునీరు, ప్రహరీలు లేకుండా ఉన్నాయి. అసౌకర్యాల కారణంగా చిన్నారులను చేర్పించడానికి కొందరు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తుండగా.. లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రావడానికి సుముఖత చూపడం లేదు.



ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు కోరింది. ప్రతిపాదనల్లో శిథిలావస్థలోని భవన నిర్మాణాలకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణాలకు మాత్రమే అవకాశం కల్పించింది. విద్యుత్తు సౌకర్యం, ప్రహరీ నిర్మాణాలకు అవకాశం ఇవ్వలేదు.

జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 1,209 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 221 అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్ల నిర్మాణానికిగానూ ఒక్కో దానికి రూ.36వేల చొప్పున, 40 అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీటి సౌకర్యం కల్పనకు ఒక్కోదానికి రూ.17 వేల చొప్పున మొత్తం రూ.1.16 కోట్లు మంజూరు చేశారు.

జిల్లా వ్యాప్తంగా 1.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు తెలిపారు. వెంటనే ఆయా ప్రాజెక్టుల్లో ఎంపికైన అంగన్‌వాడీల్లో మరమ్మతులు చేపట్టి, చిన్నారులకు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

# అరకొర సిబ్బంది.. అంతటా ఇబ్బంది

నల్గొండ : సూర్యుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. వృద్ధులు, యువకులు, చిన్నారులు అనే తేడా లేకుండా ఎక్కువ శాతం మంది వేసవిలో వచ్చే రోగాలబారిన పడుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా జనరల్ ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. అయితే ఆ విభాగంలోనూ పూర్తి స్థాయిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారిపైనే భారం పడుతోంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా మూడేళ్ల పైబడిన కారణంగా కొంతమంది వైద్యాధికారులు వెళ్లాల్సి వచ్చింది.

వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో దేవరకొండ, మిర్యాలగూ




డ, నకిరేకల్, నాగార్జునసాగర్, మర్రిగూడ, ఆసుపత్రులతో పాటు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, యూపీహెచ్‌సీలు, బస్తీదవాఖానాల్లో వైద్యులు, నర్సులు, కిందిస్థాయి సిబ్బంది సరిపడలేక ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, వైద్యకళాశాల ప్రిన్సిపల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వంటి ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇన్‌ఛార్జులతో కాలం వెళ్లదీస్తున్నారు.

**నివేదికలు పంపాం:** డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి విభాగాల వారీగా ఖాళీల వివరాలను కలెక్టర్‌తో పాటు ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వ ఆదేశాలు వస్తే నియామకాలు జరుగుతాయి. ప్రస్తుతానికి జిల్లాలో ఎక్కడా ఎవరికి ఇబ్బంది లేకుండా ఉన్న వైద్యులు, సిబ్బందితో వైద్య సేవలు అందిస్తున్నాం.

# శంకుస్థాపన ముహూర్తం సమీపిస్తోంది!

వేంసూర జిల్లాలో తొలి పామాయిల్ కర్మాగార పనుల ప్రారంభోత్సవానికి ముహూర్తం దగ్గరపడుతోంది. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో కర్మాగార నిర్మాణానికి గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ఉగాది పర్వదినాన శంకుస్థాపనకు ఆయిల్ ఫెడ్ అధికారులు ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు.

**ఏర్పాట్లు ఇలా..**

కల్లూరుగూడెంలో 42 ఎకరాల్లో రూ.87 కోట్లతో పామాయిల్ కర్మాగారం కొత్తగా నిర్మించనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్ ఫెడ్ రాష్ట్ర అధికారుల ఆదేశాలతో పరిశ్రమ శంకుస్థాపనకు సంబంధించిన ఏర్పాట్లు కొద్దిరోజులుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ప్రధాన రహదారి నుంచి కర్మాగారానికి 60 అడుగుల మార్గాన్ని శరవేగంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తిచేసి ఫెన్సింగ్ వేయగా.. ఆ తర్వాత బుష్ కటింగ్ పనులు పూర్తిచేశారు.

**తోటల విస్తరణకు మరింత అవకాశం**

కర్మాగారం పూర్తయితే జిల్లాలో, ముఖ్యంగా సత్తుపల్లి నియోజకవర్గంలో ఆయిల్‌పాం సాగు మరింత జోరందుకుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కర్మాగార ప్రతిపాదనకు ముందే వేంసూరుతో పాటు సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు మండలాల్లో తోటలు వేసేందుకు రైతులు ఆసక్తి చూపారు. తాజాగా కొత్త పరిశ్రమ రానున్న నేపథ్యంలో 50-60 ఏళ్ల వయసున్న మామిడి తోటలను తొలగించి ఆయిల్‌పాం మొక్కలు నాటేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఫిబ్రవరి, మార్చిలోనే వేంసూరు మండలంలో 150 ఎకరాల్లో మామిడి తోటలు తొలగించడం విశేషం. మామిడితో పోల్చితే ఆయిల్‌పాం తోటల నిర్వహణ, యాజమాన్య పద్ధతులు తేలిక. అధిక దిగుబడులతో పాటు వాటి రవాణా సులువుకానుంది. ప్రభుత్వ రాయితీలతో తోటల విస్తీర్ణం వచ్చే ఏడాదికల్లా మరింత పెరిగే అవకాశముంది. ప్రస్తుత లెక్కల ప్రకారం.. ఖమ్మం 1,478, పాలేరు 3,732, మధిర 3,741, సత్తుపల్లి 11,672, వైరా నియోజకవర్గంలో 5,190 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోంది.

# ప్రాజెక్టులు నిండకుంటే ఇక్కట్లే!

ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ నెల ఆరంభం నుంచి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. వచ్చే రెణ్నెల్లు భానుడి సెగలు, వడగాలులు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. మరోవైపు భూగర్భజలాలు పడిపోతున్నాయి. వ్యవసాయ బోర్లు వట్టిపోతున్నాయి. నదీ జలాలు అడుగంటుతున్నాయి. ఈ సమయంలో ప్రణాళికాబద్ధంగా, ప్రత్యామ్నాయాలతో ముందుకుసాగితేనే సాగు, తాగు ఎద్దడిని సమర్థంగా ఎదుర్కోగలం. ప్రధాన ప్రాజెక్టుల వారీగా ప్రస్తుత పరిస్థితులు, అధికారులు చేపట్టాల్సిన చర్యలను పరిశీలిస్తే..

**పాలేరు జలాశయం**

జలాశయానికి నాగార్జునసాగర్ నుంచి 5,551 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వీటిల్లోంచి ఎడమ కాలువ ఆయకట్టుకు 4,606, పాత కాలువకు 200, 'భక్త రామదాసు' ఆయకట్టుకు 275 క్యూసెక్కుల నీరిస్తున్నారు. సాగు సంగతి ఇలా ఉంటే.. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల తాగునీటికి మరో 135 క్యూసెక్కులు సరఫరా జరుగుతోంది. సాగర్ నుంచి మరో నెలపాటు జలాలొస్తాయని అంచనా. ఆ తర్వాత రిజర్వాయర్ నుంచి 2,375 ఆవాసాలకు రెణ్నెల్లపాటు తాగునీరివ్వాలి. ఏప్రిల్‌లో సాగర్ నీరివ్వకుంటే గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదు. ప్రస్తుత జలాల్ని రైతులు సాగుకు వారబందీతో పొదుపుగా వాడుకోవాలి.

నిల్వ సామర్థ్యం: 2.558 టీఎంసీలు

ప్రస్తుత నిల్వలు: 1.768 టీఎంసీలు

పూర్తిస్థాయి నీటిమట్టం (అడుగుల్లో): 23

ప్రస్తుతం: 18.25

వైరా..వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని 11 మండలాల్లోని 465 గ్రామాల అవసరాలకు.. రోజుకు 10 కోట్ల లీటర్ల తాగునీరివ్వాల్సి ఉంది. ఇది సాధ్యం కావాలంటే నీటిమట్టం 13 అడుగులకు తగ్గకుండా చూడాలి. మరోవైపు, ఆయకట్టు పంటలు కాపాడుకునేందుకు జలాలు అందిస్తున్నారు. ఎండల తీవ్రతతో నీటి ఆవిరి శాతం పెరుగుతుంది. సాగర్ జలాలు అరకొరగా సరఫరా అవుతున్నందున, వచ్చే రెణ్నెల్లు నిల్వల్ని పొదుపుగా వాడేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

పూర్తిస్థాయి నీటిమట్టం (అడుగుల్లో): 18.3

ప్రస్తుతం: 12.2

"జిల్లాలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుతాం. గ్రామీణ నీటిసరఫరా, భగీరథ గ్రిడ్ విభాగం సమన్వయంతో నిల్వల నిర్వహణ, శుద్ధి, సరఫరా చేపడుతున్నాం. ప్రాజెక్టుల్లో నిల్వలు తగ్గితే ప్రత్యామ్నాయ వనరులు సద్వినియోగం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టుకు సైతం వారబందీ విధానంలో నీరిస్తున్నాం. వృథాకు అడ్డుకట్ట వేస్తూనే, జలాలు పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచిస్తున్నాం."మిషన్ భగీరథ, నీటిపారుదల శాఖ అధికారులు

# అప్రమత్తతతోనే రక్ష



గోదావరిఖని: జగిత్యాల జిల్లాలో గతేడాది పోక్సో కేసుల్లో ఎనిమిది మందికి జైలు శిక్ష విధించారు. అయిదుగురికి జీవిత ఖైదుతోపాటు రూ.30 వేల చొప్పున జరిమానా విధించారు. మరో ముగ్గురు నిందితులకు అయిదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.15 వేల చొప్పున జరిమానా విధించారు. ఉమ్మడి జిల్లాలో తరచూ పోక్సో కేసులు నమోదవుతున్న తీరు బాలికల విషయంలో తల్లిదండ్రులు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేస్తున్నాయి.. అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ చట్టం తీసుకు వచ్చింది. అయినా అమానుష చర్యలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. మరోవైపు చిన్న వయసులోనే ప్రేమల పేరిట మైనారిటీ తీరని బాలికలను వివాహాలు చేసుకుంటున్న వారు కూడా ఈ చట్టం చేతికి చిక్కుతున్నారు. ఉమ్మడి జిల్లాలో గతేడాది మొత్తం 116 పోక్సో కేసులు నమోదు కాగా, ఈ ఏడాది నాలుగు నెలల్లోనే 87 కేసులు నమోదు కావడం గమనార్హం. చిన్న వయసు నుంచే బాలికలకు స్వీయ రక్షణ చర్యలు తెలియజేయడంతోపాటు చట్టం ఎంత పదునైనదో జనంలో అవగాహన కలిగిస్తేనే ఇలాంటి అఘాయిత్యాలు తగ్గే అవకాశం ఉంది.

**బాలల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

తల్లిదండ్రులిద్దరూ పనులకు వెళితే ఒంటరిగా ఇంట్లో ఉండే పిల్లల రక్షణకు ఏర్పాట్లు చేయాలి

గుడ్, బ్యాడ్ టచ్ గురించి చిన్న వయసులోనే అవగాహన కలిగించాలి.

స్వీయ రక్షణ చర్యలు నేర్పించాలి.

ఒంటరిగా ఎక్కడికి వెళ్లకూడదని, వెళ్లాల్సి వచ్చినప్పుడు ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించాలి.

చిన్న వయసులో ప్రేమలతో కలిగే నష్టం తెలియజేయాలి.

కౌమార వయసులో బాలికలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారిలో కలిగే శారీరక, మానసిక మార్పులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలి. పిల్లలు సామాజిక మాధ్యమాలు ఎలా వినియోగిస్తున్నారో పరిశీలిస్తూ, అపరిచితులతో పరిచయాలు పెంచుకున్నట్లు గమనిస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అపరిచితులతో స్నేహాలతో కలిగే నష్టాలపై అవగాహన కలిగించాలి.

2012లో పోక్సో చట్టం ప్రవేశ పెట్టారు

ఈ చట్టం కింద నేరం రుజువైతే జీవిత ఖైదు విధించే అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలో ప్రత్యేక కోర్టులోనే విచారణ చేస్తారు. దీనికి ప్రత్యేక జడ్జి ఉంటారు. 18 సంవత్సరాల లోపు ఉన్న బాలబాలికలపై జరిగే దాడులు పోక్సో చట్టం కిందకు వస్తాయి. పోక్సో కేసుల్లో 18 సంవత్సరాలలోపు బాలురు నిందితులైనా వారికి ఎలాంటి మినహాయింపులు ఉండవు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ చేపడతారు. విచారణకు వచ్చే బాధితులు ఎవరికీ కనిపించకుండా చర్యలు చేపడతారు.

# టెండర్లలో వైఫల్యం



జగిత్యాల : జగిత్యాల పట్టణంలో ప్రధాన కూడళ్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పట్టణం జిల్లాకేంద్రంగా రూపాంతరం చెందడం.. జనాభాతోపాటు వాహనాలు పెరిగి రద్దీ తీవ్రం కావడంతో కూడళ్ల వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ కింద రూ.22 లక్షలు వెచ్చించి కూడళ్ల ఆధునికీకరణకు సమాయత్తమైంది. పట్టణంలో 11 కూడళ్లను ఎంపిక చేశారు. ఈ ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ చేపట్టి సిగ్నలింగ్ వ్యవస్థ రూపొందించాలని భావించారు. కానీ నిధులు లేవనే కారణంతో ఏడు సార్లు టెండరు నిర్వహించినా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కూడళ్ల విస్తరణ అంశం పూర్తిగా అటకెక్కింది.

**ట్రాఫిక్‌కు అంతరాయం..**పట్టణంలో 11 ప్రధాన కూడళ్లున్నాయి. కొత్తబస్టాండు, వాణీనగర్, బీట్‌బజార్, తహసీల్‌చౌరస్తా, గీతావిద్యాలయం చౌరస్తా, అన్నపూర్ణ, బస్సుడిపో, ఐఎంఏ, మంచినీళ్లబావి, గొల్లపల్లిరోడ్డు తదితర కూడళ్లు నిత్యం రద్దీతో ఉంటాయి. ప్రధాన రహదారిలో మూడుచోట్ల ట్రాఫిక్ సిగ్నళ్లు ఉన్నా అవి పనిచేయడంలేదు. ట్రాఫిక్ సిబ్బంది, సిగ్నళ్లు లేకపోవడం, సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వెళ్తున్నారు. కొందరు అపసవ్య దిశ(రాంగ్‌రూట్)లోనూ రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నెల కిందట గీతావిద్యాలయం వెళ్లే కూడలిలో ముగ్గురు మైనర్లు వాహనం నడిపి ఓ వ్యక్తి మరణానికి కారణమయ్యారు. ఇదే ప్రాంతంలో ఒకే నెలలో మూడు ప్రమాదాలు జరిగాయి. ద్విచక్ర వాహనదారుడు వ్యాను కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వాణీనగర్ చౌరస్తాలో వారం కిందట ద్విచక్రవాహనదారుడు బస్సుకింద పడి మృతిచెందాడు. **పెరిగిన వాహనాల రద్దీ** ప్రస్తుతం జిల్లాకేంద్రం కావడంతో పట్టణంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ప్రధానంగా తహసీల్‌చౌరస్తా, పాతబస్టాండు, గీతావిద్యాల యం, బస్సుడిపో, ఐఎంఏ జయశంకర్, గొల్లపల్లిరోడ్డులో కూడళ్లు ఇరుకుగా మారాయి.

బస్సుడిపో వద్ద

వైద్య కళాశాల, మాతాశిశు సంరక్షణ కేంద్రం, డిపో, టీహబ్, పోలీసు ఠాణా, కలెక్టరేట్ సముదా యం అన్నీ ఒకేచోట ఉండటంతో నిత్యం వేలల్లో వాహనాలు వస్తుం టాయి. ఇక్కడ ఎలాంటి సూచికలు, రహదారి నిబంధనలు లేకపోవ డంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాతబస్టాండులో సాధారణ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, ప్రయాణ ప్రాంగణం, విద్యా సంస్థలు, ఆసుపత్రులు ఉండటంతో ఇక్కడ కాలు కదపలేని పరిస్థితి నెలకొంది. ఈ కూడళ్లను వెంటనే ఆధునికీకరించాలని స్థానికులు కోరుతున్నారు.

# గుణాత్మక బోధన.. గుణాత్మక శిక్షణ

పాల్వంచ: తెలంగాణలో కొన్ని గురుకులాలు కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నాయి. మారుమూల గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్యులుగా, ఇంజినీర్లుగా స్థిరపడే సువర్ణావకాశం కల్పిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'(సీఓఈ) గురుకులాలు అందుబాటులో ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లి 'జేఈఈ', 'నీట్' లాంటి జాతీయ పోటీ పరీక్షల శిక్షణకు రూ.లక్షలు వెచ్చించలేని పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ గురుకులాలు కొన్నింటిలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'(సీఓఈ)లు కొనసాగుతున్నాయి. వీటిలో సాధారణ ఇంటర్మీడియట్ బోధనతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సంబంధించిన శిక్షణ లభిస్తుంది. ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు జేఈఈ, నీట్ వంటి పరీక్షల్లో సత్తా చాటుతున్నారు. తాజాగా బీసీ గురుకులాలను 'సీఓఈ'లుగా మార్చేందుకు అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల్లో ఒక్కో గురుకులాన్ని 'సీఓఈ'గా మార్చనున్నారు.

**ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి..**

సాధారణంగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందితే విద్యార్థులు ఇంటర్ బోర్డు పరీక్షలకు సిద్ధమవుతుంటారు. 'సీఓఈ'లో చేరిన రోజు నుంచే నీట్, జేఈఈ వంటి పరీక్షల శిక్షణ మొదలవుతుంది. ఎంపీసీ, బైపీసీ కోర్సుల విద్యార్థులకే తర్ఫీదు ఉంటుంది. రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక బోధన కొనసాగుతుంది. ఇంటర్మీడియట్ అధ్యాపకులతో పాటు సబ్జెక్టు అసోసియేట్స్ నిపుణులు బోధిస్తారు. సాధారణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక్కో పీరియడ్‌కు 45 నిమిషాలు ఉంటే.. ఇక్కడ రెండు గంటల పాటు సమయం కేటాయిస్తారు. ఓ గంట పాటు బోధించి మరో గంట చదివిస్తారు. 'నీట్' కోసం బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులు, జేఈఈ




అడ్వాన్స్‌డ్, మెయిన్స్ కోసం మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధిస్తారు. వారానికోసారి స్లిప్ టెస్టులు, నెలవారీగా గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రతిభను అధ్యాపకులు సమీక్షిస్తారు. ప్రత్యేక మెనూ అమలుచేస్తారు. వసతి సైతం అదేస్థాయిలో ఉంటుంది.

2025-26 విద్యాసంవత్సరం ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ప్రవేశ పరీక్ష కాకుండా విద్యార్థులు పదోతరగతిలో చూపించిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తాం. ప్రధానంగా సీఓఈలో ఇంటర్ విద్యతో పాటు జేఈఈ, నీట్ లాంటి జాతీయ పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తుంటాం. ఇంటర్మీడియట్ పరీక్షల్లోనూ రాష్ట్రస్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. సీఓఈలో కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. అన్వేష్, ప్రిన్సిపల్, లక్ష్మీదేవిపల్లి సీఓఈ

ఉభయ జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ సీఓఈలు

ఖమ్మం ఎస్సీ అంబేడ్కర్ సీఓఈ

ఖమ్మం (దానవాయిగూడెం) ఎస్సీ సీఓఈ

పాల్వంచ (లక్ష్మీదేవిపల్లి) ఎస్సీ సీఓఈ

పాల్వంచ (కిన్నెరసాని) ఎస్టీ సీఓఈ

భద్రాచలం ఎస్టీ సీఈఓ

దమ్మపేట ఎస్టీ సీఓఈ

ఏకలవ్య ఆదర్శ మోడల్ స్కూల్ (పాల్వంచ) సీఈఓ

# పల్లెల్లో ఆర్థిక సౌరభాలు

నల్గొండ : రైతులు, మహిళా సంఘాలు, ఇతరులు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అర్హులకు ప్రయోజనం అందించేందుకు పీఎం కేయిఎస్‌యుఎం-ఏ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజరు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రెడ్కో సంస్థ అర్హత కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిలకడగా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందే ప్రాజెక్టు ఇది. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హులెవరంటే..రైతులు(వ్యక్తిగతంగా), రైతు ఉత్పత్తి సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మండల గ్రామ సమాఖ్యలు, పంచాయతీ స్థానిక సంస్థలు భూమిని లీజుకు తీసుకొని కూడా సౌర ప్లాంట్ యూనిట్‌ను నిర్ణీత సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవచ్చు.

ముఖ్యాంశాలిలా..

మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం

ఒక్కో యూనిట్ సామర్థ్యం: 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల



వరకు. ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తికి మూడున్నర నుంచి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.

ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీ-ఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: %www.tgredco.telangana.gov.in% ను సంప్రదించాలి.

పూర్తి సమాచారం, సందేహాలు నివృత్తికి..రెడ్కో జిల్లా కార్యాలయం నల్గొండలో సంప్రదించాలి. టెలిఫోన్ నంబర్: 08682 224447, చరవాణి నెంబరు: 98318 78596, 63049 03923 సంప్రదించవచ్చు.

**భూములు పరిశీలిస్తున్నాం**

పాండురంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ

ఉపయోగంలో లేని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై మహిళా సంఘాలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసి సమాచారం పొందవచ్చు. కలెక్టర్ ఆదేశంతో నల్గొండ జిల్లాలో సౌర విద్యుదుత్పత్తికి కావాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పరిశీలించాల్సి ఉంది.

# నాణ్యతా ప్రమాణాలు పట్టేదెవరికి?

పెద్దపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్దేశించిన ఈ-నామ్ వ్యవస్థ వ్యాపారులకు వరంగా మారింది. పెద్దపల్లి మార్కెట్‌లో రైతులు తెచ్చిన పత్తికి నాణ్యతతో సంబంధం లేకుండా ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ విషయంలో భారత పత్తి సంస్థ(సీసీఐ) చెల్లించే మద్దతు ధరను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభంలో 8 శాతం తేమ కలిగిన పత్తి క్వింటాలుకు రూ.7,520 ఉండగా ఇటీవల నాణ్యత తగ్గిందనే ఉద్దేశంతో సీసీఐ మద్దతు రూ.7,430కు కుదించింది. పత్తిలోని వివిధ ప్రమాణాల స్థాయిని బట్టి మద్దతు ధర అటు ఇటుగా మారుతోంది. **పట్టించుకోని అధికారులు**సీసీఐ పత్తిలో 8-12 వరకు తేమ శాతాన్ని అనుమతిస్తుంది. నిబంధనల ప్రకారం ఒక శాతం తేమ పెరిగితే ధర కూడా ఒక శాతం తగ్గుతుంది. 12 శాతం ఉంటే రూ.7,132కు కొనుగోలు చేస్తుంది. ఈ నిబంధనను వ్యాపారులకు వర్తింపజేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చిన పత్తిలో తేమ 18 శాతం ఉండగా ధర రూ.5003గా నిర్ణయించారు. ఈ మేరకు సంచిపై మార్కర్‌తో రాశారు. నిబంధనల ప్రకారం రూ.6,687 వరకు చెల్లించాలి. మార్కెట్‌లో నమోదైన గరిష్ఠ ధరను ప్రామాణికంగా తీసుకున్నా రూ.6,319 చెల్లించాలి. శుక్రవారం మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7,022 వరకు నమోదైంది. అయితే ఇవేవీ వ్యాపారులకు ప్రామాణికంగా కనిపించడం లేదు.

**వ్యాపారికి నచ్చిందే ధర**

పెద్దపల్లి మార్కెట్‌లో 11 మంది క్రియాశీలక అడ్తీదారులుండగా వీరి వద్ద 7 నుంచి 8 మంది కొనుగోలుదారులు ఖరీదు చేస్తున్నారు.

వారం రోజులుగా ఇద్దరు, ముగ్గురు కొనుగోలుదారులే తీసుకుంటున్నారు. మిల్లర్లు మార్కెట్‌వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక ఆన్‌లైన్‌లో ఇతర మార్కెట్‌కు చెందిన ట్రేడర్లు కొనుగోలు చేసే స్థాయిలో వ్యవస్థం అభివృద్ధి చెందలేదు. నాణ్యతను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవు. సిబ్బందిని కూడా నియమించలేదు.

# బుక్కుతున్న డిపాజిత్తులు

నంద్యాల : పాములపాడు మండలం కనకయ్య కొట్టాలలో కేసీ కాల్వ 13వ డిస్ట్రిబ్యూటరీలో పనులు చేసినట్లు ఎం.బుక్కులు చేశారు. రూ.1.40 కోట్లతో చేసిన ఈ పనులకు సంబంధించి రూ.70 వేల డిపాజిట్ మొత్తం తిరిగి చెల్లించేందుకు రూ.5 వేల వరకు వసూలు చేశారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరు నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలం వరకు జరిగిన పనులకు ఒక్కో బిల్లుకు రూ.1500 వరకు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది. కేసీ కాల్వ పరిధిలో 2018లో చేసిన నీరు- చెట్టు పనుల డిపాజిట్ మొత్తాలకు సంబంధించి కొన్ని రోజులుగా ఎం.బుక్కులు చేస్తున్నారు. ఆయా పనులకు తుది(ఫైనల్) బిల్లు చేయాలంటే కచ్చితంగా నిర్ణీత మొత్తం లంచం ఇవ్వాల్సిందేనని కొంతమంది అధికారులు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే బిల్లులు చేయడం లేదని గుత్తేదారులు గగ్గోలుపెడుతున్నారు.

కార్యాలయంలో కాసుక్కూర్చున్నారు

ఉమ్మడి జిల్లా పరిధిలో కేసీ కాల్వ పొడవునా 2 వేల వరకు పనులు జరిగాయి. ఆయా పనులకు సంబంధించి గుత్తేదారులకు డిపాజిట్ మొత్తం రూ.3 కోట్ల వరకు చెల్లించాల్సిన ఉంది. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 ఎం.బుక్కులకు సంబంధించి రూ.10 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. 500 మంది గుత్తేదారులకు ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి రూ.27 వేలు చొప్పున డిపాజిట్ మొత్తాలు తిరిగి ఇవ్వాల్సి ఉంది. రూ.27 వేలు రావాల్సిన గుత్తేదారుల నుంచి రూ.1500, రూ.70 వేలు రావాల్సిన వారి నుంచి రూ.2,500 వరకు కేసీ సిబ్బంది వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవ్వకుంటే పక్కన పెట్టేస్తారుఅడిగినంత ఇవ్వకుంటే ఎం.బుక్కులు కార్యాలయాల్లోనే ఉండిపోతున్నాయి. ఈ మొత్తాలు త్వరగా ఇస్తే పే అండ్ అకౌంట్స్ కార్యాలయానికి వెళ్తాయి. లేదంటే కేసీ కార్యాలయా ల్లోనే పేరుకుపోతున్నాయి. నందికొట్కూరు, బండిఆత్మకూరు, గడివేముల, శిరివెళ్ల మండలాలకు చెందిన కొన్ని పనులకు అడిగినంత ఇవ్వకపోవడంతో రోజులకొద్దీ ఎం.బుక్కులు కార్యాలయంలోనే ఉండిపోయాయి. చివరికి గుత్తేదారులు దిగొచ్చాకే బిల్లులయ్యాయి. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ గుత్తేదారు అధికారులను ప్రసన్నం చేసుకోవడంతో పెద్ద మొత్తంలో బిల్లులు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రూ.350 కోట్ల పనులకు చెల్లింపులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కేసీ కాల్వ పరిధిలో 2018లో నీరు- చెట్టు పనులు జరిగాయి. వీటిని సుంకేసుల ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం రాజోలి వరకు సుమారు 180 కి.మీల పొడవున చేపట్టారు. రూ.350 కోట్లు వెచ్చించి చెరువుల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, ఆయకట్టు పరిధిలోని పొలాల్లో మట్టి రహదారులు వంటి పనులు చేశారు.

# నారీ.. నేరవలయంలో సవారీ

హైదరాబాద్ : ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ పరిస్థితులు.. కారణాలేవైనా మహిళల బలహీనతలను మాయగాళ్లు అనువుగా మలచుకుంటున్నారు. ఏవోబీ నుంచి గంజాయి రవాణాకు ఎస్కార్ట్‌గా వాడుకుంటున్నారు. నైజీరియన్ల మత్తు సామ్రాజ్యంలో కీలుబొమ్మలుగా మారి నలిగిపోతున్నారు. సైబర్ మోసాలకు ఏజెంట్లుగా, టెలీ కాలర్లుగా సహకరించి కేసుల్లో చిక్కుకుంటున్నారు. ఇటీవల వేర్వేరు నేరాల్లో పది మంది మహిళలు అరెస్ట్ కావటం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

**మత్తు ముఠాలకు చిక్కి..**

నైజీరియా నుంచి ఉపాధి కోసం దిల్లీ చేరిన మహిళ.. డ్రగ్స్ ముఠాల పరిచయంతో కొరియర్‌గా మారారు. స్మగ్లర్ల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా సరకును చేరవేయడం ఆమె పని. ఎదురు తిరిగితే వేధింపులు.. చంపుతామని బెదిరింపులు. టీజీ న్యాబ్ అంతర్జాతీయ డ్రగ్ హవాలా రాకెట్ ఛేదించే క్రమంలో వెలుగు చూసిన కేసుల్లో ఇదొకటి. నైజీరియన్ మత్తు ముఠాలు సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలంటూ యువతులే లక్ష్యంగా వల విసురుతున్నారు. తాము ఇచ్చిన పార్సిల్‌ను నిర్దేశించిన గమ్యానికి



చేర్చితే కమీషన్ ఇస్తామంటారు. వాటిలో కాస్మోటిక్స్ ఉత్పత్తులున్నాయంటూ నమ్మిస్తారు. వాస్తవం తెలిసి బయటపడేందుకు ప్రయత్నిస్తే, అంతుచూస్తామని హెచ్చరిస్తారు. దిల్లీ చేరిన పార్సిల్‌ను ముంబయి, గోవా, హైదరాబాద్, బెంగళూరు చేరవేసేందుకు ప్రతినెల ఒక్కో యువతిని ఎంపిక చేస్తారు. నైజీరియా డ్రగ్‌డాన్ ఎబుకా ఏజెంట్లుగా సుమారు 50–60 మంది యువతులు ఉన్నట్లు టీజీన్యాబ్ అధికారులు గుర్తించారు.

**సైబర్ ఉచ్చులో ఇలా..**

దుబాయ్ కేంద్రంగా సైబర్ మోసగాళ్లు.. అమెరికన్ పౌరులను బ్యాంకు సేవల పేరిట బురిడీ కొట్టించి సొమ్ము కాజేస్తున్నారు. ఇందుకోసం మాదాపూర్ పత్రికా నగర్‌లో ఓ కాల్‌సెంటర్ ఏర్పాటుచేశారు. కాల్‌సెంటర్ ఏర్పాటు చేసిన నష్టపోయిన మహిళను ఎంచుకొని, పెద్ద ఎత్తున కమీషన్ ఆశ చూపి ఆమెతో దందా మొదలు పెట్టించారు. ఇటీవల విషయం బయటపడటంతో ఆమె అరెస్టయి జైలు పాలైంది. పార్ట్ టైమ్ ఉద్యోగం, టాస్కులు, బహుమతుల పేరిట సైబర్ మాయగాళ్ల బారినపడి మోసపోయిన యువతులకు.. తిరిగి డబ్బు ఇస్తామంటూ మభ్యపెడుతున్నారు. తమకు అవసరమైన బ్యాంకు ఖాతాలు సమకూర్చితే అదనంగా కమీషన్ ఇస్తామంటూ ఏజెంట్లుగా మలచుకుంటున్నారు. డిజిటల్ అరెస్టులు, బ్యాంకు ఓటీపీ, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలకు పాల్పడేందుకు వారినే టెలీ కాలర్స్‌గా మార్చుకొని దందా సాగిస్తున్నారు.

# నిబంధనలు అతిక్రమణం.. సాగు మాటున తవ్వకం..

తాండూరు : వ్యవసాయం చేసుకొని జీవనం సాగించేందుకు పేద రైతులకు సర్కారు సీలింగ్ భూములు కేటాయించింది. వాటిలో భారీ యంత్రాలతో కొందరు నిక్షేపంగా తవ్వకాలను కానిచ్చేస్తున్నారు. సాగు భూముల్లో పచ్చని పంటలు దర్శనమీయాల్సి ఉండగా పెద్దపెద్ద గుంతలు కన్పిస్తున్నాయి. వెరసి సర్కారు లక్ష్యం నీరుగారుతోంది. రైతుకు నష్టం కలుగుతోంది. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

**పట్టాలు కూడా జారీ చేశారు**

తాండూరు మండలం మల్కాపూర్‌లోని సర్వే సంఖ్య 72లో 18.22 ఎకరాల సీలింగ్ భూములు ఉన్నాయి. వీటిని మూడు దశాబ్దాల క్రితమే ప్రభుత్వం స్థానికులకు వ్యవసాయం చేసుకునేందుకు అప్పగించింది. వారి పేరిట పట్టాలను కూడా జారీ చేసింది. వీటిలో కొందరు రైతులు వ్యవసాయ చేస్తుండగా మరికొందరు ఇతరులకు కట్టబెట్టి నాపరాయి గనులు నిర్వహిస్తున్నారు. పంటలు పండించి రైతు జీవనం సాగించడంతోపాటు కూలీలకు ఉపాధి కల్పించే వీలుంటుందని సర్కారు భావించింది. అయితే అక్కడి నేలల్లో విలువైన నాపరాయి నిక్షేపాలు ఉండటంతో పెద్దల కన్ను పడింది. రైతులను మచ్చిక చేసుకొని వారి పేరిట లీజులు సాధించారు. అనంతరం వ్యవసాయ భూముల్లో నిక్షేపాల తవ్వకాలకు తెరలేపారు. అప్పటి వరకు పంటల పచ్చదనంతో కళకళలాడిన భూములు తవ్వకాలతో భారీ గుంతలతో ఆనవాళ్లు కోల్పోయాయి.

**ఎకరం విలువ రూ.80లక్షలు**



నాపరాయి నిక్షేపాలుండటంతో ఎకరం భూమిని నాలుగు ప్లాట్లుగా విభజించి తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఒక్కో ప్లాటుకు రూ.20లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకుంటున్నారు. దీంతో ఎకరాకు రూ.80లక్షలు ఖరారు చేశారు. అందుకు రైతులను ఒప్పిస్తున్న బడా వ్యాపారులు దర్జాగా తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఇక్కడి నాపరాయి కంటైనర్‌ల ద్వారా ఏకంగా విదేశాలకు సైతం ఎగుమతులు చేయడం గమనార్హం.

**అధికారుల విచారణ**

గ్రామానికి చెందిన ఓ యువకుడు గతనెలలో సీలింగ్ భూముల్లో తవ్వకాలపై వికారాబాద్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. దీంతో గనులు భూగర్భ శాఖ ఏడీ సత్యనారాయణ అధ్వర్యంలో గనులు, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా విచారణ చేశారు. అధికారుల బృందం క్షేత్రస్థాయిలో వెళ్లి సీలింగ్ భూములను పరిశీలించింది. సాగుకు బదులు తవ్వకాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఎంత లోతున, ఎంత విస్తీర్ణంలో నాపరాయి తవ్వకాలు జరిపారో కొలతలు చేసి వివరాలు నమోదు చేశారు. నివేదికను జిల్లా పాలనాధికారికి సమర్పించేందుకు సిద్ధం చేసినట్లు ఏడీ వెల్లడించారు. లీజు భూముల్లో తవ్వకాలకు ఆమోదం తెలపడంపై అభ్యంతరం వ్యక్తం చేశామని ఫిర్యాదుదారు తుకారం, గ్రామస్థులు తెలిపారు.

# ఫొటో కొట్టు.. జరిమానా వేసేట్టు



హైదరాబాద్ : అమూల్యమైన జీవజలం వృథాకు అడ్డుకట్ట వేసేందుకు జలమండలి ప్రత్యేక కార్యాచరణకు ముందడుగు వేసింది. శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. జలమండలి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి అందుబాటులో ఉండేలా మొబైల్ యాప్‌ను రూపొందిస్తోంది. నీటి వృథాను గుర్తించి.. ఫొటో, వినియోగదారు సమాచారం, నీటి క్యాన్ నంబర్ తదితర అంశాలను నమోదు చేస్తే యాప్‌లోనే జరిమానా నోటీసు సిద్ధమవుతుంది. వినియోగదారు నమోదు చేసుకున్న ఫోన్ నంబర్, మెయిల్‌కు నోటీసు వెళ్లేలా యాప్ ఉండనుంది.

**అత్యధికం ఉచితం..**

నగరంలో జలమండలి పరిధిలో 13.5లక్షల నీటి కనెక్షన్లలో సుమారు 8.5లక్షల కనెక్షన్లకు ఉచితంగా తాగునీరు ఇస్తోంది. ప్రతి కుటుంబానికి నెలకు 20వేల లీటర్ల వరకు నీటిని సరఫరా చేస్తోంది. నాణ్యతా ప్రమాణాలతో అందించేందుకు సగటున ప్రతి 1000 లీటర్లకు రూ.48 వ్యయం జరుగుతోంది. ఇంత ఖర్చు చేసి ఇస్తున్న తాగునీటిని కొంతమంది వాహనాలు, ఇంటి పరిసరాలను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్‌లకు వినియోగిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. మరో రెండేళ్లపాటు నగరంలో అదనపు నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ప్రస్తుతం సరఫరా అవుతున్న నీటినే గోదావరి 2, 3 దశలు పూర్తయ్యే వరకు ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. నీటిని పొదుపుగా వాడుకోవడం, వృథాను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

**మూడున్నర దశాబ్దాలుగా..**

జలమండలి నీటి వృథా సహా వివిధ అంశాలకు సంబంధించి చట్టంలోని జరిమానాలు 35ఏళ్ల క్రితం నాటివి.. అవి కూడా నామమాత్రంగా అమలులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జరిమానాలు పెంచుతూ జలమండలి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. నీటి వృథాకు ప్రస్తుతం మొదటి సారి అయితే రూ.1000 జరిమానా విధిస్తుండగా ఈ మొత్తాన్ని రూ.5000కు పెంచేలా ప్రతిపాదించారు. రిజర్వాయర్ల వద్ద ఫ్లో మీటర్లను ఏర్పాటు చేయనుంది. నీటి లెక్కలు తేలితేనే వృథాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుందని జలమండలి భావిస్తోంది.

# అన్నదాతకు ఆదాయం.. వినియోగదారుకు సౌలభ్యం




వికారాబాద్ : రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో పండ్లు, కూరగాయలు, పూల మార్కెట్లను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా రైతుకు ఆదాయం పెంచడంతో పాటు వినియోగదారులకు అన్ని రకాల పంట ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వీలు కలుగుతుందని ప్రభుత్వం ఈ ప్రణాళికను సిద్ధం చేసింది. దీంతో జిల్లాలోనూ అవకాశాలు ఉండటంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఇదే సమయంలో యార్డుల్లో సౌకర్యాలు కల్పించడంతోపాటు, సమీకృత మార్కెట్లు పూర్తిచేయాల్సి ఉంది. దీనికి సంబంధించి కథనం.

**తీర్చిదిద్దితేనే ప్రయోజనం**

జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, మర్పల్లి, ధారూర్, కొడంగల్, బషీరాబాద్, కోట్‌పల్లి, కుల్కచర్ల, బషీరాబాద్, నవాబ్‌పేట మార్కెట్ యార్డులున్నాయి. వీటిలో ఉద్యాన పంటల ఉత్పత్తుల విక్రయాలకు అనుకూలంగా మార్కెట్లను తీర్చిదిద్దితే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వికారాబాద్, తాండూరు, మర్పల్లి తదితర చోట్ల యార్డుల్లో అవసరమైన స్థలాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో రైతులు ఉద్యాన పంటల ఉత్పత్తులు విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధరతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది.

సదుపాయాలు లేవు: బషీరాబాద్, నవాబ్‌పేట మార్కెట్‌లున్నా యార్డులు లేవు. ఇక్కడ కేవలం మార్కెట్ ఆఫీసులు మాత్రమే ఉన్నాయి. వీటిలో కూరగాయలు, పూలు పండ్లు విక్రయించడానికి అవసరమైన స్థలం లేదు. పరిగి, వికారాబాద్, తాండూరుల్లో సమీకృత మార్కెట్ యార్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇవి పూర్తి అయితే కూరగాయలే కాకుండా పండ్లు, పూలు, మాంసం తదితర వాటిని విక్రయించటానికి వీలు కలుగుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాల్సి ఉంది.

**పూడూరులో ఏర్పాటుకు ప్రతిపాదనలు**

– సారంగపాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి.

జిల్లాలో పూడూరు మండలంలో 20 ఎకరాల్లో పూలు, పండ్లు విక్రయం కోసం ప్రత్యేకంగా పూల మార్కెటును ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. వికారాబాద్, పరిగి, పూడూరు, మోమిన్‌పేట, నవాబ్‌పేట తదితర మండలాల రైతులు పండించిన పూలు, పండ్లు, కూరగాయలను హైదరాబాద్‌లోని గుడిమాల్కపూర్ మార్కెట్‌కు తీసుకెళతారు. వీరు రవాణాలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అన్నీ అనుకూలిస్తే పండ్ల మార్కెట్ ఏర్పాటవుతుంది. రైతులకు లాభం కలుగుతుంది.

# పోటీ పెంచండి.. కోటి గెలవండి



పెద్దపల్లి : సౌర విద్యుత్తు వినియోగంలో ఆదర్శంగా నిలిచిన గ్రామాలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇంటింటికీ సౌర విద్యుత్తును అందుబాటులోకి తేవడానికి పంచాయతీల మధ్య పోటీతత్వం పెంచింది. సౌరశక్తిలో ఆదర్శంగా నిలిచిన జిల్లాకు ఒక గ్రామానికి రూ.కోటి నజరానా ప్రకటించింది. దీనికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ(డీఎల్‌సీ) సభ్యులు అయిదు వేల జనాభా ఉన్న గ్రామాలను ఎంపిక చేస్తున్నారు. వచ్చే ఆరు నెలల్లో ఆయా గ్రామాల్లో ఇంటింటికీ సౌర విద్యుత్తు ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని ఉత్తమంగా నిలిచిన వాటికి నగదు పురస్కారం అందనుంది.

**అయిదు వేల జనాభానే అర్హత**

పర్యావరణ కాలుష్యం తగ్గించడానికి, అందుబాటులోని వనరులను సద్వినియోగం చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల కింద సౌరశక్తి యూనిట్ల ఏర్పాటుకు రాయితీ ఇస్తోంది. ఇప్పటికే గృహావసరాలకు విద్యుత్తు వినియోగం పెరగడంతో చాలా మంది ఇంటి పైకప్పులపై సౌర ఫలకలు ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలో సౌర విద్యుదుత్పత్తిని విస్తరించేందుకు గ్రామాల మధ్య పోటీ పెంచింది. కలెక్టర్ ఛైర్మన్‌గా, రెడ్కో అధికారి కన్వీనర్‌గా, అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జడ్పీ సీఈవో, లీడ్ బ్యాంక్ మేనేజర్, జిల్లా పంచాయతీ అధికారి, పీఆర్ ఈఈ, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ.. సభ్యులుగా ఉన్న కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో అయిదు వేల జనాభా కలిగిన గ్రామాలను ఎంపిక చేస్తారు.

**ఆరు నెలల్లో అత్యధిక ఉత్పత్తికి ప్రాధాన్యం**

కేంద్ర ప్రభుత్వం అందజేసే నజరానా కోసం గ్రామాలు పోటీ పడనున్నాయి. ఉమ్మడి జిల్లాలో పెద్దపల్లిలో 21 గ్రామాలను ఎంపిక చేయగా మిగిలిన మూడు జిల్లాల్లో ఎంపిక చేయాల్సి ఉంది. ఆరు నెలల్లో ఇళ్ల పైకప్పులపై అత్యధికంగా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్తు ఉత్పత్తి చేసిన గ్రామాలను జిల్లా స్థాయి కమిటీ 'మోడల్ సోలార్ విలేజ్'గా గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తుంది. ఈ నిధులతో గ్రామంలోని ప్రభుత్వ భవనాల పైకప్పులపై సౌర ఫలకలు ఏర్పాటు చేస్తారు. కాగా కేంద్రం అందించే ప్రోత్సాహకంతో సౌర విద్యుత్తు తప్ప ఇతర అభివృద్ధికి నిధులు కేటాయించరాదు.

**వినియోగంపై చైతన్యం**ఎంపిక చేసిన గ్రామాల్లో సౌర విద్యుత్తుపై అవగాహన కల్పిస్తారు. సౌర విద్యుత్తు ప్యానెళ్ల ఏర్పాటుకు 2 కిలోవాట్స్‌కు రూ.60 వేలు, 3 కిలోవాట్స్‌కు రూ.78 వేల రాయితీ ఉంటుంది. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల్లో రుణం తీకొనేలా ప్రోత్సహిస్తారు. స్వశక్తి సంఘాల సహకారంతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తారు.

కలెక్టర్ పర్యవేక్షణలో గ్రామాల ఎంపిక

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో అయిదు వేల జనాభా ఉన్న గ్రామాలను కలెక్టర్ పర్యవేక్షణలో ఎంపిక చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సంబంధిత అధికారుల సహకారంతో అవగాహన కల్పిస్తాం. గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి. సోలార్ ఫలకల ఏర్పాటు కోసం ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలి. రెడ్కో అనుమతి పొందిన సంస్థల నుంచి మాత్రమే ప్యానెళ్లు తీసుకోవాలి.

అజయ్, రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్

# ఇంటి కొలతలు తప్పాయా.. నోటీసులే!

హైదరాబాద్: నగరంలో ఆస్తిపన్ను కట్టని నిర్మాణాలు, తక్కువ కడుతున్న భవనాలు జీఐఎస్(భౌగోళిక సమాచార వ్యవస్థ) సర్వేలో లెక్క తేలుతున్నాయి. ఇప్పటి వరకు 20 శాతం మేరకు సర్వే పూర్తవగా అందులో 80 వేల నిర్మాణాల కొలతలు, వాటి ఆస్తిపన్నులో తేడాలు ఉన్నట్లు సర్వేయర్లు గుర్తించారు. అందులో పన్ను కట్టని నిర్మాణాలే 20 వేల వరకు ఉన్నాయి. బల్దియా ఐటీ విభాగం ఆయా నిర్మాణాల జాబితాను ఇటీవల కమిషనర్ ఇలంబర్తి ముందుంచగా.. అన్నింటికీ చట్టప్రకారం నోటీసులు ఇవ్వాలని, యజమానుల నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యలు తీసుకోవాలని ఆయన యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు జోనల్ కమిషనర్లు చర్యలు ప్రారంభించారు. జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 213 కింద నోటీసులు జారీకి శ్రీకారం చుట్టారు.

**అయిదు లక్షలకు పైగా భవనాలకు..**

జీఐఎస్ సర్వే ఏడాది కిందట మొదలైంది. డ్రోన్‌తో నగరం మొత్తాన్ని చిత్రీకరించారు. నగర భౌగోళిక పటాన్ని రూపొందించారు. ఇప్పుడు ఇంటింటి సర్వే జరుగుతోంది. పూర్తయిన 20 శాతం ఇంటింటి సర్వేలో 80 వేల భవనాలు లెక్క తేలాయి. నగరం మొత్తాన్ని సర్వే చేస్తే..



అయిదు లక్షలకుపైగా భవనాలకు నోటీసులు ఇచ్చే పరిస్థితి ఉత్పన్నమవుతుందని అంచనా.

నోటీసులిస్తూనే..: సర్వేయర్లు గుర్తిస్తున్న సమాచారంలో కూడా లోపాలు ఉండొచ్చనే ఉద్దేశంతో గుర్తించిన ప్రతి ఇంటి యజమానికి నోటీసు ఇవ్వాలని, ఆ వివరాలను సంబంధిత సహాయ మున్సిపల్ కమిషనర్(ఏఎంసీ) ఆన్‌లైన్‌లోనూ నమోదు చేయాలని కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. నోటీసుకు 15 రోజుల్లోపు యజమాని వివరణ ఇవ్వాలి. యజమాని ఇచ్చే వివరణ ఆధారంగా సంబంధిత బిల్ కలెక్టర్ లేదా ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఉప కమిషనర్‌కు నివేదిక ఇస్తారు. స్పందించకపోతే విచారణ లేకుండానే పన్ను మదింపు జరిగిపోతుంది. నోటీసులపై పౌరులు అభ్యంతరం వ్యక్తం చేస్తే వారి కోసం ఏదైనా ఒక రోజును కేటాయించి, సంబంధిత ఉప కమిషనర్ యజమాని అభ్యంతరాలపై విచారణ జరపాలని సూచించారు. నోటీసు జారీ, దాని వివరాలను యజమాని ఫోన్ నంబరుకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయాలని ఆదేశించారు.

# సన్న బియ్యానికి సై

కరీంనగర్ : సన్న బియ్యంపై ప్రజలు ఆసక్తిని కనబరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం స్థానంలో వీటిని పంపిణీ చేస్తుండటంతో తమకు వచ్చిన కోటాను తీసుకునేందుకు కార్డుదారులు ఉదయం, సాయంత్రం వేళ దుకాణాల వద్ద వరుస కడుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రక్రియలో భాగంగా గడిచిన 8 రోజుల్లోనే 7,26,344 మంది కార్డుదారులు సన్నబియ్యాన్ని అందుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,77,317 మంది కార్డుదారులున్నారు. ఉన్నవారిలో దాదాపుగా 8 రోజుల



వ్యవధిలోనే 74 శాతం బియ్యం లబ్ధిదారుల ఇళ్లకు చేరింది.

**రెండింతలకు పైగా...**

గతానికి భిన్నంగా కార్డుదారులు సన్నబియ్యం తీసుకుంటున్నారు. గతంలో దొడ్డు బియ్యం సరఫరా సమయంలో వీలుని బట్టి కొందరు రెండు మూడు నెలలకు తీసుకునేవారు. కానీ ఈసారి సన్నబియ్యం సరఫరా అవుతుండటం.. తినడానికి వీలుగా నాణ్యతతో ఉన్నాయనే ఉద్దేశంతో ఒకరిని చూసి ఇంకొకరు రేషన్ తీసుకునేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. మార్చి నెల మొత్తంగా 8,62,8065 మంది కార్డుదారులు 16,353 టన్నుల బియ్యాన్ని తీసుకోగా ఈ నెలల ప్రస్తుత పరిస్థితిని చూస్తే దాదాపుగా 90 శాతం మంది ఈ సన్న బియ్యాన్ని తీసుకునే అవకాశం కనిపిస్తోంది. కార్డుదారులు ఏ డీలర్ వద్దనైనా తీసుకునే వెసులుబాటు ఉండటంతో వీలుని బట్టి లబ్ధిదారులు తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,917 రేషన్ దుకాణాలు ఉండగా ఇందులో ఈ నెల 8వ తేదీన 1,422 దుకాణాల్లోనే బియ్యం అందుబాటులో ఉంది. మిగతా వాటికి సరఫరా చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చొరవ తీసుకుంటున్నారు.

# గడువు పెంచినా ఆసక్తి అంతంతే!

పెద్దపల్లి : లే అవుట్ అనుమతులు లేని స్థలాల క్రమబద్ధీకరణకు 2020లో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. 25 శాతం రాయితీపై మొదట మార్చి నెలాఖరు వరకు గడువు విధించగా తర్వాత ఈ నెల 30 వరకు పొడిగించారు. ఏప్రిల్‌లో వారం రోజులు గడిచినా కొత్తగా ఒక్క దరఖాస్తు కూడా పరిష్కారానికి కూడా నోచుకోలేదు. రిజిస్ట్రేషన్లకు ఎల్‌ఆర్‌ఎస్‌తో ముడి పెట్టినప్పటికీ ఆశించిన స్పందన లేదు. జిల్లాలో మొత్తం దరఖాస్తుల్లో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులు 24.42 శాతానికే పరిమితమయ్యాయి.

**ఎందుకీ పరిస్థితి..!**రెండేళ్లుగా స్థిరాస్తి వ్యాపారం ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. నిర్మాణ రంగం కూడా ఆపసోపాలు పడుతోంది. రెండింటికీ కొనుగోలుదారుల నుంచి ఆశించిన స్థాయిలో ఆసక్తి లేదు. ఇక వెంచర్లలో ఇళ్ల స్థలాల అమ్మకాలు కనీస స్థాయికి పడిపోవడంతో వ్యాపారులు, ప్లాట్ల విక్రయదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే క్రమబద్ధీకరణ కోసం ముందుకు రావడం లేదనే ప్రచారం సాగుతోంది. మరోవైపు అయిదేళ్ల కిందట రూ.వెయ్యి చెల్లించి పేర్లు నమోదు చేసుకున్నా, స్థిరాస్తి వెంచర్లలో ఎక్కువ మంది రీసేల్(తిరిగి అమ్మడం) కోసమే ప్లాట్లు కొనుగోలు చేయడంతో స్థలాల క్రమబద్ధీకరణకు ఆసక్తి చూపడం లేదు.

**51 శాతం మందికి ప్రొసీడింగ్స్ జారీ**ఇప్పటికే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారిలో చాలా మందికి ఇప్పటికీ ప్రొసీడింగ్స్ అందలేదు. స్థలాలను మున్సిపల్ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించిన తర్వాతే జారీ చేసే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటివరకు 1,883 మంది ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లిస్తే 962 మంది(51 శాతం)కి ప్రొసీడింగ్స్ జారీ చేశారు. మిగతా వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో పెద్దపల్లి మున్సిపాలిటీ రాష్ట్రంలో 17వ స్థానంలో ఉండగా రామగుండం నగరపాలిక 52వ స్థానంలో ఉంది. మంథని, సుల్తానాబాద్‌లు వరుసగా 27, 114 స్థానాల్లో ఉన్నాయి.

## టిడ్కో లబ్ధిదారులకు తీపి కబురు

పుట్టపర్తి : పట్టణాల్లో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల హామీ అమలు దిశగా కీలకమైన ముందడుగు వేసింది. పేదలందరికీ ఇళ్లు నిర్మించాలనే సంకల్పంతో 2014-19 మధ్య కాలయంలో నాటి తెదేపా ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి ధర్మవరం, కదిరి, హిందూపురం మున్సిపాలిటీల్లో నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో టిడ్కో సౌజన్యంతో ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది. త్వరలో సొంతిల్లు సాకారం అవుతుందని, ఆశతో లబ్ధిదారులు అప్పులు చేసి కంతులు చెల్లించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. ఐదేళ్ల పాలనలో ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. ఎక్కడికక్కడ పనులు నిలిచిపోవడంతో పేదల సొంతింటి కల సాకారం కాలేదు. చెల్లించిన డిపాజిట్‌కు ఆరేడేళ్లుగా వడ్డీలు చెల్లిస్తూ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ హామీ మేరకు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో భవనాలను పూర్తి చేసి, జూన్ నాటికి నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు వచ్చే జూన్ నాటికి జిల్లాలోని 4,176 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అనుకున్న తేదీ నాటికి గృహాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

**త్వరలో పూర్తి చేసేలా చర్యలు చేపడతాం..**

షబానా, టీడ్కో డీఈ జిల్లాలో అర్ధాంతరంగా ఆగిపోయిన టిడ్కో సామూహిక భవనాలు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో 4,176 మందికి జూన్ నాటికి సొంతింటి తాళాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ దిశగా చర్యలు చేపట్టింది.

## సహజ పద్ధతుల్లో సాగే ఉత్తమం

హిందూపురం : దీర్ఘకాలిక రోగాలు దూరం కావాలంటే సహజ పద్ధతుల్లో పండించే పంటలే శరణ్యమని విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి రైతు నీటిని పొదుపుగా వాడుకోవడంలో ప్రకృతి వ్యవసాయ పరిశోధకుడు సుభాష్ పాలేకర్ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేసినపుడు నిబంధనలకు విరుద్ధంగా బోర్ల తవ్వకాన్ని అడ్డుకున్నట్లు గుర్తుచేశారు. శనివారం పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉద్యానవనం, వ్యవసాయ శాఖ, ఆర్డీటీ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మన వ్యవసాయం, పంటలు, వంటకాలు, ఆరోగ్యంపై సదస్సు, చిరుధాన్యాల మేళాను ప్రారంభించారు. ఇజ్రాయెల్ లాంటి దేశాల్లో తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధిస్తున్న విషయాన్ని



జనార్దన్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రకృతి వ్యవసాయ స్వతంత్ర ప్రచారకర్త విజయరావ్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో ప్రతి రైతు ఎకరాకు రూ.3 నుంచి 6 లక్షల వరకు లాభాలు పొందవచ్చన్నారు. పురుగు మందులు, రసాయన ఎరువులు లేకుండా చెన్నంగి, కొలతేర్ రకాల వరి వంగడాలను పండించాలన్నారు. ఎ.ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి అనుకూల వంటలు తినాలంటే పంటల సాగులో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. సహాయ కలెక్టర్ వినూత్న, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఎన్ఐఆర్డీ డైరెక్టర్ డబ్ల్యూఆర్ రెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి గోపాల్‌రెడ్డి, ఏపీఎంఏఎస్ సీఈఓ సీఎస్ రెడ్డి, 18 ఎన్‌జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు ఆకట్టుకున్న స్టాళ్లు: చిరుధాన్యాల మేళాలో భాగంగా వివిధ రకాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కట్టె గానుగ నూనెలు, చిరుధాన్యాలతో తయారు చేసిన తినుబండారాలు, వివిధ ప్రాంతాల్లో ప్రాముఖ్యం ఉన్న విత్తనాల ప్రదర్శన, కూరగాయలు, పండ్లు, తదితర రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

## ఎండిన ఆకులు.. చెదిరిన రూపురేఖలు..!

ఆరిలోవ : ఘన చరిత్ర గల ముడసర్లోవ ఉద్యానవనంలో ఇటీవల అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం స్థానికులను కలవరపరిచింది. అటు పచ్చని సింహగిరులు..ఇటు గలగలపారే సెలయేరు.. ప్రకృతి రమణీయత ఉట్టిపడే ప్రాంతంలో ఈ ఉద్యానవనాన్ని 1902లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. నాటి నుంచి దశాబ్దాలపాటు విశాఖ నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచింది. 1980 దశకంలో పదుల సంఖ్యలో సినిమాలను ఇక్కడ చిత్రీకరించారు. అలాంటి ఉద్యానవనాన్ని గత ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది.వైకాపా ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ పాలకులు ప్రపంచ స్థాయి ఉద్యానవనంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వాస్తవంలో ఒక్క పైసా ఖర్చు చేయలేదు. కొత్తగా ఒక్క మొక్క కూడా నాటించలేదు. ఉన్న మొక్కలకు నీరు పోసి సంరక్షించలేదు. గడ్డి ఎండిపోతున్నా, పిల్లల ఆట పరికరాలు విరిగిపోయినా పట్టించుకోలేదు. రాలిన ఆకులను ఏరోజుకారోజు డంపింగ్‌యార్డుకు తరలించే ఏర్పాట్లు చేయలేదు. ఫలితంగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అక్రమాలకు అడ్డాగా మారి: ఉద్యానవనం నిర్వహణను వాస్తవంగా జీవీఎంసీ ఉద్యాన విభాగం చూడాలి. కాని నాటి పాలకులు నీటిసరఫరా విభాగానికి అప్పగించారు. సందర్శకుల నుంచి రుసుములు వసూలు చేయడానికి టెండరు పిలిచి గుత్తేదారుకి అప్పగించారు. ఎన్నడూలేని విధంగా నాడు ఉద్యానవనంలో టెంట్లు వేసి పార్టీలు నిర్వహించే సంస్కృతిని తెచ్చారు. కార్తికమాసంలో గుత్తేదారు ఒక్కో టెంటుకు సుమారు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అనధికారికంగా వసూలు చేశాడు. టెంట్లు, కుర్చీలు, టేబుళ్లను కూడా ఆయనే సరఫరా చేశాడు. వసూలు చేసిన మొత్తంలో భారీగానే నాటి వైకాపా పాలకులు, అధికారులకు అందేవని ఆరోపణలు వచ్చాయి. ఐదేళ్లు కేవలం జేబులు నింపేసుకోవడంపై దృష్టిపెట్టిన గుత్తేదారు ఉద్యానవనం నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న దృష్ట్యా ముడసర్లోవ ఉద్యానవనాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**అందులో సగం వెచ్చించినా మెరుగయ్యేది..** జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం మేరకు రెండేళ్ల క్రితం ముడసర్లోవ ఉద్యానవనం పక్కన పెద్ద వృక్షాలున్న ప్రాంతంలో హార్స్ రైడింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. దీనికి సుమారు రూ.3కోట్లు వెచ్చించారు. రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో నిర్మిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో మధ్యలో ఆపేశారు. అంటే రూ.1.5కోట్లు ఖర్చు పెట్టినా ముడసర్లోవ ఉద్యానవనానికి వచ్చేదని స్థానికులు చెబుతున్నారు.

## ముసిలో మసి.. ఆరోగ్యం నుసి



ఒంగోలు : రెండు బ్లేడ్ల(యంత్రాలు)తో గ్రానైట్ రాళ్లను కోయడం ద్వారా రెండు నెలలకు సుమారు 15 ట్యాంకర్ల(45 వేల లీటర్ల) ద్రవ వ్యర్థాలు విడుదలవుతాయి. వీటిని డంపింగ్ యార్డులకు తరలించి నిల్వ చేయాల్సి ఉంటుంది. ఆ విషయాన్ని కొందరు యజమానులు విస్మరిస్తున్నారు. వాగులు, చెరువుల్లో పారబోస్తూ అటు గాలి.. ఇటు నీటిని చేజేతులారా కలుషితం చేస్తున్నారు. తెల్లని రాతిపొడి దుమ్ము, ధూళీ మాదిరిగా గాలిలో కలుస్తూ శ్వాస కోశ వ్యాధులకు కారణం అవుతుండగా.. నీటిలో పారుతూ జలాన్ని గరళంగా మారుస్తోంది. అయినా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులు చేష్టలుడిగి చూస్తుండిపోతున్నారు.

**ఆ నీరే సాగుకు దిక్కు**

ముసి నది వెలిగొండలోని దొక్కలసాల నుంచి ప్రారంభమవుతుంది. మార్కాపురం, దర్శి, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల మీదుగా ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ నదిపై నిన్నూరుపాడు, అనకర్లపూడి, ముప్పరాజుపాలెం, పెరివేపి, ముప్పవరం, వెన్నూరులో ఆరు ఎత్తిపోతల పథకాలున్నాయి. వాటి ఆధారంగా రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఈ నదితో పాటు బూదవాడ వాగు, సంతనూతలపాడు మండలం గుళ్లవాగు, చీమకుర్తి మండలం ముప్పవారిపాలెం చెరువులోనూ గ్రానైట్ ద్రవ వ్యర్థాలను కలుపుతున్నారు. ఆ నీటి వనరుల ఆధారంగా సుమారు పది వేలకు పైగా ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. గ్రానైట్ ద్రవ వ్యర్థాలు కలుస్తుండంతో జలాలు కలుషితం అవుతున్నాయి.

**గుర్తించినా లేవు చర్యలు**

చీమకుర్తి, ఆర్ఎల్‌పురం, యల్లయ్యనగర్, దేవరపాలెం, రామతీర్థం, మర్రిచెట్లపాలెంలో ప్రయాణించాలంటే మాస్కు లేదా చేతిరుమాలు తప్పనిసరి. స్థానికులతో పాటు ప్రయాణికులు కళ్లకు అద్దాలు, ముక్కుకు చేతిరుమాలు కట్టుకునే కనిపిస్తారు. ఇక్కడ గాలి నాణ్యత సాధారణంగా ఉండాల్సిన 50 కంటే 130 ఏక్యూఐ ఉందని, పీలిస్తే రోగాలు వస్తాయని పీసీబీ అధికారులు గతంలోనే హెచ్చరించారు. దీనికి కారణం ద్రవ వ్యర్థాలు(స్లర్రీ) ఆరిన తరువాత గాలిలో కలిసిపోవడమేనని నిర్ధారించారు. అయినా నివారణ చర్యలు శూన్యం.

**ప్రతి నెలా 15 వేల ట్యాంకర్లు**

గత నెల 15న పీసీబీ అధికారులు మర్రిచెట్లపాలెంలోని ముసి వాగును పరిశీలించారు. గ్రానైట్ రాళ్లముక్కలతో పాటు ద్రవ వ్యర్థాలూ పారబోసినట్లు గుర్తించి వాగుకు ఇరువైపులా ఉన్న 11 పరిశ్రమలకు నోటీసులు జారీ చేశారు. వారితో సమావేశమై జల వనరులను కలుషితం చేయొద్దని గట్టిగా హెచ్చరించారు. అయినా ఫలితం శూన్యం. జిల్లాలో కార్యకలాపాలు సాగించే వెయ్యి పరిశ్రమల నుంచి ప్రతినెలా వెలువడే 15 వేల ట్యాంకర్ల వ్యర్థాలు ఖాళీ స్థలాలు, జల వనరుల్లో కలిసిపోతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేస్తేనే రోగాలు దరి చేరకుండా ప్రజల ప్రాణాలు పదిలంగా ఉంటాయి. ఈ విషయమై జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. 'డంపింగ్ యార్డు ఏర్పాటుకు గుర్తించిన ప్రభుత్వ స్థలానికి సర్వే నంబరు లేదు. యార్డు ప్రాధాన్యం గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం' అని జేసీ గోపాలకృష్ణ తెలిపారు.

లీజుకిచ్చిన అన్ని క్వారీలు: 238
స్టోన్ క్రషర్లు: 60గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్లు: 1,500
కార్యకలాలు సాగిస్తున్నవి: 1,000
రెండు నెలలకు విడుదలయ్యే వ్యర్థాలు: 7,500 ట్యాంకర్లు
ప్రభావిత ప్రాంతాలు: చీమకుర్తి, సంతనూతలపాడు, కొండపి, పొదిలి, మద్దిపాడు, కనిగిరి
సమస్య ఎదుర్కొనేవారు: సుమారు రెండు లక్షల మంది

## గూడుకు స్థలాలే అడ్డు



ఒంగోలు : గత ప్రభుత్వ ఊరికి దూరంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భూములు లేదా వాగులు, వంకలు, శ్మశానాల స్థలాలను సేకరించి పేదలకు ఇంటి పట్టాలిచ్చింది. ఇల్లు మంజూరు చేసి కట్టుకోవాలని సూచించింది. అదే సమయంలో శివారు ప్రాంతాలు కావడం.. మౌలిక వసతులు ఏర్పాటులో నిర్లక్ష్యం వహించింది. వైకాపా హయాంలోని ఈ పాపాలు.. పేదల గృహయోగానికి ఇప్పుడు శాపాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా.. పక్కాగృహాల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. **ఇప్పటికి 3,071 పూర్తి:** పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పక్కాగృహ నిర్మాణాలపై దృష్టి పెట్టింది. ప్రధాన మంత్రి ఆవాస యోజన 2.0 కింద నూతనంగా కేటాయించనున్న ఇళ్ల నిర్మాణాల మంజూరుకు సర్వే చేయించింది. మరోపక్క గత ప్రభుత్వ హయాంలో పలు దశల్లో ఆగిన ఇళ్ల పూర్తికి లబ్ధిదారులను ప్రోత్సహిస్తోంది. అందుకు సకాలంలో బిల్లులు విడుదల చేస్తూ వారికి ఆసరాగా నిలుస్తోంది. అయినా గత ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్లలో ఇల్లు కట్టుకునేందుకు అంతగా అసక్తి చూపడం లేదు. **గగనంగా మారిన లక్ష్య సాధన:** జూన్ 12న రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు అన్ని నియోజకవర్గాల వారీగా లక్ష్యాలను కేటాయించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,839 పక్కాగృహాలు పూర్తి చేయాలనేది లక్ష్యం. గతేడాది జూన్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు 3,071 ఇళ్లు(35 శాతం) మాత్రమే పూర్తయ్యాయి. మరో నెల రోజుల్లో 5,768 గృహాలు(65 శాతం) పూర్తి కావడం గగనంగా మారింది. ఏడాదిగా మార్కాపురంలో అత్యధికంగా 655బీ కొండపి నియోజకవర్గంలో 161 పక్కాగృహాలే పూర్తయ్యాయి.

## గుండ్లకమ్మ గట్టెక్కించేనా!



మద్దిపాడు : ఎండలు మండుతున్న నేపథ్యంలో వేసవిలో నీటి గండం ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నారు. కీలకమైన గుండ్లకమ్మ జలాశయంలో 2.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మళ్లీ వర్షాలు కురిసే వరకూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వవని అధికారులు చెబుతున్నారు. అయితే నిర్వహణ పనుల నిమిత్తం ఇక్కడి సీపీడబ్ల్యుఎస్ పథకం నుంచి తాగునీటిని వరకూ నిలిపివేయనున్నారు. దీనివల్ల 69 గ్రామాలకు నీరందదని అధికారులు చెబుతున్నారు. గుండ్లకమ్మ జలాశయం నుంచి ఒంగోలు నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని లక్షలాదిమందికి తాగు నీరందిస్తున్నారు. ప్రధానంగా మేదరమెట్ల సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం (సీపీడబ్ల్యూఎస్) ద్వారా 1.5 లక్షల మందికి, ఒంగోలు నగరవాసులకు శుద్ధి చేసిన జలాలు అందిస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ప్రతిరోజు 25 క్యూసెక్కులు సరఫరా అవుతున్నాయి. ఒక్క ఒంగోలు నగరానికే 40 మిలియన్ లీటర్లు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొరిశపాడు, అద్దంకి, జె.పంగులూరు, ఒంగోలు రూరల్ మండల పరిధిలోని లక్షన్నర మందికి 65 లక్షల లీటర్ల నీరిస్తున్నారు.

**తాగునీటి అవసరాలకే..** గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం ఒక్కొక్కరికి 55 లీటర్లు, నగరంలో ఒక్కొక్కరికి 133 లీటర్ల చొప్పున సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలోని నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. లీకేజీలు నివారించామని, వేసవిలో గట్టెక్కుతామని వారు భరోసా ఇచ్చారు.

**69 గ్రామాలకు నిలుపుదల**

గుండ్లాకమ్మ జలాశయంలోని మేదరమెట్ల సమగ్ర రక్షిత తాగునీటి సరఫరా పథకం నుంచి మూడు రోజుల పాటు నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నారు. ఈ పథకంలో కొత్త మోటార్ల బిగింపు, మరమ్మతుల నిమిత్తంవరకు స్కీమ్ పరిధిలోని 69 గ్రామాలకు నీరు సరఫరా కాదని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాబు తెలిపారు.

## పనులు గాలికి..కాసులు జేబుల్లోకి

పెద్దారవీడు : జాతీయ ఉపాధి హామీ పథకం కొందరు అక్రమార్కులకు వరంలా మారింది. నిబంధనల ప్రకారం చేసిన పనుల చిత్రాలు, వివరాలను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. ఆచరణలో అందుకు విరుద్ధంగా సాకులు చూపుతున్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాలైన పెద్దారవీడు మండలం సుంకేసుల, కలనూతల, గుండంచర్ల గ్రామాలకు అంతర్జాల సిగ్నల్ సమస్య ఉంది. దీంతో ఆ నిబంధన నుంచి అధికారులు కొంత వెసులుబాటు కల్పించారు. దీంతో అక్రమార్కులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇదే అదనుగా రేగుమానుపల్లి, పోతంపల్లి, సానికవరం తదితర గ్రామాలకు చెందిన కొందరు కూడా సిగ్నల్ సమస్య అంటూ సాకులు చెబుతున్నారు. వాస్తవానికి ఆ సమస్య లేకున్నా.. పీడీ కార్యాలయంలోని కొందరికి ముడుపులు ముట్టజెప్పి సరే అనిపించుకున్నారు. పనులకు సంబంధించి చిత్రాలు నమోదు చేయకుండానే బిల్లులు చేయించుకుంటున్నారు. **పనికి రాకున్నా డబ్బులు** కొందరు సిబ్బంది బహిరంగంగానే శ్రామికులతో బేరాలకు దిగుతున్నారు. పనులకు రాకున్నా మాకింత.. మీకింత అంటూ నగదు చెల్లిస్తున్నారు. ఇష్టానుసారం మస్టర్లు నమోదు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం.. పరిశీలించి హాజరు తీసుకుని, కొలతలు చూడాల్సిన టెక్నికల్ అసిస్టెంట్లు కార్యాలయంలోనే కూర్చుని బిల్లులు చేస్తుండటం అక్రమార్కులకు మరింతగా కలిసి వస్తోంది. ఈ విషయాలపై ఆ పథకం మార్కాపురం క్లస్టర్ ఏపీడీ నిర్మలాదేవి మాట్లాడుతూ.. ఉపాధి కూలీల నుంచి ఫిర్యాదులు అందితే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. టీఏలను తీసుకుని పనుల వద్దకు వెళ్లి నేరుగా తనిఖీలు చేస్తామని తెలిపారు.

## జలం నిలవాలి జనం మురవాలి

కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా జలభగ్నం చేసింది.. నిర్వహణకు పైసా ఇవ్వలేదు.. కేసీ చెదిరింది.. ఎస్సార్బీసీ ఏడిపిస్తోంది.. అలగనూరు కుప్పకూలింది.. గోరుకల్లు లీకేజీ అవుతోంది.. అవుకు అధోగతి పాలైంది.. పెండింగ్ ప్రాజెక్టుల దస్త్రాన్ని అటకెక్కించారు.. తుంగభద్ర, హంద్రీ, కృష్ణమ్మ నదులు పారుతున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి.. ప్ర'జల'కు ప్రాధాన్యం ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జలాశయాల నిర్వహణకు నిధులు విడుదల చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టబోతున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరుల బాగుకు రూ.1,568 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు.

**వీటికి మోక్షం కలిగేనా**

పశ్చిమ ప్రాంతంలో ఆర్డీఎస్, వేదవతి జలాశయాల నిర్మాణానికి గతంలో తెదేపా పునాది వేసింది. 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.1,942 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటివరకు రూ.90 కోట్లు ఖర్చు చేశారు. దీన్ని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది.

కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు నీరందించేలా రూ.1,985 కోట్ల వ్యయంతో ఆర్డీఎస్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రూ.12.60 కోట్ల వరకు వెచ్చించారు. అందుబాటులోకొస్తే 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సుంకేసుల (రూ.27 కోట్లు)

కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల పరిధిలో 2.65 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే సుంకేసుల జలాశయానికి రూ.27 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కాల్వ అధ్వానంగా మారడంతో 1,500 క్యూసెక్కులు ప్రవహించని పరిస్థితి నెలకొంది.సుంకేసుల, అలగనూరు, ముచ్చుమర్రి జలాశయాలకు కలిపి తొలుత రూ.107 కోట్లకు ప్రతిపాదించారు.. ఆ తర్వాత రూ.27 కోట్లకు కుదించారు.

ఎస్సార్బీసీ (రూ.89 కోట్లు)

శ్రీశైలం కుడిగట్టు కాల్వకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుంటారు. జలాశయం పనులు పూర్తికాకపోవడంతో 12 టీఎంసీలు నిల్వ చేయని పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో కట్ట కుంగింది. ఈ నేపథ్యంలో రూ.89 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు.

అవుకు (రూ.40కోట్లు)

గత ఐదేళ్లుగా అవుకు జలాశయం నిర్వహణ పనులు చేపట్టలేదు. గేట్ల వద్ద నీటి లీకేజీ కొనసాగుతోంది. గత ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.. రెండో విడత పనులకు సంబంధించి రూ.24 కోట్లు గుత్తేదారుకు చెల్లించాల్సి ఉంది.

వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని అవుకు సొరంగం, జలాశయం నిర్వహణకు రూ.40 కోట్ల వరకు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

హంద్రీనీవా (రూ.700కోట్లు)

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వను విస్తరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మల్యాల నుంచి జీడిపల్లి (0-216 కి.మీ.) వరకు కాల్వ వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.700 కోట్లు అవసరమని ఇంజినీర్లు ప్రతిపాదించారు.

ప్రస్తుతం కాల్వలో 1,900 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. విస్తరించి 3,850 క్యూసెక్కులు తరలించనున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గురు రాఘవేంద్ర (రూ.57కోట్లు)తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టు స్థిరీకరించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా కనీసం విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు.. నిర్వహణలేక మోటార్లు సతాయిస్తున్నాయి. వీటిని బాగు చేసేందుకు రూ.57 కోట్లు అవసరమవుతాయి.

శ్రీశైలం (రూ.18కోట్లు)కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.18 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులతో కొంతవరకు పనులు చేసేందుకు అవకాశముంటుంది, డ్రిప్ ద్వారా నిధులు విడుదలైతే తప్ప పూర్తిస్థాయిలో పనులు చేసేందుకు అవకాశముండదని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ రూ: 313 కోట్లు
కేసీ, రాజోలి, జొలదరాశి (235)
గాజులదిన్నె (35)
చెరువుల నిర్వహణ (46)
సిద్ధాపురం ఎత్తిపోతల (8)

## ఉపాధి మేడలు

కర్నూలు : ఐదేళ్ల వైకాపా కాలంలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. 'కొత్త ఇసుక విధానం' పేరిట రీచ్‌లను మూసేశారు. ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. భవనాలు, ఇళ్ల పనులన్నీ ఆగిపోవడంతో కార్మికులకు నెలల తరబడి ఉపాధి కరవైంది. ఇతర రాష్ట్రాలకు వలస పోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అర్ధాకలితో అలమటించేలా చేసింది. కొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కార్మికులకు చేతినిండా పని దొరుకుతోంది. పనుల స్థాయిని బట్టి రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తోంది. ఏడాదిలో అక్టోబరు నుంచి మే వరకు నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఉంటుంది. 'కూటమి' ప్రభుత్వం పల్లె పండగ పేరుతో సిమెంటు దారులు నిర్మిస్తోంది.



ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1,000, రూ.1,500, రూ.2 వేలకు అందుబాటులో ఉంది. కారుచౌకగా ఇసుక లభిస్తుండటంతో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు.“ నగరంలో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణానికి దసరా రోజున శంకుస్థాపన చేశాం.. రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు” బ్యాంకు ఉద్యోగి నవీన్ పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నట్లు అంచనా. ఒక్క కర్నూలు నగరంలోనే గత నెలలో వంద ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు.

**దండిగా ఇసుక నిల్వలు** గతంలో టన్ను రూ.326 ఉండగా.. దాన్ని కూటమి ప్రభుత్వం రూ.320కు తగ్గించింది. ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని డీసిల్టింగ్ పాయింట్లలో టన్ను రూ.202, మరలి ఇసుక రీచ్‌లో రూ.119, గుడికంబాలి రూ.39, నదిచాగిలో రూ.40 నామమాత్రపు ధరకు ఇసుక లభిస్తోంది. ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య 1,45,350

# అక్రమాల లోతెంత?

విశాఖపట్నం: భీమిలి వద్ద తీరంలో వైకాపా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సాగించిన అక్రమాల లోతులను అధికారులు పరిశీలిస్తున్నారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన కట్టడాలను పూర్తిగా తొలగించి పూర్వస్థితి తీసుకురావాలని హైకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ నేపథ్యంలో పునాది ఎంత లోతు ఉంది? ఎంత ఖర్చు అవుతుంది? అని అంచనా వేయడానికి నిర్ణయించుకున్నారు. రెండు రోజుల కిందట మనుషులతో పునాదుల వద్ద సమాంతరంగా తవ్వి లోతును గుర్తించేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. దీంతో బుధవారం జేసీబీతో పునాది పక్కన ఇసుక తవ్వి లోతు పరిశీలించారు. పునాదిని నిర్మించిన తీరు చూసి ప్లానింగ్ అధికారులు ఖంగుతిన్నారు. 588 మీటర్ల పొడవున్న పునాది సుమారు 6-8 అడుగుల్లోతు వరకు ఉంది. అడుగు భాగాన పునాది వెడల్పు 10 అడుగుల మేర ఉంది. కోర్టు ఆదేశాల ప్రకారం ఇదంతా పూర్తిగా తొలగించడానికి రూ.50 లక్షలపైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే



స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ, ఇతర నిర్మాణాలు కూల్చడానికి రూ.4లక్షలు ఖర్చు అయినట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. కట్టడాలు కూల్చడానికి పెట్టిన ఖర్చు నేహారెడ్డికి చెందిన అవ్యాన్ సంస్థ నుంచి వసూలు చేయాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

**నక్షత్రాల హోటల్‌కేనా?:** విజయసాయిరెడ్డి కుమార్తె భీమిలి తీరాన్ని ఆనుకుని అవ్యాన్ ఎల్ఎల్‌పీ సంస్థ పేరిట ఉన్న స్థలంలో భారీ నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలు చేశారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘన అంశం తెరపైకి వచ్చిన సమయంలో ఐదు నక్షత్రాల హోటల్ నిర్మాణం కోసమే శాశ్వత కట్టడాలు చేపడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సముద్రానికి దగ్గరిగా నిర్మించిన ప్రహరీ పునాదులు పరిశీలించగా.. అడుగున పది అడుగుల మేర వెడల్పుతో కాంక్రీట్ పర్చడం హోటల్ కోసమేనని స్పష్టమవుతోందని పలువురు భావిస్తున్నారు.

17న పరిశీలన: తీరంలో శాశ్వత కట్టడాలను కూల్చడానికి అయ్యే ఖర్చుతోపాటు, నిర్మాణాల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అధ్యయనం చేసేందుకు కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అధికారులతో నిపుణుల కమిటీతో అంచనా వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నిపుణులు కమిటీలో అధికారి ఈనెల 17వ తేదీన పరిశీలించే అవకాశం ఉంది. పర్యావరణానికి జరిగిన నష్టం అంచనా వేసి కోర్టుకు చెప్పాల్సి ఉండటంతో కేసు వాయిదాకు ముందే ఈ తనిఖీ పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులకు కోర్టు నిర్దేశం చేసింది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

# సొంతింటి కలకు కొండంత అండ

నక్కపల్లి : సొంత గూడు ఉండాలని ప్రతి కుటుంబం కోరుకుంటుంది. గడిచిన వైకాపా పాలనలో జగనన్న ఇళ్ల పేరిట ఆర్భాటంగా మొదలు పెట్టిన గృహ నిర్మాణాలకు సరైన సహకారం అందించక పోవడంతో అవన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి నిర్మాణాలను కొనసాగించేలా తీపికబురు చెప్పింది. లబ్ధిదారుల్లో వెనుకబడిన వర్గాలకు అదనపు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలో వేలాదిమందికి మేలు జరగనుంది.అయిదేళ్ల పాలనలో జిల్లాలో 61 వేలకు పైగా ఇళ్లను మంజూరు చేశారు. దీనికి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం రూ. 1.8 లక్షలు అమలు చేస్తూ, జగన్ పేరును ప్రచారం చేసుకున్నారు. కాగా ధరాభారం, ప్రోత్సాహం లేకపోవడంతో చాలామంది ఇళ్లను నిర్మించుకోలేక పోయారు. జగన్ అధికారం కోల్పోయేనాటికి అసలు ప్రారంభం కానివి, వివిధ స్థాయిల్లో ఆపేసినవి సుమారు 40 వేలకు వరకు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించి గడిచిన రెండు నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ పెట్టి చాలా ఇళ్లను పూర్తిచేయించగా, జిల్లాలో సుమారు 5500 వరకు ఉన్నాయి. ప్రస్తుతం మరో ఏడువేల ఇళ్లను పూర్తి చేయించే పనిలో ఉన్నారు. ఇవన్నీ పోనూ మిగిలిన వాటిలో దాదాపు బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల వారు ఎక్కువగా ఉండటంతో వీరందరికీ అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, చేనేత వర్గాలకు అదనపు ఆర్థిక సాయం చేయనుంది. ఆ మేరకు జిల్లా పరిధిలో దాదాపు 26,800 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఇందులో ఓసీలు సుమారు 5800 మంది ఉన్నారు. ఇవి మినహాయిస్తే, దాదాపు 21 వేల మందికి మేలు జరగనుంది. ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం ఇలాంటి వివరాలను సేకరించే పనిలో పడింది.

**సాయం ఇలా..**

ఎస్సీ, బీసీ, చేనేతలకు: రూ. 50 వేలుఎస్టీలు: రూ. 75 వేలు
ఎస్టీల్లో బాగా వెనుకబడిన వారికి: రూ. లక్షజిల్లాలో ఇళ్ల పరిస్థితి ఇది
మొత్తం ఇళ్లు: 61,505పూర్తయినవి: 26,699ప్రారంభం కానివి: 17,559వివిధ దశల్లో నిలిచినవి: 17,247

**సద్వినియోగం చేసుకోండి**

అదనపు ఆర్థిక సహాయం వినియోగించుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు చెందిన 13,548 మంది లబ్ధిదారులకు రూ.70.04 కోట్ల అదనపు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. జిల్లాలో మే చివరినాటికి 13,687 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నామన్నారు.

# కార్మిక లెక్కల్లో మాయాజాలం



అనంతపురం : శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో గుత్తేదారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కార్మిక లెక్కలను మార్చేస్తూ నెలనెలా బిల్లులు కాజేస్తున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గాలతో పాటు ట్రంకులైన్ పరిధిలో సుమారు 130 మంది కార్మికులను అధికంగా చూపి సొమ్మును జేబుల్లో నింపుకొంటున్నారు. ప్రతినెలా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పక్కదారి పట్టిస్తున్నారు. మూడు, నాలుగేళ్లుగా గుత్తేదారులు అక్రమాలకు పాల్పడుతున్నారని కార్మిక సంఘాలు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో కొన్ని అక్రమాలు నిజమే అని తేలినా కనీస చర్యలు లేకపోవడం గమనార్హం.

మడకశిర నియోజకవర్గం పరిధిలో 172 మంది పని చేస్తున్నట్లు రికార్డులో నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్నది 110 మంది. అంటే 62 మందిని ఎక్కువగా చూపి బిల్లులు డ్రా చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలోనూ సదరు గుత్తేదారు 220 మంది ఉన్నట్లు అవినీతికి తెరలేపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలో 2023కు ముందు 110 మంది కార్మికులకుగాను 173 మందిని చూపించి బిల్లులు కాజేశారు. రాయదుర్గం పరిధిలో 70 మందికి 110 మంది ఉన్నట్లు చూపించి అవినీతికి పాల్పడ్డారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 180 మందికి మించి పని చేయడం లేదు.

హిందూపురం పరిధిలో 40 మందిగాను రికార్డుల్లో 63 మందిని చూపిస్తున్నారు.

**కూటమి ప్రభుత్వంలోనూ వారిదే హవా**

గత వైకాపా ప్రభుత్వంలో టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులే ఇప్పటికీ పని చేస్తున్నారు. వారికి గడువు గతేడాది ఏప్రిల్‌కే ముగిసింది. కొత్తగా టెండర్లు పిలవకుండా వారినే కొనసాగిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సదరు గుత్తేదారులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కార్మికులకు జీతాల్లో కోత విధించి చెల్లిస్తున్నా.. 25 నెలలుగా పీఎఫ్ జమచేయకపోయినా చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా కార్మికులు తరచూ సమ్మెలోకి వెళుతుండటంతో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**నాలుగేళ్లుగా..**

తాగునీటి పథకం కింద 588 మంది కార్మికులు ఉన్నట్లు ప్రస్తుతం అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఏడాది కిందట 700 పైగానే ఉండేది. పథకం నిర్వహణ చూస్తున్న గుత్తేదారులు నాలుగేళ్లుగా కార్మికుల లెక్కను ఎక్కువగా చూపి బిల్లులు తీసుకుంటున్నారు. గతంలో మడకశిర పరిధిలోనే రూ.6 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు విచారణలో గుర్తించారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, ట్రంకులైన్ పరిధిలో రూ.9 కోట్ల వరకు అక్రమంగా బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మొత్తంగా రూ.15 కోట్ల వరకు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది

**క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం: వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం**శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటున్నాం. కార్మికుల సంఖ్యను ఎక్కువ చేసి చూపుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతాం. నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.జీతాలకు సంబంధించి పర్యవేక్షణ మా పరిధిలోనే ఉండేలా చర్యలు చేపడతాం.

# దత్తత.. భవితకు భరోసా



అనంతపురం : గుంతకల్లు బస్టాండులో 2023, ఆగస్టు 24న తొమ్మిది నెలల ఆడపిల్లను పడేశారు. కాలు వంకర పోయింది. చైల్డ్‌లైన్‌కు వచ్చిన సమాచారంతో స్థానిక ఐసీడీఎస్ యంత్రాంగం అనంత శిశుగృహకు చేర్చారు. రెండేళ్లపాటు శిశుగృహలోనే చిన్నారి పెరిగింది. వంకర పోయిన కాలుకు ఆర్డీటీ సహకారంతో శస్త్రచికిత్స చేయించారు. 'కారా' సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఈనెల 3న అమెరికాలోని మేరీల్యాండ్ నగరానికి చెందిన దంపతులు చిన్నారిని దత్తతకు తీసుకొన్నారు.కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రాంతానికి చెందిన ఓ తండ్రి స్వయంగా తన ఆడబిడ్డను శిశుగృహ కేంద్రానికి అప్పగించాడు. ప్రసవ సమయంలోనే తల్లి మృత్యువాత పడింది. అప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడో కాన్పు కింద పుట్టిన ఆడపిల్లకు రెండు కాళ్లూ వంకర పోయాయి. ప్రస్తుతం శిశుగృహ సంరక్షణలో ఉంది.ఆడపిల్ల అనో.. వివాహేతర సంబంధమో.. పేదరికంతో పోషించాలేకనో.. ఇలా కారణం ఏదైనా కావచ్చు.. ప్రసవించిన రోజునే చెత్తకుండీ.. ముళ్లకంపల్లో.. డ్రైనేజీ కాలువల్లో నిర్ధాక్షణ్యంగా పడేస్తున్నారు. మానవత్వాన్ని మరిచి.. కన్నపేగును తెచ్చుకున్న తల్లులు ఎందరో కన్నబిడ్డలను కాలదన్నుతున్నారు. అవయవాల లోపాలతో జన్మించే బిడ్డలను స్వయంగా తల్లిదండ్రులే గుట్టుచప్పుడు కాకుండా సంరక్షణ కేంద్రాలకు అప్పగిస్తున్నారు. కన్నావారు ఉన్నా అనాథలుగా పెరిగే దయనీయ దుస్థితి. ఇలాంటి వారికి అనంత ఐసీడీఎస్ అనుబంధగా ఉన్న 'శిశుగృహ' కొండంత అండగా భరోసా కల్పిస్తోంది. 'నేనున్నానంటూ'.. అక్కున చేర్చుకుంటోంది. పిల్లల కోసం పరితపించే దంపతులకు 'దత్తత' ఇస్తోంది. ఒత్తిడి.. ఇతరాత్ర కారణాలతో పిల్లలు పుట్టలేని దంపతులు దత్తత వైపుమొగ్గు చూపే వారి సంఖ్య నానాటికి పెరుగుతోంది. కేంద్ర మానవ వనరుల దత్తత సంస్థ(కారా) సారథ్యంలోనే ప్రక్రియ కొనసాగుతోంది.

**ఎక్కువగా ఆడపిల్లలే..**

గడిచిన మూడేళ్లలో శిశుగృహ నుంచే 24 మంది పిల్లలను దత్తతకు ఇవ్వడం విశేషం. ఇందులో ఎక్కువగా 15 మంది ఆడపిల్లలు ఉన్నారు. తక్కిన తొమ్మిది మంది మగ పిల్లలు. దత్తత తీసుకునే దంపతులు సైతం ఆడపిల్లల వైపే మొగ్గు చూపిస్తుండటం శుభపరిణామం. ఎక్కువగా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన దంపతులే ఎంపిక చేసుకున్నారు. మూడేళ్లల్లో అమెరికా, న్యూజిలాండ్ తదితర దేశాలకు పిల్లలను తీసుకెళ్లారు. ఏటా కనీసం పది మంది శిశువులను అనాథలుగా పడేస్తున్నారు.

**పెండింగ్‌లో 150 దరఖాస్తులు**

'కారా' సంస్థలోనే దత్తత కోసం దరఖాస్తు చేసుకోవాలి. సీనియార్టీ ప్రాతిపదికన దత్తతకు ఇవ్వనున్నారు. క్షేత్ర స్థాయిలో ఆర్థిక, సామాజిక, ఇతరాత్ర కోణాల్లో నిశిత పరిశీలన తర్వాతే దత్తతకు ఆమోదం కల్పిస్తారు. రాష్ట్రంలో దాదాపు 150 మందికిపైగా దంపతులు నిరీక్షణ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సహకారంతో పిల్లల సంరక్షణ, దత్తత ప్రక్రియ ఉంటుందని శిశుగృహ మేనేజర్ దీప్తి తెలిపారు.

# గ్రామీణ రహదారులకు మహర్దశ

ధర్మవరం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గోతులపడిన రహదారులపై ప్రయాణించి పలువురు ప్రమాదాలబారిన పడ్డారు. కొందరు ప్రాణాలొదిలారు. అధ్వానంగా తయారైన రహదారులకు మరమ్మతులు చేయాలని కోరుతూ అప్పటి ప్రతిపక్షాలు రోడ్డెక్కి ఆందోళనలు చేసి నా ప్రభుత్వం స్పందించలేదు. దీంతో ఐదేళ్ల కాలంలో గ్రామాల రోడ్లపై ప్రశాంతంగా ప్రయాణించలేని దుస్థితి నెలకొంది. అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఎన్నికల్లోనూ హామీ ఇచ్చారు. ఆ హామీ నిలబెట్టేకునేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిగా దెబ్బతిన్న దారులకు నాబార్డు ద్వారా ఆర్ఐడీఎఫ్ (రూరల్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఫండ్) పథకం కింద పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో పనులు జరిగేలా అనుమతులిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లాలోని 18 రహదారుల మరమ్మతులకు భారీగా నిధులు మంజూరు చేశారు. దీంతో ఇన్నాళ్లు ప్రయాణం నరకంగా మారిన పల్లె దారులు కొత్త రూపును సంతరించుకుంటుండటంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**65.14 కి.మీ దారులకు రూ.25.18 కోట్లు** జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లోని 65.14 కి.మీ.ల రహదారుల అభివృద్ధికి రూ.25.18 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గోతులను పూడ్చి వేయడం, తారులేసి కంకర తేలిన దారులకు కొత్తగా తారువేడయం, మలుపులను నియంత్రించడం తదితర పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 9 నుంచి పనులకు టెండర్లు ఆహ్వానించింది. గుత్తేదారులు 9 నెలల్లో పనులు పూర్తి చేయాలని గడువు విధించింది.పనులను సకాలంలో పూర్తి చేస్తాంతిరుమలరెడ్డి, డీఈ, పంచాయతీరాజ్ (ప్రాజెక్టు) గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు మంజురయ్యాయి.


# కన్నీరై'నది'

శ్రీకాళహస్తి : అక్రమార్కులు కబ్జా చేసి భారీ సౌధాలు నిర్మిస్తున్నారు. పరీవాహక ప్రాంతాల్లో ఇసుక దోచేస్తుండటంతో నదీమతల్లి కన్నీరు పెడుతోంది. నదులు సహజత్వాన్ని కోల్పోతున్నాయి. పంటలను సస్యశ్యామలం చేయాల్సిన జలాలు జనావాసాలను ముంచెతుతున్నాయి. ఏటా మార్చి 14న నదుల పరిరక్షణ కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని నదులు సాగుకు ఉపయోగపడుతున్న తీరు, పెరుగుతున్న ఆక్రమణలు, ఇప్పటివరకు తలెత్తిన నష్టంపై కథనం.

**4 లక్షల ఎకరాలకు నీరు అందిస్తూ** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కుశస్థలి, స్వర్ణముఖి, నీవా, కౌండిన్య, గార్గేయ, బాహుదా నదులు ప్రవహిస్తున్నాయి. సోమల, ఐరాల, గంగా ధరనెల్లూరు, చిత్తూరు, నగరి మండలాల్లో పెద్దగా ఇక్కట్లు తలెత్తడం లేదు. నదుల ద్వారా ఏటా సుమారు 4 లక్షల ఎకరాలు సాగవు తున్నాయి.

**కుశస్థలి కింద లక్ష ఎకరాలు**

జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గంలోని మండలాల్లో సుమారు 50



కిలోమీటర్లు కుశస్థలి నది ప్రవహిస్తుంది. ఈ నది కార్వేటినగరంలోని కృష్ణాపురం రిజర్వాయర్ వద్ద చిన్న కాలువగా మొదలై ఏపీ, తమిళనాడు ప్రాంతాల్లో ఏటా వర్షాకాలంలో ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. ఏటా ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ నదిపై 1972లో అప్పటి ఎమ్మెల్యే కిలారి గోపాలనాయుడు బుగ్గ ప్రాజెక్టు చేపట్టారు. దీని ద్వారా నగరి, నింద్ర విజయపురం, పిచ్చాటూరు మండలాల్లో సుమారు 40 చెరువులు ఏటా నింపుతున్నారు. దీని కింద లక్ష ఎకరాలు సాగవుతాయి. 1999లో కుడి, ఎడమ కాలువలు, చెక్‌డ్యామ్‌లు కట్టారు. ప్రస్తుతం చెక్‌డ్యామ్ కొట్టుకుపోయింది. దాన్ని నిర్మిస్తే మరింత ప్రయోజనం ఉంటుంది. ఇసుక అక్రమార్కులకు నది వరంగా మారింది.

ఐరాల, పూతలపట్టులలో ప్రవహించే గార్గేయ నది కలవగుంటకు చేరుతుంది. అక్కడి నుంచి చిత్తూరుకు తాగునీరు అందిస్తున్నారు. ఈ నది సుమారు 20 కి.మీ ప్రవహిస్తుంది. ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

**కౌండిన్యపై 11 చెక్‌డ్యామ్‌లు దెబ్బతిన్నా..**

పెద్దపంజాణి, పలమనేరు ప్రాంత రైతులకు వరప్రసాదినిగా ఉన్న కౌండిన్య ప్రాజెక్టు కింద సమృద్ధిగా వర్షాలు పడితే సుమారు 70 వేల ఎకరాలు సాగువుతుంది. గత ప్రభుత్వాల హయాంలో కౌండిన్య ప్రాజెక్టుపై 11 చెక్‌డ్యామ్‌లు నిర్మించి నీటిని నిలువరించారు. ఇసుక అక్రమార్కులు ధ్వంసం చేయడంతో వర్షపు నీరంతా తమిళనాడుకు వెళుతోంది. కల్వర్టులు బాగు చేయాలని కోరినా ప్రజాప్రతినిధుల చెవికెక్కడం లేదు. చెక్‌డ్యామ్‌లు మరమ్మతులు చేపడితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఒకప్పుడు మంచి నీరు ప్రవహించే నీవా నదిలో ఇప్పుడు మురుగు పారుతోంది. చిత్తూరులోని తోటపాళ్యం, వీరభద్ర కాలనీ, రంగాచారి వీధి వెనుక భాగం, సంతపేట, రిక్షా కాలనీ, దొడ్డిపల్లి ప్రాంతాలు నీట మునుగుతున్నాయి.

సోమల మండలంలోని గార్గేయ నది పరీవాహక ప్రాంతమంతా ఆక్రమణకు గురైంది. వర్షాకాలంలో ఇబ్బందులే. ఈ నదులపై చెక్‌డ్యాంలు నిర్మించడం ద్వారా నీటి నిల్వలు పెంచుకోవచ్చు.

# అంటకాగి అక్రమాలు

అనంతపురం : పేదలకు ఇళ్లు నిర్మించి వారికి అండగా నిలవాల్సిన కొందరు ఇంటి దొంగలుగా మారుతున్నారు. గత వైకాపా హయాంలో వైకాపా నేతలతో అంటకాగి సిమెంటు, స్టీలు, ఇసుకను నేతల సొంతానికి ఇవ్వడంతో పాటు అధికారులు అక్రమార్గంలో నడిచారు. ఇప్పటికే పలువురు అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు మరికొందరిపై ఛార్జి మెమోలు ఇచ్చి విచారణ చేయిస్తున్నారు. ప్రధానంగా రాప్తాడు నియోజకవర్గంలోనే ఎక్కువగా అక్రమాలు సాగినట్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వచ్చాయి. అయినా కొందరు గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల్లో మార్పు రాలేదు. తాజాగా రాయదుర్గంలో టన్నుల కొద్దీ ఉక్కు మాయం అయినట్లు వెలుగులోకి వచ్చింది. మళ్లీ గోదాములో ఉంచి దాన్ని తొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**15 టన్నులు..**జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను బట్టి గృహనిర్మాణ సంస్థ గోదాముల్లో స్టీలు ఉంచుతారు. రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి అక్కడే గోదాములో నిల్వ ఉంచారు. నిల్వ ఉన్న దానికి




ఇళ్ల నిర్మాణాలకు వినియోగానికి భారీగా వ్యత్యాసం ఉన్నట్లు అనుమానం రావడంతో ఆ శాఖకు చెందిన అధికారులు పరిశీలించి నిజమేనని తేల్చారు. అంతర్గతంగా మరో డివిజన్ స్థాయి అధికారిని విచారణ అధికారిగా నియమించారు. సదరు అధికారితోపాటు స్థానికంగా సిబ్బందితో స్టీలు లెక్కగట్టారు. తక్కువగా ఉన్నట్లు తేలినా చర్యలకు వెనుకాడుతున్నారు. మొత్తంగా 15 టన్నులు మాయం అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే స్టీలు నాణ్యతను బట్టి టన్ను రూ.65 వేల నుంచి రూ.70 వేల వరకు ఉంది. ఈ లెక్కన రాయదుర్గంలోనే రూ.10 లక్షల విలువైన స్టీలు మాయం చేసి విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం.

చురకలు



# కళ్లు'కప్పి'.. గెడ్డల కబ్జా

విశాఖపట్నం : సహజ సిద్ధమైన గెడ్డలను పూడ్చి కబ్జాకు తెగిస్తున్నారు. రూ.కోట్ల విలువైన భూమిలో దర్జాగా పాగా వేస్తున్నారు. రుషికొండ సమీపంలోని ఓ వైకాపా నాయకుడి కనుసన్నల్లో గెడ్డల ఆక్రమణ జరుగుతోంది. ఫలితంగా వర్షాకాలంలో నీరు పోటెత్తి కాలనీలను ముంచేసే ప్రమాదం పొంచి ఉంది.

**పూడ్చి.. కలిపేసుకొని**

ఇది పెద్ద రుషికొండలోని గెడ్డ. సర్వే నెంబరు 28లో ప్రవహిస్తుంది. ఈ పక్కనే సర్వే నెంబరు 27లో ప్రైవేటు స్థలాలున్నాయి. వాటికి చేరుకోవడానికి సరైన దారి లేదని ఏకంగా గెడ్డను చదును చేసి దాదాపు 400 గజాల మేర స్థలంలో కలిపేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.2.50 కోట్లు. శ్రీరాం ప్రాపర్టీస్, గీతం ఆసుపత్రి, ఎండాడ పరిసర ప్రాంతాల్లోని వ్యర్థపు నీరు ఈ గెడ్డ ద్వారా ప్రవహించి ఒమ్మివారిపాలెం, రుషికొండ మీదుగా సముద్రంలో కలుస్తుంది. సుమారు 5 కి.మీ. ప్రవహించే ఈ గెడ్డ 20-30 అడుగులు వెడల్పు ఉండాలి. కానీ, ఆక్రమణలతో బక్కచిక్కిపోయింది.

**వంతెన వద్ద..**

ఈ చిత్రం కూడా సర్వే నెంబరు 28లోని గెడ్డే. పెద్ద రుషికొండలోని ఆక్రమణకు 500 మీటర్ల దూరంలో మరో చోట కబ్జాకు గురయింది.



స్వర్ణ భారతి నగర్-పెదరుషికొండ మధ్యలో ఓ వంతెన వద్ద గెడ్డను ఇలా కప్పేశారు. సుమారు రూ.2 కోట్ల విలువైన 300 గజాల స్థలంపై కన్నువేశారు.

**దుకాణాల ఏర్పాటుకు..**

సర్వే నెంబరు 17లోని శుద్ధ గెడ్డ వంతెన సమీపంలో వ్యర్థాలు పోసి ఆక్రమిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పూడ్చి దుకాణాల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నారు. ఎంతో విలువైన సుమారు 200 గజాల స్థలంలో దర్జాగా పాగా వేసేందుకు పావులు కదుపుతున్నారు.

**చదును చేసి..రేకుల షెడ్లు వేసి..**

ఈ గెడ్డ ఎండాడ రాజీవ్ స్వగృహ వద్ద ప్రారంభమై చిన్న కాలువతో కలిసి గొల్లల ఎండాడ, లక్ష్మీప్రసాద్ లేఅవుట్ మీదుగా బీచ్‌లో కలుస్తోంది. సర్వే నెంబరు 100లో 3.02 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఆ ప్రాంతంలో గజం ధర దాదాపు రూ.80 వేలుంటుంది. గొల్లల ఎండాడ ప్రధాన గ్రామానికి సమీపంలో భవన నిర్మాణ వ్యర్థాలతో కప్పి చదును చేసి సమీప స్థలంలో కలిపేసుకున్నారు. అక్కడే కార్తీకవనం సమీప ప్రాంతంలోనూ కొంత ఆక్రమణలకు గురైంది. గతంలో రెవెన్యూ అధికారులు ఇక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కబ్జా చేసిన స్థలంలో మొక్కలు సైతం నాటారు. ఫైరింగ్ రేంజ్‌ను ఆనుకుని గెడ్డ ప్రవహిస్తున్న చోట రేకులు షెడ్లు ఏర్పాటు చేసి వినియోగించుకుంటున్నారు.

# వారధి కష్టాలు సారథులకేం తెలుసు?

బుచ్చెయ్యపేట : వైకాపా ప్రభుత్వ హయాంలో వడ్డాది, విజయరామరాజుపేట సమీపంలోని వంతెనలు కూలిపోయిన విషయం తెలిసిందే. రాకపోకలకు వీలుగా తాత్కాలికంగా కాజ్‌వేలు ఏర్పాటు చేసిన నాటి ప్రభుత్వం కొత్తగా వంతెనల నిర్మాణం చేపట్టకుండా వదిలేసింది. నాటి నుంచి భీమునిపట్నం - నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థులు వడ్డాది, విజయరామరాజుపేట వంతెనలను ప్రస్తావిస్తూ హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక గత ఏడాది జూన్ 17న ఎంపీ సీఎం రమేశ్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఈ రెండు వంతెనల పరిశీలనకు వచ్చారు. కొత్తగా వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఎంపీ ఆదేశించారు. ఏడాది అవుతున్నా.. ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

వడ్డాది సమీపంలో పెద్దేరుపై పాత వంతెన 2022 మే నెలలో కూలిపోయింది. నెల రోజులపాటు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. నర్సీపట్నం – చోడవరం మధ్య తిరిగే వాహనాలను వేరే మార్గాల్లోకి మళ్లించారు. ఆ తర్వాత తాత్కాలికంగా మరమ్మతు చేపట్టి కూలిన వంతెన పక్కగా రాకపోకలను పునరుద్ధరించారు. రూ.కోటి వ్యయంతో కాజ్‌వే నిర్మించినా.. తక్కువ ఎత్తులో ఉండటంతో తరచూ ముంపునకు గురవుతోంది. పెద్దేరులో నీటి ప్రవాహం పెరిగినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏటా వర్షాకాలంలో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వడ్డాది –




చోడవరం మధ్యలో విజయరామరాజుపేట వద్ద తాచేరుపై వంతెన 2023 డిసెంబరు 20న కుప్పకూలింది. పాడేరు, మాడుగుల, వడ్డాది నుంచి వాహనాలు చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం వైపు వెళ్లాలంటే ఈ వంతెన మీదుగానే ప్రయాణించాలి. తాత్కాలికంగా కాజ్‌వే నిర్మించినా.. ఇబ్బందులు తప్పడం లేదు. కాజ్‌వేలు లోతట్టుగా ఉండటంతో వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయి. గతేడాది భారీ వర్షాలకు వడ్డాది కాజ్‌వే ఒకవైపు కొట్టుకుపోయింది. కొద్దిరోజులపాటు రాకపోకలు నిలిపివేసి మరమ్మతు చేశారు. విజయరామరాజుపేట వద్ద తాచేరులో సిమెంటు తూములు వేసి మట్టి రోడ్డు నిర్మించారు. గతేడాది భారీ వర్షాలకు ఆ రోడ్డు కొట్టుకుపోయింది. నెల రోజులపాటు వాహన చోదకులందరూ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇప్పటివరకు వంతెనల నిర్మాణం ఊసే లేదు. వానాకాలం వస్తోంది. ఈసారి రాకపోకలకు ఇక్కట్లు తప్పేలా లేవు.

**అక్కడ అనుమతులు రావాలి.. ఇక్కడ గుత్తేదారు రాలేదు**

వడ్డాది వద్ద వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. విజయరామ రాజుపేట దగ్గర వంతెన నిర్మాణం ఎన్‌డీబీ ప్రాజెక్టులో ఉంది. రహదారి అభివృద్ధితో పాటు రూ.5 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టాలి. ఈ పనులు చేసేందుకు గుత్తేదారు ముందుకు రావడం లేదు.-సాయిశ్రీనివాస్, సత్యప్రసాద్, ఏఈలు, ఆర్‌అండ్‌బీ మాడుగుల, చోడవరం సెక్షన్

# మామిడి రైతుకు తీపి పంచలేరా?



తిరుపతి: అందరికీ తీపిని పంచే మామిడి రైతుకు ధరల విషయంలో ఏటా చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. సీజన్ ప్రారంభమైన 15 – 20 రోజుల తర్వాత మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించడం.. కర్షకులు ఉసూరుమనడం రివాజుగా మారింది. యంత్రాంగం తీరిగ్గా రైతు సంఘాలు– వ్యాపారులతో చర్చలు జరిపి మద్దతు ధర నిర్ణయించే తంతు జరుగుతోంది. ఒకట్రెండు రోజులకే యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయి. ఈ పరిస్థితికి ఈ ఏడాదైనా చరమగీతం పాడాలని అన్నదాతలు కోరుకుంటున్నారు. సీజన్‌కు ముందుగానే అప్రమత్తమై సంప్రదింపులు జరిపి.. ధరలు ఇవ్వకపోతే ఎదురయ్యే పర్యవసానాలు చెబితే రైతుల ఇక్కట్లు తీరతాయి. మామిడి ధరలు తగ్గించేందుకు యాజమాన్యాలు ఏటా ఏదో ఒక సాకు చెబుతూనే ఉంటాయి. సీజన్ ప్రారంభం, చివర్లో తప్ప కర్షకులకు ధరలు ఎక్కువ ఇచ్చిన దాఖలాలు పెద్దగా లేవు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా గతేడాది కొనుగోలు చేసిన మామిడికి సంబంధించిన గుజ్జును అధికంగా ఎగుమతి చేయలేకపోతున్నామని వ్యాపారులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అడ్డంకులను తొలగించాలని కోరుతున్నారు. స్థానికంగా వినియోగం పెరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. ఈ డిమాండ్లపై ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందిస్తే నిల్వలు క్రమంగా తగ్గిపోతాయి. ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించాలి. లేదంటే పేరుకున్న గుజ్జును చూపిస్తూ పరిశ్రమల నిర్వాహకులు ధరలు గణనీయంగా తగ్గించినా ఆశ్చర్యం లేదు.

**పది రోజులకోసారైనా సమీక్షిస్తేనే..**

సాధారణంగా ప్రతిసారీ ధరలు భారీగా తగ్గినప్పుడు మాత్రమే చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు స్పందిస్తున్నారు. యాజమాన్యాలు, రైతులకు సమాచారం ఇచ్చిన రెండు రోజుల తర్వాత సమీక్ష నిర్వహిస్తున్నారు. ఆరోజుకు ధర గురించి ఇబ్బంది లేదని వ్యాపారులు చెప్పి బయటకు వచ్చేస్తున్నారు. అదే పది రోజులకోసారి సమావేశమై.. గతంలో నిర్ణయించిన ధరను అమలు చేశారా? లేదా? యాజమాన్యాల వైఖరి ఎలా ఉంది? అని చర్చిస్తేనే బాధ్యతగా మెలుగుతారు.

తిరుపతి జిల్లా కలెక్టర్ కూడా ఇదేవిధంగా సూచనలిచ్చినా వ్యాపారులు ఒక్కరోజే పాటించారు. రెండు రోజుల వ్యవధిలోనే టన్ను ధరను రూ. 2వేలు– రూ. 5వేలకు తగ్గించారు. మండీలు, ర్యాంపుల నిర్వాహకులైతే రూ. 7వేల కోత విధించారు. 2023 మే నెలలో సైతం ఇదే విధంగా నాటి చిత్తూరు కలెక్టర్ షన్మోహన్.. యాజమాన్యాలు, అన్నదాతలతో సంప్రదింపులు జరిపిన తర్వాత టన్ను ధరను రూ. 19వేలుగా నిర్ణయించారు. ఇది తమకు గిట్టుబాటు కాదని పరిశ్రమల యజమానులు చెప్పడంతో రెండు రోజులకే రూ. 15,500కు తగ్గించారు. అయినా కూడా వ్యాపారులు టన్ను మామిడిని రూ. 10 వేలు– రూ. 12వేలకు కొన్నారు.

# నాటి నియామకాలు.. నేడు శాపాలై



కుప్పం : ద్రవిడ విశ్వవిద్యాలయంలో గత పాలకులు ఇష్టారాజ్యంగా పొరుగు సేవల ఉద్యోగులను నియమించడంతో ప్రస్తుతం జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ పనిచేసేందుకు 28 మందికి మాత్రమే 2010లో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయినా.. కాంగ్రెస్ హయాంలో అప్పటి పాలకులు 254 మందికి పొరుగు సేవల కింద ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో ఆ ఉద్యోగులంతా జీతాల కోసం పోరాటం చేస్తున్నారు.

ద్రవిడ విశ్వవిద్యాలయంలో దూరవిద్య ద్వారా యూజీ, పీజీతోపాటు ఆఫ్ క్యాంపస్ పీహెచ్‌డీల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకునేవారు. అప్పట్లో వర్సిటీకి పుష్కలంగా ఆదాయం వచ్చేది. న్యాక్ ఎ–గ్రేడు గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయాలకు మాత్రమే దూరవిద్యకు అనుమతులు ఇస్తామని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో నిబంధనలు విధించింది. దీంతో ద్రవిడలో దూరవిద్య కార్యకలాపాలు ఆగిపోయాయి. అప్పటి నుంచి జీతాల సమస్య ఏర్పడింది. ప్రస్తుతం న్యాక్ ద్రవిడ విశ్వవిద్యాలయానికి బి–గ్రేడు ఇచ్చింది.

**నాడు 144 రోజుల పోరాటం** వైకాపా హయాంలో ఇక్కడి 254 మంది ఉద్యోగులకు జీతాలు అందకపోవడంతో 144 రోజులపాటు నిరసనలు.. ధర్నాలు.. రాస్తారోకోలు చేపట్టారు. అప్పట్లో వారికి కంటితుడుపుగా అరకొర నిధులు అందించి చేతులు దులుపుకొన్నారు.

**'లెక్క' తేల్చాల్సిందే..!:** ప్రభుత్వం నుంచి ప్రతిసారీ నిధులు సర్దుబాటు చేయడం కుదరదు. ప్రత్యేక కమిటీ వేసినా.. జీతాల సమస్యకు పరిష్కారం లభించలేదు. పది మంది విద్యార్థులకు ఒక పొరుగు సేవల ఉద్యోగి ఉండాలి. వర్సిటీలో ప్రస్తుతం 1,407 మంది విద్యార్థులు ఉండగా. ఎంతమంది ఉద్యోగులకు ప్రతిపాదనలు పంపాలో అర్థంకాక వర్సిటీ తలలు పట్టుకుంటున్నారు.

**స్పందించిన కూటమి ప్రభుత్వం:** కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనకు వచ్చారు. పొరుగు సేవల ఉద్యోగులు తమ జీతాలు ఇప్పించాలంటూ మొర పెట్టుకున్నారు. సీఎం తక్షణం ప్రత్యేక నిధుల నుంచి రూ. 2.86 కోట్ల నిధులు మంజూరు చేయించారు. పెండింగ్ జీతాలను చెల్లించిన వర్సిటీ పాలకులు ఆపై నిధుల కొరతతో జీతాలు ఆపేశారు.

త్వరలో జీతాలు అందిస్తాం.: రూ. 4.50 కోట్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో పొరుగు సేవల ఉద్యోగులకు జీతాలు అందిస్తాం. కిరణ్‌కుమార్, రిజిస్ట్రార్, ద్రవిడ వర్సిటీ

# స్వర్ణముఖిని ఊడ్చేస్తున్నారు!

నాయుడుపేట : మూడు మండలాల్లో స్వర్ణముఖినదిలో ఇసుకను అక్రమార్కులు ఊడ్చేస్తున్నారు. తాగునీటి పథకాలు, రైతుల పంపుసెట్ల వద్ద విచ్చలవిడిగా రాత్రి పగలు తవ్వకాలు జరిపి తరలిస్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు నిస్తేజంగా వ్యవహరిస్తున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు ఒకటి, రెండు రోజులు తవ్వకాలు నిలిపి అనంతరం యథావిధిగా ఇసుకను తరలిస్తున్నారు. కొందరు నాయకులు రాజకీయ పరపతితో రీచ్‌లు ఏర్పాటు చేసుకొని రెవెన్యూ, పోలీసుల సహకారంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్కులు చెప్పిన ధరలకే ఇసుకను కొనుగోలు చేయాల్సి రావడంతో మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లేకుంటే పోలీసులు వాహనాలు స్వాధీనం చేసుకుంటున్నారని కొందరు వాపోతున్నారు.

**ప్రమాదకరంగా తాగునీటి పథకాలు**

నాయుడుపేట పట్టణ పరిధిలో తాగునీటి పథకాలున్న ప్రాంతాల్లో స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు నిషేధించారు. పురపాలిక సంఘం తిమ్మాజికండ్రిగ కాజువేదగ్గర గేటు ఏర్పాటు చేశారు. ఈ గేటును మాఫియా స్వాధీనం చేసుకొని తమ వాహనాలు మాత్రమే నదిలోకి వెళ్లనిస్తున్నారు. లోతువానిగుంట, పాత, కొత్త బీడీకాలనీ, ఏల్.సాగరం ప్రాంతాల్లో భారీగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇక్కడ పురపాలిక సంఘానికి తాగునీటిని సరఫరా చేసే బావులు ఉన్నప్పటికీ తవ్వి తరలిస్తున్నారు.

**వాహనాలకు అనుమతి లేదు**

నాయుడుపేట పట్టణంలో ఇసుక తవ్వకాలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన గేటును తీసి ఉంచడంపై కమిషనర్ ఫజులుల్లాతో ప్రస్తావించగా ఎండ్లబండ్ల ద్వారా మాత్రమే ఇసుక తీసుకెళ్లడానికి



అనుమతి ఇచ్చామన్నారు. మిగిలిన వాహనాలు వెళ్లడానికి అవకాశం లేదన్నారు.

**గాడులు పూడ్చి దారులు**

పెళ్లకూరు మండలంలో పెన్నేపల్లి, చావాలి సమీపంలో ఇటీవల రెవెన్యూ అధికారులు ఇసుక దారులకు గాడులు తీసినా మళ్లీ పూడ్చి ఇసుక తరలిస్తున్నారు. ఓజిలి మండలం జోష్యులవారికండ్రిగ వాసులు ఇసుక తవ్వకాలకు అభ్యంతరాలు తెలిపినా తవ్వకాలు చేస్తూనే ఉన్నారు.

**అక్రమ రీచ్‌లున్న ప్రాంతాలివే..**

నాయుడుపేట మండలంలో భీమవరం, చిగురుపాడు, మూర్తిరెడ్డిపాళెం, అయ్యప్పరెడ్డిపాళెం, మర్లపల్లి, అన్నమేడు, పెళ్లకూరు మండలం చావాలి, పెన్నేపల్లి, కప్పగుంటకండ్రిగ, చింతపూడి, పుల్లూరు, కలవకూరు గ్రామాల్లో అనధికారరీచ్‌లు ఏర్పాటుచేసి భారీగా ఇసుక తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో సాగునీటి పంపుసెట్లు ఉన్న రైతులు భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆందోళన చెందుతున్నారు.

# శ్రీకాళహస్తికి పరిశ్రమల హారం

శ్రీకాళహస్తి : కూటమి పాలనలో శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిశ్రమల హారంగా మారనుంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిసారించి ప్రణాళికలు రూపొందించాలని సమీక్షిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

గతంలో తెదేపా ప్రభుత్వంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రం–1, 2గా ఏర్పేడు– వెంకటగిరి ప్రధాన రహదారిపై ఈఎంసీ–3గా కేటాయించి ఏపీఐఐసీకి పెద్దఎత్తున భూములు కేటాయించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ



నేపథ్యంలో ఈఎంసీ–1,2లో 830.5 ఎకరాల ఏపీఐఐసీకి భూములు కేటాయించగా.. 330 ఎకరాల్లో రూ.వేల కోట్లు పెట్టుబడులతో డిక్సన్, సిలికాన్, కార్బన్, టీసీఎల్ వంటి 56 భారీ పరిశ్రమలను ఏర్పాటుకు పండగలా భూమి చేశారు. అప్పటికే 30కిపైగా పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించడం గమనార్హం.

**పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు**

ఈఎంసీ–1, 2, 3లో వెయ్యి ఎకరాలకు పైగా ఏపీఐఐసీకి కేటాయించిన భూములు అందుబాటులో ఉండటంతో పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి నూతన పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై ప్రత్యేక దృష్టిసారిస్తూ అధికారులతో చర్చలు జరపడంతో రానున్న రోజుల్లో కదలికలు ఏర్పడనున్నాయి.

**తెదేపా హయాంలో శ్రీకారం**

తిరుపతి ప్రాంతం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు సమీపంలో ఉండటంతో 2014లో పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెదేపా శ్రీకారం చుట్టింది. అతి తక్కువ కాలంలోనే దేశంలోనే ఆదర్శవంతమైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా మార్చేందుకు సంకల్పించారు. తర్వాత ప్రభుత్వం మారడంతో అభివృద్ధి కుంటుపడింది.

**వైకాపాలో వెనుదిరిగినవెన్నో**

వైకాపా ఐదేళ్ల పాలనలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకాకపోగా జియో, విన్‌టెక్, ఎయిల్‌డిక్సన్, ఫాక్స్‌లింక్ వంటి కొన్ని ప్లాంట్‌లు వెనుదిరిగాయి. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు సమీపంలో అపాచీ పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఏపీఐఐసీకి కేటాయించి భూములు బీడు భూములగానే దర్శనమిస్తున్నాయి.

# బె'ధర'గొడుతున్నారు

చిత్తూరు : వ్యవసాయ శాఖలో అన్నదాతకు వ్యక్తిగత యంత్ర పరికరాలు అందించే యాంత్రీకరణ పథకం ఐదేళ్ల తరవాత అమల్లోకి వచ్చింది. కొన్ని పరికరాలపై 50శాతం.. మరికొన్నింటికి నిర్దేశిత మొత్తాన్ని రాయితీగా నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే వీటి ధరలు ఎక్కువగా నిర్ణయించడం గమనార్హం.. తైవాన్ స్ప్రేయర్‌నే పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖ ప్రైవేటు కన్నా రూ. 4,132 అధికంగా నిర్ణయించింది. ఇదే స్ప్రేయరుకు ఉద్యానశాఖ రూ. 10 వేలు రాయితీ ఇస్తుండగా రైతులు రూ. 23 వేలకే కొనుగోలు చేసి బిల్లులు సమర్పిస్తున్నారు.

**తగ్గిపోతున్న సాయం..**

వ్యవసాయ శాఖ సీలింగ్ నిర్ణయించడం వల్ల అన్ని పరికరాలపై 50 శాతం రాయితీ అందడం లేదు. పైకా కొన్నింటి ధరలను అధికంగా



పేర్కొనడంతో రైతుకు వాస్తవంగా దక్కే ఆర్థిక ప్రయోజనం 25 నుంచి 30 శాతమే ఉంటోంది. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన మేరకు అన్నదాతకు లబ్ధి చేకూరడం లేదు. ఉద్యానశాఖలో అమలవుతున్న యాంత్రీకరణ పథకం వారికి మేలు చేసేలా ఉంది. ఎందుకంటే రైతులే స్వయంగా బేరమాడి కొనుగోలు చేసి బిల్లులు పెడుతుంటే అధికారులు రాయితీ జమ చేస్తున్నారు. సాధారణంగా ఒక్క పరికరాన్నే కొనుగోలు చేసే రైతు బాగా బేరమాడితే వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. అలాంటిది రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో పరికరాలు కొనుగోలు చేసినప్పుడు ధర ఇంకా తగ్గాల్సి ఉంది. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

**పెరిగింది ఇందుకేనంటా..**

నోడల్ ఏజెన్సీగా ఉన్న ఆగ్రోస్‌కు 2శాతం కమీషన్, జీఎస్టీ కారణంగా ధరలు పెరిగాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులు యంత్రాలు సరఫరా చేసిన కంపెనీలకు రాయితీ సొమ్ము జమ చేసేందుకు 3–4 నెలలు సమయం పడుతుండటంతో ఆయా కంపెనీల ధరలు ఐదు నుంచి 10 శాతం అధికంగా ఉన్నాయని మరికొందరు అధికారులు పేర్కొంటున్నారు.

**అంతంత మాత్రంగానే దరఖాస్తులు**

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యంత్రీకరణ పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు ప్రభుత్వం ఈ నెల మూడో తేదీన ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలకు లక్ష్యాలను కేటాయించి జిల్లా వ్యవసాయాధికారులకు పంపింది. 24 రోజులు గడిచినా ఉమ్మడి జిల్లాలో కేవలం 1,208 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇక మూడు రోజులే గడువు ఉందని ఈలోగా రైతులు దరఖాస్తు చేసుకుని నాన్ సబ్సిడీ చెల్లించిన వారికి ఆగ్రోస్ ద్వారా యాంత్రీకరణ పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తామని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆగ్రోస్ జిల్లా మేనేజరు శశిచంద్రమౌళిరెడ్డి తెలిపారు.

చురకలు

శుక్రవారం 9 మే 2025

# అవస్థ.. ఆధార్ లేక!

కందుకూరు : పాఠశాలల్లో ప్రవేశానికి ఆధార్ తప్పనిసరి. దీంతో పాటు మరే ఇతర పత్రాలు లేని కొందరు పిల్లలు.. వారి ప్రాథమిక విద్యాహక్కును కోల్పోతున్నారు. అధికారిక ధ్రువీకరణ పత్రాలు లేక ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు పొందలేకపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏళ్లుగా ఈ తరహా సమస్యలు వింటున్నారేగానీ.. పరిష్కారం మాత్రం చూపడం లేదు.

**వేలాది మందికి.. సమస్య**

జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి ఈ సమస్య ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని శివారు కాలనీల్లో అధికంగా ఉంది. సాధారణంగా ఆసుపత్రుల్లో కాన్పు జరిగితే.. అక్కడి సిబ్బంది బిడ్డ, తల్లిదండ్రుల వివరాలను పురపాలికల్లోనో, పంచాయతీల్లోనో అందజేస్తారు. తదనుగుణంగా జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర పత్రాలు మంజూరవుతాయి. గిరిజనులు, సంచారల జాతుల వారు ఇళ్ల వద్ద ప్రసవం జరిగాక.. ఆ వివరాలు ప్రభుత్వ కార్యాలయాల్లో అందించకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఏదో ఒక ధ్రువీకరణపత్రం ఉంటేనే ఆధార్ నమోదు చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. ఆధార్ లేని విద్యార్థులు కందుకూరు పట్టణంలో 91 మంది ఉండగా.. రూరల్‌లో 78, గుడ్లూరు 80, కొండాపురం 75, వరికుంటపాడు 28, లింగసముద్రం 82 మంది ఉన్నారు. కావలి, ఆత్మకూరు, నెల్లూరు విద్యాశాఖ సబ్ డివిజన్లను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ తరహా విద్యార్థుల సంఖ్య వేలల్లోనే ఉంటుంది. ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి.. సమస్య పరిష్కరించాలని




పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**లేకుండానే పాఠశాలకు..**

– పద్మ, విద్యార్థి తల్లి, జనార్దన కాలనీ

మా కాలనీలో ఎస్టీలు ఎక్కువ మంది ఉన్నాం. మహిళల్లో అధిక శాతం మంది ఇళ్ల వద్దే పురుడు పోసుకుంటుండటంతో.. పుట్టిన పిల్లల వివరాలు ప్రభుత్వ కార్యాలయాల్లో అందజేయడం లేదు. దాంతో మా పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు లేవు. ఆధార్ తీయిద్దామని కేంద్రాలకు వెళితే.. జనన సర్టిఫికెట్ కావాలంటున్నారు. దాంతో ఆధార్ లేకుండానే బడికి పంపిస్తున్నాం.

**పథకాలు అందడం లేదు...**

– అక్షయ, విద్యార్థిని, విప్పగుంటరోడ్డు

మేము విప్పగుంట రోడ్డులో నివాసం ఉంటున్నాం. అమలనాథునిపాలెం ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నా. నాకు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు లేదు. గత ఏడాది మా స్నేహితులకు 'అమ్మఒడి' అందినా.. నాకు మంజూరు కాలేదు. ఆధార్ లేకపోతే.. ఇక ఏ పథకం అందదని చెబుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం** చాలా మంది ఎస్టీ పిల్లలకు ఆధార్ కార్డులు ఉండటం లేదు. జనన, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే ఇస్తామంటున్నారు. విద్యా, రెవెన్యూశాఖల ఉన్నతాధికారులతో మాట్లాడి.. అందించేందుకు చర్యలు తీసుకుంటాం.పి.పి. నరసింహారావు, కందుకూరు ఉప విద్యాశాఖాధికారి

# టిడ్కో ఇళ్లు.. మళ్లీ కాంతులు

నెల్లూరు: సొంత ఇల్లు ప్రతి ఒక్కరి కల. దాన్ని నెరవేర్చేందుకు నాడు తెదేపా ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు.. గత వైకాపా పాలకులు గండికొట్టారు. నిరుపేదల కోసం చేపట్టిన టిడ్కో ఇళ్లపై అయిదేళ్లూ కక్ష సాధించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఈ నెలాఖరులోపు లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఆదేశించడంతో.. జిల్లా అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

**90 శాతం పూర్తి**

ఇప్పటికే గుత్తేదారులకు చెల్లించాల్సిన రూ. 40 కోట్లను ఏర్పాటు చేసింది. కొత్తగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వెంకటేశ్వరపురం–1 4,800, కావలిలో 2,112, నెల్లూరుపాళెం 1056, కందుకూరు 1408 ఇళ్లను పూర్తి చేయగా.. అల్లీపురంలో 3984, అక్కచెరువుపాడులో 1576, కల్లూరుపల్లిలో 912, కొండ్లపూడిలో 288 ఇంకా నిర్మించాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో ఎస్టీపీలు, పార్కులు మినహా.. మిగిలిన అన్ని సౌకర్యాలు కల్పించారు.

**రుణాలు ఇప్పిస్తేనే...**జిల్లాలో మొత్తం 31,888 ఇళ్ల నిర్మాణం చేపట్టగా– వీటిలో 24,928 పూర్తి చేశారు. 15,707 లబ్ధిదారులకు




ఇచ్చినట్లు చెబుతున్నా.. ఆ మేరకు ఆక్యుపెన్సీ రేషియో లేకపోవడం గమనార్హం. వీరిలో 5,712 మందికి రుణాలు అవసరంగా కాగా.. ఇప్పటి వరకు 3,320 మందికి రూ.100 కోట్లు అందజేశరు. ఇంకా 2,392 మందికి రూ. 96.73 కోట్లు అవసరం ఉంది. దీన్ని అధిగమిస్తే.. టిడ్కో ఇళ్లు.. ఊళ్లుగా మారుతాయి.

**మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం**

జిల్లాలో టిడ్కో ఇళ్లను 94.70 శాతం పూర్తి చేయగా.. 98.90 శాతం మౌలిక సదుపాయాలు కల్పించాం. వాటిని స్థానిక సంస్థలకు అప్పగించాం. లబ్ధిదారులు ఇప్పుడు చేరినా.. ఎలాంటి ఇబ్బందులు ఉండవు. నగర, పురపాలక సంస్థలు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తున్నాయి. మహేష్, ఇన్‌ఛార్జి ఎస్ఈ, టిడ్కో

# మేలుకోకపోతే.. కన్నీటి కష్టాలే!



కదిరి : ఎండలు మండిపోతున్నాయి. వేసవి తాపానికి తాగునీటి అవసరమూ పెరిగింది. దాహార్తికి, దైనందిన కార్యక్రమాలకు సాధారణ రోజులకంటే నీటి అవసరం ఎక్కువగా ఉంటోంది. కదిరి మున్సిపాలిటీకి పార్నపల్లి చిత్రావతి రిజర్వాయరు నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ముదిగుబ్బ మండలం దొరిగల్లులోని పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్లతో నీటిని కదిరికి పంపింగ్ చేస్తున్నారు. అయితే రెండు రోజుల కిందట ఒక మోటారు రిపేరీకి గురైంది. ఫలితంగా సాధారణ రోజుల్లో పంపింగ్ చేసిన నీటిలో సగం మాత్రం కదిరి పట్టణానికి చేరుతోంది. దీంతో జనాభా అవసరాలకు తగిన నీరు సరఫరా జరగక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మోటారు మరమ్మతుకు పది రోజుల సమయం పడుతుందని సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రకటించారు. ఈ నెల 17 వరకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అయితే నీటి ఎద్దడి అధిగమించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై తీసుకున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మేలుకోకపోతే రోజులు గడిచేకొద్దీ సమస్య తీవ్ర రూపం దాల్చనుంది.

**ప్రత్యామ్నాయ చర్యలు ఏవీ?**

వేసవి కావడంతో ప్రస్తుతం పట్టణంలో రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నారు. దొరిగల్లు పంప్‌హౌస్‌లో రెండు మోటార్లు పని చేసినప్పటి పరిస్థితి అది. గత రెండు రోజులుగా ఒక మోటారు మాత్రమే పనిచేస్తుండటంతో సరిపడినంత నీరు పంపింగ్ చేయలేకపోతున్నారు. ఫలితంగా మూడు, నాలుగు రోజులకోసారి నీరు సరఫరా చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి అవసరాలు పెరగనున్నాయి. దీంతో మున్సిపాలిటీ సరఫరా చేసే నీరు ఏమాత్రం పట్టణ ప్రజలకు సరిపోవు. ఒక మోటారుతోనే పంపింగ్, దీనికితోడు విద్యుత్తు కోతలు, వృథా అయ్యే నీటితో సమస్య మరింత జటిలం కానుంది. మున్సిపల్ అధికారులు ముందుచూపుతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాల్సి అవసరం ఉంది.

**ఇబ్బంది లేకుండా సరఫరా-సందీప్, మున్సిపల్ సహాయ ఇంజినీరు**

మోటారు మరమ్మతుకు గురైనా ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా సరఫరా చేస్తాం. ఇప్పటికే పట్టణంలోని ప్రధాన ట్యాంకులన్నీ నీటితో నింపాం. ఒక మోటారు పనిచేసినా మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాలకు నీళ్లందేలా చూస్తున్నాం. వేసవిని దృష్టిలో పెట్టుకునే మోటార్లు బాగు చేయిస్తున్నాం. తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.

# ఐదేళ్ల నిర్లక్ష్యానికి స్వస్తి.. ఇండోర్ స్టేడియం పూర్తి




మడకశిర : తెదేపా హయాంలో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని ఐదేళ్ల పాటు క్రీడాకారులకు అందుబాటులోకి రాకుండా వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టింది. మారుమూల ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో ఎంతో మంది పేద విద్యార్థులు అరకొర సౌకర్యాలతోనే క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగి ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. 2017లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టారు. 2019 నాటికి 85శాతం పనులు పూర్తి చేయగా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం పట్టించుకోలేదు. దీనిపై 'ఈనాడు' కథనాలు ఇవ్వడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 3 నెలల్లో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. ఈ నెలలో క్రీడా శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**వందల మంది క్రీడాకారులకు ఉపయోగం**

స్టేడియం ప్రారంభమైతే ఇందులో షటిల్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, టెన్నిస్ తదితర క్రీడల్లో శిక్షణ పొందడానికి అవకాశం ఉంటుంది. ఇండోర్ క్రీడలు ఆడేందుకు క్రీడాకారులు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పూర్తి కావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఇండోర్ స్టేడియానికి ఎదురుగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని యువత, మహిళలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం వేళల్లో మైదానానికి వస్తుంటారని, బహిరంగ వ్యాయామశాల ఎంతగానో ఉపయోగపడుతుందని త్వరితగతిన పూర్తి చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. స్టేడియం ఈ నెలలో క్రీడాకారులకు అందుబాటులోకి రానుంది.

**అన్ని ఏర్పాట్లు ఉన్నాయి - కార్తీక్, మడకశిర**

తెదేపా హయాంలో ప్రారంభమైన ఇండోర్ స్టేడియం గత ఐదేళ్లలో పూర్తికాక వృథాగా ఉండేది. ప్రస్తుతం స్టేడియాన్ని పూర్తిగా నిర్మించి అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇండోర్ క్రీడలు ఆడాలని అనుకున్న ఈ ప్రాంత క్రీడాకారులకు ఒక వరంగా మారనుంది. వెంటనే ప్రారంభించి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

**శిక్షకుడిని నియమిస్తే బాగు.. - హరిప్రసాద్, క్రీడాకారుడు, మడకశిర**

వెనుకబడిన ప్రాంతం కావడంతో ఇండోర్ ఆటలు ఆడేందుకు పిల్లలు, యువత, విద్యార్థులకు శిక్షకులను నియమిస్తే బాగుంటుంది. క్రీడల్లో ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది ప్రతిభ చూపి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఇండోర్ స్టేడియం ప్రారంభించడం అందరికీ ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

# పురం మున్సిపాలిటీకి ఇంజినీర్ల కొరత




హిందూపురం : పట్టణాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగాలన్నా, నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నా ఇంజినీరింగ్ విభాగమే కీలకం. రెండు లక్షల జనాభా ఉన్న హిందూపురం పట్టణంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో అధికారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీ తరపున ఏ పనికి టెండర్లు పిలిచి, పనులు చేయించాలన్నా మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) తప్పనిసరి. ఆరు నెలలుగా ఈఈ లేక రూ.లక్ష కన్నా ఎక్కువ విలువైన పనికి టెండర్లు పిలవలేకపోతున్నారు. గతంలో టెండర్లు పిలిచి, గుత్తేదారులను ఖరారు చేసిన పనులకు వర్క్ ఆర్డర్లు ఇవ్వాలంటే ఈఈ సంతకం చేయాల్సి ఉంది. దీంతో పనులు చేయలేకపోతున్నారు.

**తప్పని భారం..**మున్సిపాలిటీలో ఒక్క ఈఈ, నలుగురు డీఈలు, నలుగురు ఏఈలు ఉండాలి. అయితే ఈఈతో పాటు రెండు డీఈ, రెండు ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఇద్దరు డీఈలు ఉండగా ఒకరు సెలవులో ఉన్నారు. ఉన్న ఒక్కరూ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇతరత్రా పనులతో పని భారం పెరిగి అల్లాడిపోతున్నారు. క్షేత్రస్థాయిలో పనులను చేయించాల్సిన ఏఈలు ఇద్దరే ఉన్నారు. ఒక్క ఏఈ పూర్తిగా నీటి సరఫరాను చూడాల్సి ఉంది. మిగిలిన అన్నీ పనులు మరో ఏఈ చూడాల్సి వస్తోంది.

**ఇవీ కష్టాలు..**పట్టణంలో రూ. 1.50 కోట్ల కరవు నిధులతో నీటి సరఫరాను మెరుగుపర్చడానికి టెండర్లు పిలిచి గుత్తేదారును ఖరారు చేశారు. అయితే వర్క్ ఆర్డర్ ఇవ్వకపోవడంతో పనులు జరగలేదు. ఇంటింటా చెత్త సేకరణకు ఆటోలు నిలిచిపోయిన తరువాత, చెత్తను తోపుడు బండ్ల(పుష్‌కార్ట్‌లు)తో కార్మికులు సేకరిస్తున్నారు. ఇవి అవసరమైనన్ని లేవు. రూ.20 లక్షలతో గతంలోనే టెండర్లు పిలిచి, గుత్తేదారును ఖరారు చేశారు. ఆయన వాటిని సరఫరా చేసినా తీసుకోవడానికి ఈఈ అనుమతి అవసరం.

గొల్లపల్లి ప్రాజెక్టులో పలు పంపుహౌస్‌ల వద్ద మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఇన్‌టెక్‌వెల్ వద్ద స్టార్టర్లు దెబ్బతిని ప్రమాదాలు జరిగి, విద్యుదాఘాతంతో కార్మికులు గాయపడుతున్నారు. వాటికి మరమ్మతులు అవసరం.

పారిశుద్ధ్య విభాగ కార్మికులకు వస్త్రాలు, కొబ్బరినూనె, బూట్లు, పనిచేయడానికి పరికరాలు అందించాల్సి ఉంది. ఈఈ లేక టెండర్లు పిలవలేకపోతున్నారు. నీ నీటి సరఫరాను పర్యవేక్షణ చేయడానికి ఇంజినీర్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పారిశుద్ధ్య విభాగాన్ని పర్యవేక్షించడానికి పర్యావరణ ఇంజినీర్ లేక, ఇతరులతో చేయించాల్సి వస్తోంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..–** శ్రీనివాసులు, పుర కమిషనర్, హిందూపురం ఇంజినీరింగ్ విభాగంలో అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే.. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఇంజినీర్లను నియమిస్తామని వారు తెలిపారు.

# చెత్త తరలింపులో.. అవినీతి కంపు!

నెల్లూరు: నెల్లూరును చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలన్న ప్రజాప్రతినిధుల కల.. కలగానే మిగిలిపోతోంది. ఇప్పటికే పారిశుద్ధ్య నిర్వహణలో ప్రత్యేక సిబ్బంది పేరుతో దోపిడీకి పాల్పడిన కొందరు అధికారులు.. తాజాగా చెత్త తరలింపు వాహనాల ఏర్పాటులోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నెల్లూరు నగర, రూరల్‌లో చెత్త తరలింపు వాహనాలను గుత్తేదారులు పంచుకున్నారు. టెండర్ల పేరుతో మభ్యపెట్టి.. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.వేయి అదనంగా దక్కించుకున్నారు. అలా అయినా.. సేకరణ సక్రమంగా చేస్తున్నారా? అంటే అదీ లేదు. నిర్దేశించిన ట్రిప్పుల కంటే తక్కువే. అధికారం అండ ఉండటంతో.. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రశ్నించే సాహసం చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. మొత్తంగా ప్రజాధనం వృథా కావడంతో పాటు నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**నెలకు రూ. 31 లక్షల దోపిడీ**

నగరంలో నిత్యం 350 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీన్ని మొదట ఇళ్ల నుంచి సేకరించి.. ట్రాక్టర్లలో బోడిగారితోట దగ్గరున్న డంపింగ్ యార్డుకు తరలిస్తారు. అనంతరం అక్కడి నుంచి దొంతాలి యార్డుకు తీసుకువెళతారు. వైకాపా ప్రభుత్వంలో క్లాప్ వాహనాలు ఏర్పాటు చేశారు. పేరుకు 95 కేటాయించినా.. వాటిలో 65 మాత్రమే వినియోగ



ంలోకి వచ్చాయి. అందులోనూ చాలా పనిచేయలేదు. గుత్తేదారు ఫైనాన్స్ కట్టకపోవడంతో.. వాటిని స్వాధీనం చేసుకున్నారు. దాంతో నగరంలో చెత్త తరలింపునకు ఒప్పంద ప్రాతిపదికన ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకోగా.. కొందరు వాటిని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. మొత్తం 105 ట్రాక్టర్లు తీసుకోగా.. వాటిని నగర, రూరల్ నియోజకవర్గాల నాయకులు పంచుకున్నారు. అంతటితో ఆగకుండా.. గతంలో రోజుకు ట్రాక్టర్ అద్దె రూ. 2,750 చెల్లిస్తుండగా.. ఆ మొత్తాన్ని రూ. 3,750కి పెంచి తీసుకున్నారు. దాంతో నగరపాలక సంస్థకు రోజుకు రూ. 1.05 లక్షలు కాగా.. నెలకు రూ. 31.50 లక్షలకు నష్టం వాటిల్లుతోంది.

దీనిపై నగరపాలక సంస్థ ఎస్ఈ రామమోహన్‌రావు వివరణ కోరగా.. చెత్త తరలింపునకు అద్దె ప్రాతిపదికన ట్రాక్టర్లు తీసుకున్నామని.. టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించామని అన్నారు. వారు సక్రమంగా తరలిస్తున్నారో? లేదో? చూడాల్సిన బాధ్యత పారిశుద్ధ్య విభాగానిదని తెలిపారు.

# స్త్రీనిధి.. స్వశక్తి పెన్నిధి

ఒంగోలు : మహిళలు స్వయం ఉపాధిని మెరుగుపర్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏటా రుణాలు మంజూరు చేస్తోంది. జీవనోపాధి యూనిట్ల ఏర్పాటుతో నెలవారీ వాయిదాల్లో రుణాన్ని తిరిగి చెల్లించేలా లబ్ధిదారులకు వెసులుబాటు కల్పించింది. సొమ్ము అవసరమున్న సభ్యులు సులభంగా రుణం పొందవచ్చు. స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించి స్వశక్తితో ఆర్థికంగా ఎదగొచ్చు. అందుకు స్త్రీనిధి రుణం అక్కరకు రానుంది.

**సంఘానికి రూ.5 లక్షలు:** జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే వాణిజ్య బ్యాంకుల ద్వారా సంఘానికి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు రుణం మంజూరవుతోంది. అవి కాకుండా సభ్యులు ఎవరైనా ఉపాధి యూనిట్ విస్తరణ, ఇతర అవసరాలకు అదనంగా నగదు కావాలంటే సదరు సంఘం సభ్యుల తీర్మానంతో మండల డీఆర్డీఏ–వెలుగు కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెండు రోజుల్లోనే మంజూరు చేస్తారు. సభ్యులు ఎందరున్నా ఒక్కో సంఘానికి గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు, ఒక మహిళకు రూ.లక్ష చొప్పున ఇవ్వనున్నారు.



**దాపరికానికి లేదు చోటు**

గతంలో సంఘంలో సభ్యులకు తెలియకుండా రుణాలు వాడుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అందుకు తావు లేదు. రుణం పొందిన సభ్యురాలు లేదా కుటుంబ సభ్యులకు స్మార్ట్ చరవాణి ఉంటే.. ప్లేస్టోర్ నుంచి స్త్రీనిధి ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా ఈ నెలాఖరులోపు అమల్లోకి తేనున్నారు. సభ్యురాలి ఫోన్ నంబరుతో సంఘం పేరు, ఇతర వివరాలను అందులో నమోదు చేయాలి. అనంతరం వన్‌టైం పాస్‌వర్డ్ వస్తుంది. ప్రతి నెలా రుణ వాయిదాను తిరిగి ఆన్‌లైన్ ద్వారా నేరుగా.. లేదంటే గ్రామ సమాఖ్య సంఘానికైనా చెల్లించొచ్చు. తద్వారా ఇతరులు దారి మళ్లించే అవకాశం ఉండదు.

**మహిళలు సద్వినియోగం చేసుకోవాలి**

డాక్యుమెంటేషన్ పూర్తి చేసిన 48 గంటల్లోనే సభ్యురాలికి రుణం మంజూరు చేస్తాం. తొలుత సంఘానికి జమ చేసి, ఆ తర్వాత వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు నగదు జమ అవుతుంది. రూ.50 వేల రుణం రెండేళ్లు, రూ.లక్ష రుణం అయితే చెల్లించేందుకు మూడేళ్లు గడువు విధించగా, అందుకు వడ్డీ 11 శాతం చొప్పున వసూలు ఉంటుంది. అవసరమైన వారికి సత్వరమే రుణాలు మంజూరు చేస్తాం. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. హర్షవర్ధన్, ఏజీఎం, స్త్రీనిధి సంస్థ

## అదిదా సర్ప్రైజ్ సాంగ్ కాంట్రవర్సీ.. కేతికా ఏం చెప్పిందంటే..

నితిన్, శ్రీలీల జంటగా నటించిన 'రాబిన్‌హుడ్' సినిమా ఇటీవల విడుదలై ఫ్లాప్ టాక్ ను అందుకున్న విషయం తెలిసిందే. వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో కేతికా శర్మ 'అదిదా సర్ప్రైజ్' అనే స్పెషల్ సాంగ్‌లో కనిపించింది. ఈ సాంగ్‌లో ఆమె డ్యాన్స్ సినిమాకు మంచి హైప్ తీసుకొచ్చినప్పటికీ, ఆ సాంగ్‌లోని కొన్ని డాన్స్ స్టెప్స్ వివాదాస్పదంగా మారాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన ఈ పాటకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా, నీతి మోహన్, అనురాగ్ కులకర్ణి గాత్రం అందించారు. ఈ సాంగ్‌లోని కొన్ని స్టెప్స్ అసభ్యకరంగా ఉన్నాయని, మహిళలను అవమానకరంగా చూపించాయని నెటిజన్లు, మహిళా సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. ఈ వివాదం తెలంగాణ మహిళా కమిషన్ దృష్టికి వెళ్లడంతో, సుమోటోగా కేసు నమోదు చేసి, సినిమా టీంకు నోటీసులు జారీ చేసింది. దీంతో నిర్మాతలు థియేటర్



వెర్షన్‌లో ఆ వివాదాస్పద స్టెప్స్‌ను తొలగించారు. తర్వాత యూట్యూబ్‌లో విడుదలైన లిరికల్ వీడియోలోనూ ఆ స్టెప్స్‌ను కత్తిరించారు. ఈ వివాదం సినిమాకు ఊహించని పబ్లిసిటీ తెచ్చినప్పటికీ, రాబిన్‌హుడ్ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఈ వివాదంపై కేతికా శర్మ స్పందిస్తూ, తాను డైరెక్టర్ సూచనల మేరకే నటించానని వివరణ ఇచ్చింది. "నేను డైరెక్టర్ చెప్పినట్లు చేశాను. నేను డైరెక్టర్స్ యాక్టర్‌ని, కంప్లీట్‌గా సరెండర్ అవుతాను. వారు చెప్పిన ప్రాసెస్‌ను ఫాలో అవుతాను, అంతకు మించి నేను ఆలోచించలేదు," అని అన్నారు. సినిమా అనేది ఆడియన్స్ కోసం తయారుచేసే ప్రోడక్ట్ అని, నచ్చితే ఎంజాయ్ చేస్తారు, లేకపోతే రిజెక్ట్ చేస్తారని, ఈ వివాదం, సాంగ్‌కు వచ్చిన మిశ్రమ స్పందనపై తనకు అవగాహన ఉందని చెప్పింది. ఈ సాంగ్ కొరియోగ్రఫీపై నెటిజన్లు, మహిళా సంఘాల నుంచి వచ్చిన విమర్శలు ఇండస్ట్రీలో మరోసారి బాధ్యతాయుతమైన చిత్ర నిర్మాణంపై చర్చకు దారితీశాయి. ఐటెం సాంగ్స్‌లో గ్లామర్ డోస్ పెంచడం, అసభ్యకర స్టెప్స్‌ను చూపించడం వంటివి విమర్శలకు కారణమవుతున్నాయి. ఇటీవల 'డాకు మహారాజ్' సినిమాలోని 'డబిడి డిబిడి' సాంగ్ కూడా ఇలాంటి విమర్శలను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. 'రాబిన్‌హుడ్' టీం మాత్రం విమర్శలను సీరియస్‌గా తీసుకుని, వివాదాస్పద స్టెప్స్‌ను తొలగించడం గమనార్హం.

## ట్రాలాలా సీక్రెట్ చెప్పేసిన సమంత!

హీరోయిన్ సమంత ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్ పేరుతో నిర్మాణ సంస్థ స్థాపించిన సంగతి తెలిసిందే. తొలి ప్రయత్నం గా శుభం అనే చిత్రాన్ని నిర్మిస్తుంది. కొత్త నటీనటుల్ని పరిచయం చేస్తూ సమంత నిర్మించిన చిత్రమిది. ఇందులో సామ్ ఓ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ట్రాలాలా నిర్మాణ సంస్థ పేరు రొటీన్ కు భిన్నంగా ఉండటంతో? దీని అర్దం ఏంటనే విషయాన్ని సమంత తొలిసారి రివీల్ చేసింది. సమంత చిన్నప్పుడు బ్రౌన్ గర్ల్ ఇన్ ది రెయిన్ ట్రాలాలా%-% అంటూ ఓ పద్యం ఎక్కువగా పాడేదట. సడెన్ గా ట్రాలాలా అనే పేరు గుర్తొచ్చే అదే పేరుతో నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసాను తప్ప అంతకు మించి మరే లాజిక్ లేదంది. తన సంస్థ ద్వారా కొత్త వాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే సంస్థను స్థాపించినట్లు తెలిపింది. ఎంతో మంది ప్రతిభావంతులున్నా సరైన



అవకాశాలు రాక పరిశ్రమకు రాలేకపోతున్నారు. అలాంటి వాళ్లకు ట్రాలాలా మంచి వేదిక అవ్వాలి. ప్రతిభావంతుల్ని పైకి తీసుకురావాలి. తాను కూడా ఎలాంటి సినీ బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చానని...సీనియర్లే కావాలనుకుంటే గౌతమ్ మీనన్ ఏమాయ చేసావేలో వాళ్లనే తీసుకుని చేసేవారు. కానీ నాకు ఆయన అవకాశం కల్పించారు కాబట్టే నేడు ఈ స్థానంలో ఉన్నానంది. ఈ సినిమాలో నటీనటుల్ని చూస్తుంటే తనకు పాత రోజులు గుర్తొచ్చాయంది. ప్రతిభా వంతులకు సరైన అవకాశాలు వస్తే అద్భుతాలు సృష్టించాగలరని ధీమా వ్యక్తం చేసింది. ట్రాలాలాకి సాధారణ పేరులు కంటే ట్రాలాలా అన్నది డిఫరెంట్ గా ఉండటంతోనే పెట్టానంది. శుభం కథ అంతా ధారావాహికతో ముడి పడి ఉంటుంది. సీరియల్స్ కి శుభం కార్డు ఎప్పుడు పడుతుందని అంతా ఎదురు చూస్తుంటారు. ఈ సినిమా కథకి..ధారావాహికకి సంబంధం ఏంటన్నది సినిమా చూస్తే తెలుస్తుందని తెలిపింది.





## రాజ్ “23” ట్రైలర్.. సినిమాపై అంచనాలు పెంచేలా..




మల్లేశం, 8 A.M మెట్రో చిత్రాలతో డైరెక్టర్ రాజ్ ఆర్.. ఆడియన్స్ ను అలరించిన విషయం తెలిసిందే. తన టాలెంట్ తో సినీ ప్రియులను మెప్పించారు. ఇప్పుడు నిజ జీవిత ఘటనల ఆధారంగా తెరకెక్కిన మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన తెరకెక్కించిన మూవీ '23'.. ఇప్పుడు రిలీజ్ కు సిద్ధమవుతోంది. రాజ్ ఆర్ రూపొందించిన ఆ సినిమాను టాలీవుడ్ హల్క్ రానా దగ్గుబాటి నేతృత్వంలోని స్పిరిట్ మీడియా సమర్పించగా.. స్టూడియో 99 గ్రాండ్ గా నిర్మించింది. తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించగా.. ఝాన్సీ, పావోన్ రమేష్, తాగుబోతు రమేష్, ప్రణీత్ వంటి పలువురు నటీనటులు ముఖ్యపాత్రల్లో నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న మూవీ.. మే 16వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ప్రమోషన్స్ లో మేకర్స్ స్పీడ్ పెంచారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ అందుకుంది. ఇప్పుడు అదే జోష్ తో ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుతం ట్రైలర్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. అయితే మూడు నిజజీవిత విషాద ఘటనలతో కూడిన కథతో సినిమా రూపొందినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. 1991 చుండూరు ఊచకోత, 1993 చిలకలూరి పేట బస్సు అగ్నిప్రమాదం, 1997 జూబ్లీహిల్స్ కారు బాంబు దాడి ఘటనల ఆధారంగా సినిమా ఉండనున్నట్లు స్పష్టమవుతోంది. కేవలం ఘటనలనే చూపించడం కాకుండా, వాటి వెనుక ఉన్న ఆందోళన, హింసకు ఆడియన్స్ కనెక్ట్ అయ్యేలా సినిమాను రాజ్ ఆర్ తీసినట్లు తెలుస్తోంది. సినిమాలో కథను వివరించడంలో తన మార్క్ ను క్లియర్ గా చూపిస్తారని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది.

మూవీలో ప్రతి రోల్ కు తగిన ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. ట్రైలర్ అందరినీ ఆకట్టుకుని సినిమాపై మంచి అంచనాలు పెంచుతోంది. నిజజీవిత ఘటనలను నెరేట్ చేస్తూ వచ్చిన డైలాగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లవ్ ట్రాక్ నేచురల్ గా ఉండి ఆకట్టుకుంటోంది. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ, మార్క్ కె రాబిన్ ఇంటెన్స్ మ్యూజిక్ ట్రైలర్ కు మెయిన్ అసెట్స్ గా నిలిచాయి. మరి మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## కాంతార2 ను వదలని ప్రమాదాలు...



కన్నడ సినీ ఇండస్ట్రీలో విషాదం చోటు చేసుకుంది. కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న కాంతార2 షూటింగ్ లో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో జూనియర్ ఆర్టిస్ట్ కపిల్ ప్రమాదవశత్తూ నదిలో నీట మునిగి ప్రాణాలు కోల్పోయి మరణించాడు. ఈ ఘటన ఉడిపి జిల్లా బైందూరులోని కొల్లూరులో జరిగింది. కపిల్ షూటింగ్ పూర్తయ్యాక తన టీమ్ తో కలిసి కొల్లూరులోని సౌపర్ణిక నదిలో ఈత కొట్టేందుకు వెళ్లగా, అక్కడ నీటి లోతు తెలియక నదిలో మునిగి చనిపోయాడని సమాచారం.

జూనియర్ ఆర్టిస్ట్ కపిల్ మరణంతో చిత్ర యూనిట్ తీవ్ర విషాదంలో ఉంది. కొల్లూరు పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాంతారా2 షూటింగ్ మొదలైనప్పటి నుంచి ఆ సినిమాను వరుసపెట్టి ప్రమాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. కొన్నాళ్ల కిందట కొల్లూరులోనే జూనియర్ ఆర్టిస్టులతో వెళ్తున్న బస్ సడెన్ గా బోల్తా పడింది. ఆ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోయినా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ తర్వాత గాలి వాన వల్ల రావడం వల్ల భారీ సెట్ కూలిపోయింది. సెట్ కూలినప్పుడు కూడా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ ఇప్పుడు ఈ తాజా ప్రమాదంలో ఒక జూనియర్ ఆర్టిస్ట్ ఏకంగా ప్రాణాలను కోల్పోయాడు. దీంతో అసలిలా ఎందుకు జరుగుతుందని కాంతార2 చిత్ర యూనిట్ అయోమయంలో పడింది. అయితే కపిల్ మరణం విషయంలో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికైతే అతను కేరళకు చెందిన వ్యక్తి అనే సమాచారం మాత్రమే ఉంది. ఇక సినిమా విషయానికొస్తే కాంతార సినిమా బాక్సాఫీస్ వద్ద ఎన్ని సంచలనాలు సృష్టించిందో కొత్తగా చెప్పనక్కర్లేదు. కన్నడలో రిలీజైన ఈ సినిమా రికార్డుస్థాయి కలెక్షన్లను సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. మొదటి పార్ట్ మంచి హిట్ గా నిలవడంతో రెండో పార్ట్ ను కాంతార: చాప్టర్1 పేరుతో తెరకెక్కిస్తున్నారు. 2022లో వచ్చిన కాంతార సినిమాకు ఇది ప్రీక్వెల్ గా తెరకెక్కుతుంది. అక్టోబర్2, 2025న కాంతార: చాప్టర్1 రిలీజ్ కానుంది. ఈ సినిమాపై అందరికీ భారీ అంచనాలున్నాయి.

## రెట్రో లుక్ లో అంచనాలు పెంచేస్తున్న హీరోయిన్

దుల్కర్ సల్మాన్ హీరోగా సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా పేరు కాంత. ఈ సినిమా నుంచి దుల్కర్ ఫస్ట్ లుక్ రిలీజై ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. 1950 నాటి స్టైల్ లో దుల్కర్ చాలా కొత్తగా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. కాంత ఫస్ట్ లుక్ వచ్చినప్పటి నుంచి ఈ సినిమాపై అందరికీ అంచనాలు పెరిగాయి. ఆ అంచనాలను ఏ మాత్రం తగ్గకుండా రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్ కాంత సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సినిమాపై ఇంట్రెస్ట్ ను, హైప్ ను పెంచడానికి చిత్ర యూనిట్ ఎప్పటికప్పుడు కాంత మూవీకి సంబంధించిన అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఆ సినిమా నుంచి కీలక నటుల లుక్స్ ను రిలీజ్ చేస్తోంది.





అందులో భాగంగానే తాజాగా కాంత సినిమాలోని హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే లుక్ ను రిలీజ్ చేసింది. ఇవాళ భాగ్యశ్రీ బోర్సే పుట్టినరోజు కానుకగా ఆమెకు బర్త్ డే విషెస్ తెలియచేస్తూ మేకర్స్ ఈ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో భాగ్యశ్రీ తనకు సరిగ్గా సూటయ్యే లుక్ లో ఎంతో అందంగా కనిపించింది. చీర కట్టు, గాజులు, బొట్టుతో అచ్చతెలుగమ్మాయిలా భాగ్యశ్రీ ఈ పోస్టర్ లో దర్శనమిచ్చింది. 1950 కాలం నాటి పాత్రలో భాగ్యశ్రీ భలే ఒదిగిపోయింది. కాంతలోని భాగ్యశ్రీ లుక్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది.

## సింపుల్ లుక్ తో కిల్ చేసిన శ్రద్ధా

బికినీలు స్విమ్ సూట్లు అవసరమే లేదు. ప్రతిసారీ గ్లామర్ షోతో కుర్రకారును టీజ్ చేయాల్సిన పని లేదు. ఈ భామ అలా సింపుల్ గా రొటీన్ డ్రెస్ లో ఒక్క ఫోటోగ్రాఫ్ వదిలితే చాలు. దానికి కోట్లాదిగా ఉన్న ఫాలోవర్స్ గగ్గోలు పెడతారు. అలాంటి గొప్ప ఫ్యాషన్ సెన్స్ శ్రద్ధా కపూర్ కి ఉంది. ఈ బ్యూటీ వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో వైరల్ అవుతున్నాయి. తాజాగా శ్రద్ధా షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. దీనిలో మెరూన్ కలర్ టీషర్ట్





ధరించిన శ్రద్ధా షార్ట్ హెయిర్ స్టైల్ తో కొంత ట్రెండీగా కనిపిస్తోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే శ్రద్ధా నటించిన స్త్రీ 2 సంచలన విజయంసాధించాక, అందరి దృష్టి స్త్రీ 3 పై ఉంది. తాజా ఇంటర్వ్యూలో రాజ్ కుమార్ రావు మాట్లాడుతూ కథ, స్క్రిప్టు రెడీగా ఉంటే తాము కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ చిత్రం 2018 చిత్రం స్త్రీకి సీక్వెల్ . మాడాక్ ఫిల్మ్ హర్రర్-కామెడీ విశ్వంలో భాగం. ఇందులో రాజ్ కుమార్ రావు, శ్రద్ధ కూడా ప్రధాన పాత్రల్లో నటించారు. స్త్రీ 3లోను ఈ కాంబినేషన్ రిపీటవుతుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536